మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130




ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 25 | ఆదివారం | 21-12-2025 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## శాసనమండలి కార్యదర్శిగా డాక్టర్ వి.నర్సింహాచార్యులు

తెలంగాణ శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి. నర్సింహాచార్యులను శాసనమండలి కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన స్థానంలో తెలంగాణ స్టేట్ వక్ఫ్‌బోర్డ్ ట్రిబ్యునల్ ఛైర్మన్ ఆర్. తిరుపతిని శాసనసభ కార్యదర్శిగా నియమించింది.






ఎర్రజెండాలన్నీ ఒకే గుర్తుపై పోటీచేసినప్పుడే

# కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయం

- కమ్యూనిస్టుల పోరాట, ఉద్యమ చరిత్రను చెరిపేస్తున్న బిజెపి
- ఆర్థిక, రాజకీయ అరాచకాలకు పాల్పడుతున్న మోదీ సర్కార్‌ను గద్దెదించాలి
- వామపక్షాలు, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమవ్వాలి
- వందేళ్ల సిపిఐ త్యాగాల, విజయాల స్ఫూర్తి సభలో పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి ఉద్ఘాటన

ప్రజాపక్షం/హైదరాబాద్

మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, ఆర్థిక, రాజకీయ అరాచకాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బిజెపిని గద్దె దించేందుకు వామపక్షాలు, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులన్నీ ఏకమై పోరాటం చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు. బిజెపి ప్రభుత్వం కొనసాగితే భవిష్యత్తులో కార్మిక, రైతు, యువజన, వ్యతిరేక చర్యలు మరింత ఉధృతమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్య ఉద్యమాలు అవసరమైనప్పటికీ ఎర్ర జెండాలన్నీ ఏకమై ఒకే గుర్తుపై ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే, ప్రజలు కమ్యూనిస్టులను ఒక ప్రత్యామ్నాయంగా చూస్తారన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్, నారాయణగూడలోని మార్వేల్ ఫంక్షన్‌హాల్‌లో సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం ''వందేళ్ల సిపిఐ త్యాగాల, విజయాల స్ఫూర్తి సభ'' జరిగింది. అంతకుముందు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను పల్లా వెంకట రెడ్డి ఆవిష్కరించి అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తరువాయి 12లో

ఇతర మతాలను కించపరిస్తే

# శిక్షకు చట్టం తెస్తాం

క్రిస్టియన్, ముస్లిం స్మశానవాటికల సమస్యను పరిష్కరిస్తాం
క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్



ఇతర మతాలను కించపరిస్తే శిక్షించే విధంగా శాసనసభలో ప్రత్యేక చట్టం తెస్తాం అని సిఎం ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఎల్‌బిస్టేడియంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు మహ్మద్ అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు, క్రిస్టియన్ మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ క్రిస్టియన్, ముస్లిం స్మశాన వాటికల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఎవరి మతాన్ని వారు ఆచరిస్తూనే ఇతర మతాలను గౌరవించాలని, మత ప్రాతిపదికన దాడులు చేయాలని చూసినవారిని, ఇతర మతాలను కించపరిస్తే శిక్షించే విధంగా శాసన సభలో చట్టం తీసుకువస్తామని, అలాంటి ఘటనలను ప్రభుత్వం అణచివేసిందని చెప్పారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి, ప్రేమను పంచాలి, శాంతిని పెంచాలి అని ఏసుక్రీస్తు చాటారని సిఎం అన్నారు. ద్వేషించే వారిని సైతం ప్రేమించాలని మానవాళికి ఏసుక్రీస్తు సందేశం ఇచ్చారన్నారు. డిసెంబర్ నెల క్రీస్తు ఆరాధకులకు మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి కూడా ఒక మిరాకిల్ మంత్ అని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నెల కూడా డిసెంబర్ నెలనే అని సిఎం గుర్తు చేశారు. ప్రభువు తరువాయి 2లో



అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

02



- ఎంజినరేగాపై మోదీ సర్కార్ బుల్డోజ్
- కోట్లాది మంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలను దెబ్బతీసింది
- యుపిఎ ప్రభుత్వం హయాంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ఒక విప్లవాత్మకమైన చర్య
- వీడియో సందేశంలో సోనియాగాంధీ ఉద్ఘాటన

కొత్త 'నల్ల'చట్టంపై

# పోరాడుతాం

**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కేంద్రంలోని మోదీ సర్కార్ బుల్డోజ్ చేస్తుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మండిపడ్డారు. పథకాన్ని రద్దు చేయడానికి ఉద్దేశించిన ఈ 'నల్ల చట్టాన్ని' దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది పార్టీ కార్యకర్తలు ధిక్కరిస్తారని ఆమె ఉద్ఘాటించారు. శనివారం ఆమె ఒక వీడియో సందేశమిచ్చారు. నరేగాను బలహీనపరచడం ద్వారా మోడీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలను దెబ్బతీసిందని ఆమె అన్నారు. గత 11 సంవత్సరాలుగా కేంద్రం గ్రామీణ పేదల ప్రయోజనాలను విస్మరించిందని ఆమె ఆరోపించారు. గ్రామీణ ప్రజలను ఉద్దేశించి సోనియా గాంధీ మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, పార్లమెంటులో ఏకాభిప్రాయంతో ఎంజినరేగా ఆమోదం పొందిన రోజు తనకు స్పష్టంగా గుర్తుందన్నారు. ఇది విప్లవాత్మకమైన చర్య అని అన్నారు. అణగారిన, దోపిడీకి గురైన, అత్యంత నిరుపేదలకు తరువాయి 2లో



మహాత్మాగాంధీ పేరును ప్రజల హృదయాల్లోంచి చెరపలేరు

- నరేగా పథకానికి తూట్లు పొడుస్తూ గాంధీ పేరును తొలగించడం అప్రజాస్వామికం
- గాడ్సేను పూజిస్తున్నందువల్లే ఈ చర్య
- మోదీ సర్కార్, బిజెపిపై కాంగ్రెస్ ఆగ్రహం
- 'విబి – జీ రామ్ జీ' పథకానికి వ్యతిరేకంగా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

సోనియా గాంధీ కుటుంబంపై కక్ష్య పూరితంగా కేసులు పెడుతున్నారు. గాంధీ, నెహ్రూ లెగసీని మరిపించే ప్రయత్నం చేస్తున్నారు. లౌకికవాద దేశంలో మోదీ, అమిత్ షా పప్పులు ఉడకవు, కులాలు మతం పేరుతో రాజకీయం చేసే వారికి గుణపాఠం తప్పదు.
– పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్

'గాంధీ'ల పేరెత్తితే

# వారి గుండెల్లో రైళ్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

గాంధీ కుటుంబాన్ని ధైర్యంగా ఎదుర్కొనే ధైర్యం ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాకు లేదని, గాంధీ కుటుంబం పేరు పలికితే మోదీ, అమిత్ షా, బిజెపి నేతల గుండెల్లో రైళ్లు పరిగెడతాయని పలువురు కాంగ్రెస్ నేతలు, రాష్ట్ర మంత్రులు అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగిచడంతో పాటు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన 'విబి – జీ రామ్ జీ' పథకాన్ని నిరసిస్తూ ఎఐసిసి పిలుపు మేరకు టిపిసిసి ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని మహాత్మా గాంధీ రోడ్‌లోని గాంధీ విగ్రహం వద్ద జరిగిన నిరసన ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, జి.వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, తరువాయి 2లో



ఏ సమయంలోనైనా

# ఉపాధి హామీ రద్దు

- పథకాన్ని నిలిపివేసే అన్ని అంశాలు అందులో ఉన్నాయ్
- బిల్లులో మొత్తం 125 రోజుల పాటు పనికి ఎలాంటి హామీ ఇవ్వలేదు
- మహాత్మా గాంధీ పేరును తొలగించడం ఒక్కటే సమస్య కాదు
- 'మురసోలి' సంపాదకీయంలో డిఎంకె విమర్శలు

**చెన్నై :** కొత్తగా తీసుకువచ్చిన 'విబి– జి రామ్ జి' బిల్లుపై బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తమిళనాడులో అధికార డిఎంకె తీవ్ర విమర్శలు గుప్పించింది. కేవలం మహాత్మా గాంధీ పేరును తొలగించడమే సమస్య కాదని పేర్కొంది. కొత్త బిల్లులో మొత్తం 125 రోజుల పాటు పనికి ఎలాంటి హామీ ఇవ్వలేదని, ఏ సమయంలోనైనా ఈ పథకాన్ని నిలిపివేయడానికి వీలు కల్పించే అన్ని అంశాలు ఇందులో తరువాయి 2లో

సిరియాలో ఉగ్రవాద స్థావరాలపై

# భారీ దాడులు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** సిరియాలో ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ శిబిరాలపై అమెరికా సైన్యం శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ప్రతీకార దాడులు చేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ దాడుల్లో ఐదుగురు ఉగ్రవాదులు మరణించారు. ఐఎస్ స్థావరాలపై దాడులు చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శనివారం ప్రకటించారు. డజ్జలకొద్దీ స్థావరాలపై ఈ దాడులు చేసినట్లు తరువాయి 2లో

మరింత కఠినంగా

# భూసేకరణ చట్టం

అమలు చేయాలని పార్లమెంటరీ కమిటీ విజ్ఞప్తి
చట్టబద్ధమైన నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఆందోళన



**న్యూఢిల్లీ :** భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం 2013 (ఎల్‌ఎఆర్‌ఆర్ యాక్ట్)ను ముఖ్యంగా షెడ్యూల్డ్ ప్రాంతాలలో కఠినంగా అమలు చేయాలని పార్లమెంటరీ కమిటీ కోరింది. చట్టంలోని నిబంధనల ఉల్లంఘనలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడిన ఒక నివేదికలో గ్రామీణాభివృద్ధి , పంచాయతీరాజ్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎంపి సప్తగిరి శంకర్ ఉల్క అధ్యక్షతన జరిగిన ఒక సమావేశంలో చట్టబద్ధమైన నిబంధనలు ఉన్నప్పటికీ ఆచరణలో ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మార్కెట్ లావాదేవీలు పరిమితం చేయబడిన షెడ్యూల్ ప్రాంతాలలో భూమిని తక్కువగా అంచనా వేయడం వంటి ఉల్లంఘనలు కొనసాగుతున్నాయి. షెడ్యూల్ ప్రాంతాలు అంటే రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ కింద నియమించబడిన తరువాయి 2లో

16 మంది ఎమ్మెల్యేలపై

# సిఎం అసహనం

- పంచాయతీ ఎన్నికల్లో రెబల్స్‌ను సమన్వయం చేయలేకపోవడంపై రేవంత్‌రెడ్డి ఆగ్రహం
- వైఖరి మార్చుకోవాలని ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

పంచాయతీ ఎన్నికలలో రెబల్స్‌ను సమన్వయం చేయలేని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరిగా పనిచేయని 16 మంది ఎంఎల్‌ఎలపై వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తరువాయి 2లో

ఏనుగులను

# ఢీకొన్న రైలు

- పట్టాలు తప్పిన సైరాంగ్-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్
- ఘటనలో ఏడు గజాలు మృతి, విచారణకు ఆదేశించిన అసోం సిఎం



**నాగావ్/గువాహటి :** రైలు ఢీకొట్టడంతో ఏనుగులు మృత్యువాత పడ్డాయి. శనివారం తెల్లవారుజామున అసోంలోని హోజాయ్ జిల్లాలో సైరాంగ్–న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు ఏనుగుల గుంపును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడు ఏనుగులు మృతి చెందగా, మరొకటి గాయపడిందని అధికారులు తెలిపారు. అయితే ఐదు బోగీలు, రైలు ఇంజన్ పట్టాలు తప్పాయన్నారు. మొదట ఎనిమిది ఏనుగులూ మరణించినట్లు వార్తలు వచ్చినా, తర్వాత వాటిలో ఒక తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇరాన్‌లో ఇజ్రాయెల్ గూఢచారికి ఉరిశిక్ష

**టెహ్రాన్:** గూఢచర్యానికి పాల్పడిన నేరంపై ఒక యువకుణ్ణి ఇరాన్ ఉరిశిక్ష అమలు చేసింది. ఇజ్రాయెల్ తరపున గూఢచర్యానికి పాల్పడినందుకుగాను ఈ శిక్ష అమలు చేసినట్లు ఇరాన్ న్యాయస్థానం ప్రకటించింది. ఈ ఏడాది ఇజ్రాయల్, అమెరికా సైన్యాలు 12 రోజులపాటు ఇరాన్‌లో దాడులు చేశాయి. ఇరాన్ అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుని కీలకస్థావరాలను ధ్వంసం చేమని ఈ రెండు దేశాలు ప్రకటించుకున్నాయి. దీనికి సంబంధించిన కీలక సమాచారం ఏ విధంగా బహిర్గతమైందన్న విషయంపై ఇరాన్ పోలీసులు, గూఢచారులు కొద్దినెలలుగా దర్యాప్తు చేస్తూ పలువురిని విచారించి ఉరిశిక్షలు అమలు చేస్తున్నారు. ఈ పరంపరలో భాగంగా మరో వ్యక్తిని కూడా ఉరితీశారు. అఘిక్ కేశవర్జ్ (27)ను శనివారం ఉదయం ఉరితీసినట్లు ఇరాన్ న్యాయవ్యవస్థ అధికార న్యూస్ ఏజన్సీ మిజాన్ ప్రకటించింది. కేశవర్జ్ ఒక అర్కిటెక్చర్ విద్యార్థి. ఈ ఏడాది ఆరంభంలోనే అతడిని అరెస్టు చేశారు. టెహ్రాన్, ఇస్ఫహాన్, ఉర్మియా, షహ్రౌద్ నగరాలలో దాదాపు 200 గూఢచారి కార్యకలాపాలను కేశవర్జ్ నిర్వహించాడని న్యాయస్థానం పేర్కొంది.

## బంగ్లాదేశ్ హిందూ కార్మికుడి హత్యకేసులో ఏడుగురు అరెస్టు

**ఢాకా/న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ మైమన్‌సింగ్ నగరలోని పారిశ్రామిక కార్మికుడు దీపూ చంద్ దాస్ (25) హత్య కేసులో పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం శనివారం మధ్యాహ్నం ఎక్స్ వేదికగా ఈ విషయం ప్రకటించింది. జులై ఉద్యమ నాయకుడు, ఒస్మాన్ హది మరణానంతరం బంగ్లాదేశ్‌లో అల్లర్లు చెలరేగిన తర్వాత అల్లరిమూకలు దీపూ చంద్ దాస్‌ను కొట్టి చంపి అతడి శవాన్నీ దహనం చేశారు. ఐతే 48 గంటల్లోనే నేరస్థులను పట్టుకున్నామని ప్రభుత్వం ప్రకటించింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈ అరెస్టులు చేశారు. అరెస్టయినవారిలో 19 నుండి 46 ఏళ్ళ లోపు వయసువారు నిందితులుగా ఉన్నారు. పోలీసులు చెప్పిన సమాచారం ప్రకారం దాస్ ఒక పరిశ్రమలో కార్మికుడు. తమ దేవుణ్ణి దూషించారన్న ఆరోపణలపై ఆయనను అల్లరిమూకలు మొదట కర్మాగారం వెలుపల తీవ్రంగా కొట్టి గాయపరిచాయి. ఒక చెట్టుకు ఉరితీశాయి. జాతీయ రహదారి పక్కనే అతడి మృతదేహాన్ని దగ్ధం చేసి అల్లరి మూకలు అక్కడి నుండి పరాయయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మహ్మద్ యూనుస్ నాయకత్వానగల తాత్కాలిక ప్రభుత్వం ఈ చర్యను తీవ్రంగా ఖండించింది. నేరస్థులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌లో తరచు ఇటీవలికాలంలో హిందూ కుటుంబాలపై దాడులు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్‌లో ఉన్న భారత హై కమిషన్ కార్యాలయం ఒక ప్రకటన చేస్తూ భారతీయులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. అనవసర ప్రయాణాలు చేయవద్దని, ఊరిగే బయట తిరగొద్దని, అప్రమత్తంగా ఉంటూ రక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది.

**భారత్ భూభాగంలో ఇద్దరు బంగ్లాదేశీ యువకులు హత్య**

సరిహద్దుల్లో సిల్హెట్ నగరం సమీపంలో ఇద్దరు బంగ్లాదేశీ యువకులను భారత్‌కు చెందిన ఖాసీవర్గీయులు కాల్చి చంపారని బంగ్లాదేశ్ పత్రికలు శనివారం వార్త ప్రచురించాయి. టీ తోటలతో అంత్యత సుందరమైన టూరిస్టు ప్రదేశాలున్న సిల్హెట్ వద్ద భారత్ ఈశాన్యరాష్ట్ర భూభాగంలోకి చొరబడి తోటలలో ఒక్కలను దొంగిలించారన్న నేరంపై ఇద్దరు బంగ్లాదేశీ యువకులను శనివారం మధ్యాహ్నం కాల్చి చంపారని వార్త వెలువడింది. ఒస్మాన్ హదీ మరణానంతరం చెలరేగిన అల్లర్లలో మైమన్‌సింగ్ నగరంలోని హిందూ పారిశ్రామిక కార్మికుడు దీపూ చంద్ దాస్ (25)ను చంపి జాతీయ రహదారిపై దహనం చేసిన ఘటన తర్వాత ఈ యువకుల హత్య ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దందమా సరిహద్దు ప్రాంతంలో భారత్ భూభాగంలో జరిగిన ఈ ఘటనలో మరణించిన బంగ్లాదేశీ యువకులను మహ్మద్ అషిక్వర్ (19), మొసైద్ అలీ (22)గా గుర్తించినట్లు బంగ్లాదేశ్ సరిహద్దు గార్డులు ప్రకటించారు.

# ప్రపంచం ముందు గర్వంగా నిలబడతాం

### ఒస్మాన్ హదీకి బంగ్లాదేశ్ నేత యూనుస్ నివాళి

**ఢాకా:** బంగ్లాదేశ్ 'జులై ఉద్యమం' నాయకుడు, 'ఇంక్విలాబ్ మంచో' పార్టీ వ్యవస్థాపకుడు ఒస్మాన్ హది (32)కి ఢాకాలో వేలాదిమంది శనివారం అంతిమ నివాళులు అర్పించారు. భారీ భద్రత మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హంతకులను 24 గంటల్లో పట్టుకోకపోతే ఉద్యమం ప్రారంభిస్తామని ఇంక్విలాబ్ మంఛో పార్టీ హెచ్చరించింది. అతడి ఆత్మకోసం స్వర్గలోక ద్వారాలు తెరచుకోవాలని కోరుతూ నమాజ్–ఎ–జనజ ప్రార్థనలు నిర్వహించారు. బంగ్లాదేశ్ పార్లమెంటు సమీపంలోని మానిక్ మియా ఎవెన్యూలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సౌత్ ప్లాజా జతియా సంఘ్సద్ భవన్ వద్ద జరిగిన అంత్యక్రియల కార్యక్రమానికి ముందు శనివారం మధ్యాహ్నం బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ కూడా పాల్గొన్ని ప్రార్థనలు చేశారు. "బంగ్లాదేశ్ జాతి నిన్ను ఎన్నటికీ మరచిపోదు, నీ త్యాగం వృథా కాబోదు, నీవు ఎప్పటికీ దేశానికి స్ఫూర్తి రగిలిస్తూనే ఉంటావు, నీవు మరణించలేదు, మా మధ్యే ఉన్నావు, అనేక తరాలపాటు మాతోనే ఉంటావు, ఇక్కడకు వచ్చిన వేలాదిమంది నీకు వీడ్కోలు పలకడానికి రాలేదు, నీ స్ఫూర్తిని తీసుకుని నీపట్ల చిత్తశుద్ధి ప్రకటించేందుకు వీరంతా ఇక్కడకు వచ్చారు,నీవు మాకొక మంత్రోపదేశం చేశావు, బంగ్లాదేశ్ జాతి ఎన్నటికీ తలవంచుకుని నిలబడదు, అన్ని జీవన రంగాలకు నీ స్ఫూర్తిని తీసుకువెళతాం, ప్రపంచం ముందు గర్వంగా నిలబడతాం" అని నివాళులు అర్పించారు.



"హది బంగ్లాదేశ్ ఎన్నికల్లో పోటీచేసి రాజకీయాలలో తన దార్శనికతను భాగం పంచాలనుకున్నాడు, ఆయన మనకు ఒక మార్గం చూపించాడు, ఆ మార్గంలో కొనసాగుదాం, దేశంలో ప్రతి పౌరుడుకీ న్యాయం జరిగేలా చూస్తాం" అని భరోసా ఇస్తూ, ప్రజలు శాంతి, సహనం పాటించాలని కోరారు. ఊహించ నిరీతిలో వేలాదిమంది ఈ ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్నారు. బంగ్లాదేశ్ జాతీయ కవి కాజీ నజ్రుల్ ఇస్లాం సమాధి పక్కనే హదిని కూడా ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో యూనుస్‌తోపాటు ఆయన మంత్రివర్గ సభ్యులు, ఆర్మీ చీఫ్ జనరల్ వాకెర్ ఉజ్ జమాన్ హాజరయ్యారు. ప్రతిపక్ష బిఎన్‌పి పార్టీ మాజీ ప్రధానమంత్రి ఖలీదాజియా తరపున నాయకులు, జమాత్ ఎ ఇస్లామీ, నేషనల్ సిటిజెన్స్ పార్టీ నాయకులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

శనివారం దేశవ్యాప్తంగా సంతాపదినం పాటించారు. హది గౌరవార్థం జాతీయ పతాన్ని అవనతం చేశారని హదీకి చెందిన "ఇంక్విలాబ్ మంచ్" పార్టీ అధికార ప్రతినిధి చెప్పారు. వందల మంది గుంపులు గుంపులుగా ప్రదర్శనలు చేస్తూ మానిక్ మియా ఎవెన్యూకు చేరుకున్నారు. బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాలలో రెండో రోజు కూడా అక్కడక్కడ హింసాత్మక ఘటనలు జరిగాయి. హదీకి న్యాయం చేయాలని, ఆయన త్యాగాలు వృథా కారాదని యువకులు నినాదాలు చేశారు. షేక్ హసీనా భారత్ భూభాగం నుండి దేశంలోకి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని, భారత్‌కు పారిపోయి వెళ్ళిన నేరస్థులకు భారతదేశం ఆశ్రయం ఇస్తోందని వారు నినాదాలు చేశారు. హది అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చేవారితో ఢాకా మెట్రో రైళ్ళు, వాహనాలన్నీ కిక్కిరిసిపోయాయి. అనేకవందలమంది కాలినడకన వెళ్ళారు.

**పత్రికాస్వేచ్ఛపై దాడి**
**బంగ్లాదేశ్ పత్రికా సంఘాల విమర్శ**

బంగ్లాదేశ్‌లో ప్రధానంగా కొన్ని మీడియా సంస్థలను లక్ష్యంగా చేసుకుని దహనాలు, దోపిడీలు, దాడులు జరిగాయి. బంగ్లాదేశ్ జర్నలిజం అధ్యాయంలో ఇది చీకటి రోజు అని గురువారం హింసాకాండపై పలు పత్రికలు వ్యాసాలు రాశాయి. వాస్తవానికి దాడికి గురైన మీడియాలు కూడా ఒస్మాన్ హదీని జాతీయ హీరోగానే చూశాయి. ఈ దాడి బంగ్లాదేశ్ పత్రికాస్వేచ్ఛపై దాడిగా పలు పత్రికా సంఘాలు పేర్కొన్నాయి. ఉద్దేశపూర్వకంగా దాడులు చేసినవారిని చట్టం ముందు నిలబెట్టాలని బంగ్లాదేశ్ పత్రికా సంఘాలు కోరాయి. ఢాకా యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ సజ్జాద్ అలమ్ ఖాన్ తపు, ప్రధాన కార్యదర్శి అఖ్తర్ హుస్సేన్ మీడియా కార్యాలయాలపై దాడులను తీవ్రంగా ఖండించారు. బంగ్లాదేశ్‌లో జర్నలిస్టులు, వారి కుటుంబాలు అభద్రతకు గురవుతున్నాయని, వారిని భద్రత కల్పించాలని కోరారు. దాడులు చేసినవారిని అడ్డుకోడానికి ప్రయత్నం చేసిన సంబంధిత సంపాదకులు, ముఖ్యులను అల్లరిమూకలు తీవ్రంగా దూషించి అవమానించారని చెప్పారు.

కాగా ఒస్మాన్ హదిపై కాల్పులకు, మరణానికి ఎలాంటి సంబంధం లేని మీడియాపై అల్లరి మూకలు దాడులు చేయడంపట్ల బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారుడు మహ్మద్ యూనుస్ విచారం వ్యక్తం చేశారు. మీడియాకు, జర్నలిస్టులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రదర్శకులు శాంతి, సహనం పాటించాలని కోరారు.

డిసెంబరు 12న రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న హదీ ఒక మసీదు లోపలి నుండి వస్తుండగా ముసుగుమనిషి కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అతడిని సింగపూర్‌కు తరలించగా గడచిన గురువారం రాత్రి హది మరణించాడు. మరణవార్త తెలియగానే బంగ్లాదేశ్‌లో అల్లర్లు మొదలయ్యాయి. హింసాకాండ చెలరేగింది. మీడియా సంస్థలను కూడా ధ్వంసం చేశారు. మీడియా సిబ్బంది దాదాపు మృత్యువుదాకా వెళ్ళి వెనక్కు వచ్చారు. పత్రికా కార్యాలయాలు ధ్వంసమయ్యాయి.

# ఒడిసా పోర్టు సిటీపై రష్యా దాడులు

### ఎనిమిది మంది మృతి

**మాస్కో:** ఉక్రేన్‌లోని నల్లసముద్ర రేవు పట్టణం ఒడిసా తీర ప్రాంతం లో రష్యా భారీ దాడులు చేసింది. ఈ దాడుల్లో ఎనిమిది మంది మరణించారు. మరో 27 మంది గాయపడ్డారు. ఉక్రేన్ అధికారులు ఈ విషయం ప్రకటించారు. రష్యా దళాలు అదేపనిగా తమ రేవు నగరాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగిస్తోందని తెలిపారు. పివ్‌డెన్నే పట్టణంలో ఉన్న మౌలిక సదుపాయాలపై కూడా క్షిపణి దాడులు చేసి తీవ్ర నష్టం కలిగించిందని తెలిపారు. కొంతమంది బస్సులో ప్రయాణం చేసి వెళుతుండగా ఈ దాడులలో చిక్కుకుని మరణించారు. గడచిన తొమ్మిది రోజులుగా రష్యా తమ రేవు నగరం ఒడిసాను లక్ష్యంగా చేసుకుని క్షిపణి దాడులు ఆపకుండా కొనసాగిస్తోందని ఉక్రేన్ అధికారులు చెప్పారు.

**రష్యన్ ఆస్తుల బహిరంగ దోపిడీ**

యూరప్‌లో విదేశాలలో స్తంభింపజేసిన రష్యన్ ఆస్తులను ఉక్రేన్ ప్రయోజనాలకోసం ఉపయోగించే ప్రయత్నాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. యూరోపియన్ యూనియన్ నాయకులు రష్యా ఆస్తులను బహిరంగంగా దోపిడీ చేయడానికి సిద్ధపడుతున్నారు. ఏడాది పరిణామాలపై పుతిన్ పత్రికాగోష్ఠి నిర్వహించారు. పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. దొంగలు ఏదైనా రహస్యంగా దొంగిలిస్తారు, కానీ ఇక్కడ బహిరంగ దోపిడీ చేస్తున్నారు, ఇది దోపిడీ అనే మాట కంటే చాలా పెద్దది అని ఆయన విమర్శించారు. ఉక్రేన్‌కు 90 మిలియన్ యూరోలు రుణం ఇస్తున్నట్లు ప్రకటన వెలువడిన తర్వాత పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "వారు మన ఆస్తులను దోచుకుంటామని ప్రకటించలేదు, కానీ వాటిని సురక్షితం చేసి వాటిపై రుణం ఉక్రేన్‌కు ఇస్తున్నారు, అంటే యూరప్ దేశాలు చాలా వరకూ ఆర్థిక నష్టాలలో, ఆర్థిక సంక్షోభంలో కొనసాగుతున్నాయని బడ్జెట్‌లోటు ఎదుర్కొంటున్నాయని తెలుస్తోందన్నారు. ఫ్రాన్స్ దేశ జాతీయ రుణం 120 శాతం ఉంటే రష్యా రుణం 17.7 శాతం మాత్రమేనన్నారు. ఫ్రాన్స్ బడ్జెట్‌లోటూ ఆరు శాతంగా ఉందని, కానీ రష్యా బడ్జెట్ లోటు 2.7 శాతం మాత్రమేనని, వచ్చే ఏడాదినాటికి ఇది 1.6 శాతానికి చేరుతుందని అన్నారు. ఎదుటివారిని దోచుకోవడానికి నిర్ణయం తీసుకోవడం అంతసులభమైన విషయం కాదని అన్నారు.

## ఎప్స్టీన్ ఫైల్స్‌లో 550 పేజీలు విడుదల

**వాషింగ్టన్:** అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఎడిట్ చేసిన ఎప్స్టీన్ ఫైల్స్‌లోని 550పైగా పేజీలను విడుదల చేసింది. గతంలో కోర్టు ఇచ్చిన అనుమతి మేరకు ఈ ఫైల్స్‌ను విడుదల చేయడం ప్రారంభించారు. ఐతే అమెరికా ప్రతిపక్షాలు ఈ చర్యను తీవ్రంగా విమర్శించాయి. సున్నితమైన భాగాలను తొలగించారని, సమాచారం సరిగ్గా లేదని విమర్శించారు. జస్టిస్ డిపార్ట్‌మెంట్‌విడుదల చేసిన పేజీలలో కొన్ని ఫోటోలు కూడా ఉన్నాయి. జెఫ్రీ ఎప్స్టీన్ ఇంటి లోపలిభాగాలు, ఇతరులతో దిగిన ఫొటోలున్నాయి. డెమోక్రటిక్‌పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. బాహాటత్వ విధాన చట్టాన్ని ఉల్లంఘించారని ఆ పార్టీ నాయకులు విమర్శించారు.

## భూసేకరణ చట్టం

**(మొదటి పేజీ తరువాయి)**

పెద్ద గిరిజన జనాభా ఉన్న ప్రాంతాలు, గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక పాలనను మంజూరు అందిస్తాయి. సరూన డాక్యుమెంటేషన్ లేదా స్థానిక భాషలో సామాగ్రి లభ్యత లేకుండా ఆలస్యమైనా లేదా పైపై గ్రామసభ సంప్రదింపులు, సంప్రదింపు ప్రక్రియన నుండి మహిళలు, బలహీనవర్గాలను మినహాయించడం, ప్రభావిత వర్గాలతో నిజమైన ఆమోదయోగ్యమైన ఒప్పందం లేకుండా సమ్మతి ధృవీకరణ పత్రాలను యాంత్రికంగా జారీ చేయడంపై కూడా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. డిసెంబరు 18న పార్లమెంట్ ముందు ప్రవేశపెట్టబడిన ఈ నివేదిక ఎల్ఎఆర్ఆర్ చట్టంలో గ్రామసభల ముఖ్యమైన పాత్రను ఎత్తి చూపింది. గ్రామసభ సమ్మతిని కాగితంపై కేవలం లాంఛనప్రాయంగా పొందే సంఘటనలు పెరుగుతున్నాయి. వాస్తవానికి సంబంధిత ప్రాజెక్ట్‌ల వల్ల జనాభాలో ఎక్కువ మంది ప్రభావితం కాకుండా అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఎ) 2006 నిబంధనలు ఉల్లంఘించి అటవీ భూమిని సేకరిస్తున్న మానవ సందర్భాల గురించి కమిటీకి సమాచారం అందించబడిందని నివేదిక పేర్కొంది. అటవీ వర్గాల భూమి, వనరుల హక్కులను కాపాడటానికి ఎల్ఎఆర్ఆర్ చట్టం, ఎఫ్ఆర్ఎ మధ్య అనుసంధానం చాలా అవసరమని కూడా ఆ నివేదిక పేర్కొంది. కొన్ని సందర్భాలలో సామాజిక ప్రభావం అంచనాను (ఎస్ఐఎ), పర్యావరణ ప్రభావ అంచనా (ఇఐఎ)లను లాంఛనంగా నిర్వహిస్తున్నారు. నివేదికలు, కొనుగోళ్లకు అనుకూలంగా ఉన్నాయి. కొన్ని సందర్భాలలో భూమి విలువను చాలా వరకు లెక్కించాలని చట్టం చెబుతున్నప్పటికీ సర్కిల్ రేట్లు పాతవి లేదా తక్కువగా నిర్ణయించబడ్డాయి. కాబట్టి మూల విలవ బలహీనంగా ఉందని కమిటీ తెలియజేసింది. డిస్ట్రెస్ సేల్ డీడ్‌లు ధరలను తగ్గిస్తాయని, సరైన సేల్‌డీడ్‌లు చాలా తక్కువ కాబట్టి మార్కెట్ విలువ నిజమైన విలువను ప్రతిబింబించదు అని కమిటీ పేర్కొంది. అంతేకాకుండా గిరిజన కుటుంబాలను సజీవంగా ఉంచే సాధారణ వనరులైన మేత భూములు, కమ్యూనిటీ అటవీ వనరుల ప్రాంతాలు, పవిత్రమైన తోటలు, నీటివనరులు, సాగు ప్రాంతాలను మార్చడం, వెదురు, తేనె, వంట చెరుకు, మేత, ఔషధ మొక్కలు, అడవి ఆహారాలు మొదలైన వాటిని సేకరించే మార్గాలు వదిలివేయబడ్డాయని కమిటీ నివేదిక పేర్కొంది. జాతీయ పర్యవేక్షణ కమిటీ (ఎన్ఎంసి) పనితీరును కూడా ఆ కమిటీ ప్రశ్నించింది. కెన్ బెట్వా లింక్, పోలవరం వంటి ప్రాజెక్ట్‌లను కాలానుగుణంగా సమీక్షిస్తున్నప్పటికీ స్థిరనివాసులలో అసంతృప్తిని చల్లార్చలేకపోయిందని నివేదిక వెల్లడించింది. సంస్థాగత యంత్రాంగాలు ఉన్నప్పటికీ భూసేకరణ, పరిహారం, పునరావాసం, పునరావాసాలకు సంబంధించిన ఫిర్యాదులలో గణనీయమైన తగ్గుదలలు లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది.కెన్‌బెట్వాతో సహా ఈ ప్రాజెక్ట్‌లో పర్యావరణ, సామాజిక సరిహద్దులను దాటి నీరు మళ్లించడం కలిగిఉంటాయని, అటవీ భూమి, నదీ ఆవాసాలు, వరదమైదానాలు, సహజవనరులను స్వాధీనం చేసుకోవడం లేదా మళ్లించడం అవసరమని కమిటీ పేర్కొంది.ఒడిశాలోని నిపుణుల సమర్పణలలో రాయగడ, కలహండి జిల్లాల పరిపాలనా యంత్రాంగాలు సిజిమాలి బాక్సైట్ గనుల కోసం ఏకపక్ష ప్రక్రియలను అనుసరించాయని, అటవీ భూములు, గ్రామ ఉమ్మడి భూములను మళ్లించడం, నకిలీ గ్రామ సభలను నిర్వహించడం వంటివి ఉన్నాయని కమిటీ నివేదిక పేర్కొంది.

## ఉపాధిహామీ రద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఉద్యోగ హామీ పథకం నుండి గాంధీ పేరును తొలగించడమే సమస్య కాదని, ఆ పథకం అసలు లక్ష్యమే దెబ్బతిందని, ఇదే ప్రధాన సమస్య అని డిఎంకె పత్రిక 'మురసోలి' పేర్కొంది. గాంధీ పేరును తొలగించిన మొత్తం వ్యవహారంలో ఇతర సమస్యలు కనుమరుగయ్యాయని, గాంధీజీ పేరును తొలగించడం వల్ల ఆయన ప్రతిష్టకు ఎలాంటి నష్టం వాటిల్లదని, ఆయన పేరును తొలగించడం వల్ల ప్రజలు ఆయనను మరింత ఎక్కువగా గుర్తుంచుకుని, ఆయన గురించి మాట్లాడుకుంటున్నారని మురసోలి డిసెంబర్ 20, 2025 నాటి తన సంపాదకీయంలో పేర్కొంది. అధికార పార్టీ 'జి రామ్ జి' గ్రామీణ ఉపాధిహామీ బిల్లును వ్యతిరేకించడానికి 10 కారణాలను కనుగొన్నది. ఆ పేరును పలకడానికి కూడా చాలా కష్టంగా ఉందని తిరస్కరించింది. గ్రామీణ భారతదేశానికి 125 రోజుల పాటు హామీతో కూడిన ఉద్యోగాలను కల్పించే వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) లేదా 'విబి– జి రామ్ జి' బిల్లును పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన విషయం తెలిసిందే. కేంద్రం, రాష్ట్రాల మధ్య 60:40 నిష్పత్తిలో వ్యయ పంపిణీ రాష్ట్రాల నిధులను 'దోచుకోవడమే' అని డిఎంకె పేర్కొంది. కొత్త పథకంలో 125 రోజుల పాటు పని కల్పిస్తామని చెబుతున్నప్పటికీ అది కచ్చితంగా జరగదని, ద్రవిడ తమిళ దినపత్రిక ఒక నిబంధనను ఉదహరించింది. దీని ప్రకారం... రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ఆర్థిక సంవత్సరంలో విత్తనాలు వేయడం, పంట కోయడం వంటి ప్రధాన వ్యవసాయ కాలాలను కలుపుకొని, మొత్తం అరవై రోజుల కాలాన్ని ముందుగానే తెలియజేయాలి. ఈ కాలంలో, 'విబి– జి రామ్ జి' చట్టం కింద పనులు చేపట్టరాదు. ఈ నిబంధన వ్యవసాయ పనులలో పాల్గొనని వారిని ప్రభావితం చేస్తుంది. అలాగే, లబ్ధిదారులను కేంద్ర బహుమితీయ పేదరిక సూచిక (ఎంపిఐ) ఉపయోగించి జాబితా చేయనున్నారు. ఇది పేదరికాన్ని నిర్మూలించడానికి పోరాడుతున్న తమిళ నాడు వంటి రాష్ట్రాలను నేరుగా ప్రభావితం చేస్తుంది. కొంత డేటాను ఉదహరించి పేదరికం నిర్మూలించబడిందని చెప్పి కొత్త పథకాన్ని నిలిపివేయవచ్చు. పాత చట్టం ప్రకారం, ఉద్యోగం పొంద డం ప్రజల హక్కు, ఇప్పుడు కొత్త బిల్లు ప్రకారం, ఉద్యోగాలు అందుబాటులో ఉంటేనే అందిస్తారు. ఈ కొత్త చర్య సమాఖ్య స్ఫూర్తికి, రాష్ట్ర స్వయంప్రతిపత్తికి విరుద్ధంగా ఉంది. ఒక నిబంధన ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఉద్యోగాలను కేంద్రమే నిర్ణయించే అధికారాన్ని కల్పిస్తుంది. ఇటువంటి నిబంధన బిజెపియేతర పాలిత రాష్ట్రాలకు ద్రోహం చేయడానికి దారితీస్తుంది. గత చట్టంలా కాకుం డా, పని కల్పించలేని పక్షంలో పరిహారం అందించడానికి ఇందులో ఎలాంటి అవకాశం లేదు. 125 రోజుల పాటు ఉద్యోగాలు కల్పిస్తారనే హామీ కూడా లేదు. ఈ కొత్త బిల్లులో ఈ పథకాన్ని ఎప్పుడైనా నిలిపివేయడానికి వీలు కల్పించే అన్ని లక్షణాలు ఉన్నాయి. కాగా, ఎఐఎడిఎంకె అధినేత ఎడప్పాడి కె పళనిస్వామిని లక్ష్యంగా చేసుకుని ఉపాధి హామీ పథకానికి జాతిపిత పేరును పునరుద్ధరించాలని కేవలం ఒక ప్రకటన జారీ చేసినందుకు డిఎంకె పత్రిక ఆయనపై విమర్శలు గుప్పించింది. 'పళనిస్వామి ఈ పథకంలో చేసిన ఇతర మార్పులన్నింటినీ అంగీకరిస్తున్నారా? ఇంకా, సిఎఎ, మూడు వ్యవసాయ చట్టాల (తరువాత రద్దు చేయబడ్డాయి) విషయంలో దేశం చూసిన విధంగానే, పళనిస్వామి ప్రజలను మోసం చేసే తన జిమ్మిక్కును పునరావృతం చేస్తున్నారని డిఎంకె పత్రిక ఆరోపించింది.

## పోరాడుతాం

**(మొదటి పేజీ తరువాయి)**

జీవనోపాధి మార్గంగా మారిందని మాజీ పార్టీ అధ్యక్షురాలు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కారణంగా వలసలు ఆగిపోయాయని, ఉపాధికి చట్టపరమైన హక్కు కల్పించబడిందని, గ్రామ పంచాయతీలకు సాధికారత లభించిందని ఆమె అన్నారు. 'మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్య స్ఫూర్తితో కూడిన భారతదేశ కలను సాకారం చేసే దిశగా ఎంజినరేగా ద్వారా ఒక పటిష్టమైన అడుగు పడిందని సోనియాగాంధీ ఉద్ఘాటించారు. 'కానీ ఇటీవల ప్రభుత్వం ఈ విప్లవాత్మకమైన పథంపై బుల్డోజర్ నడపడం చాలా విచారకరమన్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించడమే కాకుండా, ఎలాంటి చర్చ లేకుండా, ఎవరినీ సంప్రదించకుండా, ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోకుండా ఈ పథకం స్వరూపాన్ని, నిర్మాణాన్ని ఏకపక్షంగా మార్చారని మండిపడ్డారు. కొత్త చట్టం ప్రకారం, ఎవరికి ఎంత ఉపాధి, ఎక్కడ, ఏ పద్ధతిలో లభిస్తుందో, క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఉన్న ఢిల్లీలోని ప్రభుత్వమే నిర్ణయిస్తుందని ఆమె వాపోయారు. ఎంజి నరేగాను తీసుకురావడంలో, అమలు చేయడంలో కాంగ్రెస్‌కు కీలక పాత్ర ఉందని పేర్కొంటూ, ఇది ఎప్పుడూ ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదని ఆమె స్పష్టం చేశారు. 'ఇది జాతీయ ప్రయోజనాలకు, ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన పథకం. ఈ చట్టాన్ని బలహీనపరచడం ద్వారా మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా గ్రామీణ రంగంలోని కోట్లాది మంది రైతులు, కార్మికులు, భూమిలేని పేదల ప్రయోజనాలను దెబ్బతీసిందన్నారు. ఈ దాడిని ఎదుర్కోవడానికి తామందరం సిద్ధంగా ఉన్నామన్నారు. '20 సంవత్సరాల క్రితం, మన పేద సోదర సోదరీమణులకు ఉపాధి హక్కును కల్పించడానికి నేను కూడా పోరాడాను; ఈ రోజు, ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడటానికి నేను కట్టుబడి ఉన్నాను. నాలాంటి కాంగ్రెస్ నాయకులందరూ, లక్షలాది మంది కార్యకర్తలు మీకు అండగా నిలుస్తారు' అని సోనియాగాంధీ తన వీడియో ప్రకటనలో అన్నారు. రద్దు చట్టానికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని క్షేత్రస్థాయికి తీసుకువెళ్తామని కాంగ్రెస్ ఇంతకు ముందు పేర్కొంది. గురువారం పార్లమెంట్ 20 ఏళ్ల నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం లేదా ఎంజినరేగా స్థానంలోకి తీసుకురావడానికి ఉద్దేశించిన 'విబి–జి రామ్ జి' బిల్లును ఆమోదించింది.

## ఢీకొన్న రైలు

**(మొదటి పేజీ తరువాయి)**

ఏనుగు పిల్ల గాయాలతో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. తెల్లవారుజామున 2.17 గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో ప్రయాణికులెవరూ గాయపడలేదన్నారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ అటవీ శాఖను వివరణాత్మక విచారణ జరిపి, వన్యప్రాణుల కారిడార్లను సురక్షితం చేయాలని ఆదేశించగా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ ఈ ప్రమాదానికి ప్రస్తుత ప్రభు త్వం హయాంలో ప్రణాళికారహితంగా, సరైన నియంత్రణ లేకుండా జరుగుతున్న అభివృద్ధి కారణమని ఆరోపించారు. ఈ ప్రమాదం తర్వాత పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించగా, కొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు. నాగావ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సుహాస్ కదమ్ పిటిఐతో మాట్లాడుతూ చాంగజురాయ్ గ్రామం లో దట్టమైన పొగమంచు కారణంగా జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు తెలిపారు. మరణించిన ఏనుగులకు పోస్ట్‌మార్టం జరుగుతోంది, గాయపడిన ఏనుగుకు స్థానిక పశువైద్యులు చికిత్స అందిస్తున్నారన్నారు. ఎన్ఎఫ్ఆర్ చీఫ్ అధికార ప్రతినిధి కపింజల్ కిషోర్ శర్మ మాట్లాడుతూ ఈ ప్రమాదం ఏనుగుల కారిడార్‌గా గుర్తించని ప్రదేశంలో జరిగిందని పేర్కొన్నారు. రైలు డ్రైవర్ ఏనుగుల గుంపును గమనించి అత్యవసర బ్రేకులు వేసినప్పటికీ ఏనుగులు రైలును ఢీకొన్నాయన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, ఎన్ఎఫ్ఆర్ జనరల్ మేనేజర్, లుండింగ్ డివిజనల్ రైల్వే మేనేజర్‌తో సహా ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారని శర్మ చెప్పారు. గౌహతి రైల్వే స్టేషన్‌లో 03612731621/ 2731622/ 2731623 హెల్ప్‌లైన్ నంబర్లను యాక్టివేట్ చేసినట్లు ఆయన తెలిపారు.

## వారి గుండెల్లో రైళ్లు

**(మొదటి పేజీ తరువాయి)**

ఎంఎల్ఎలు వెడమా బొజ్జు, టిపిసిసి ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూ గాంధీ పేరు తొలగింపు పూర్తిగా అప్రజాస్వామికమని, మహాత్మా గాంధీ పేరు దేశ ప్రజల హృదయాల నుంచి చెరపలేరన్నారు. బిజెపి నేతలు గాడ్సేను పూజించే వారు కాబట్టే గాంధీ పేరును తొలగించారన్నారు. అప్పటి ప్రధాని మనోహన్ సింగ్‌తో మాట్లాడి జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చారని, ప్రజలకు 100 రోజుల ఉపాధి కోసం జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకువచ్చారని, 2014 లో అధికారంలోకి వచ్చిన బిజెపి జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు కోత పెడుతూ వస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు బిజెపి తెర లేపిందని, మను స్మృతి అమలు చేయాలని బిజెపి పన్నాగం పన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన వెడమ బొజ్జు ఎంఎల్ఎ అయ్యారని మహేష్‌కుమార్ గుర్తు చేశారు. సోనియా గాంధీ కుటుంబంపై కక్ష్య పూరితంగా కేసులు పెడుతున్నారని, గాంధీ, నెహ్రూ లెగసిని మరిపించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. లౌకికవాద దేశంలో మోదీ, అమిత్ షా పప్పులు ఉడకవని, కులాలు మతం పేరుతో రాజకీయం చేసే వారికి గుణపాఠం తప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలో బిజెపికి ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టారన్నారు.

## సిఎం అసహనం

**(మొదటి పేజీ తరువాయి)**

సమాచారం. ఇప్పటికైనా నాయకులు తమ వైఖరి మార్చుకుని పార్టీ నియ మ నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధిష్టానం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై వారు చర్చించారు. కాంగ్రెస్ పార్టీ వర్గాల సమాచారం ప్రకారం రెబల్స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని వారు తప్పుబట్టారు. పార్టీకి తీరని నష్టం చేశారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. మొదటి, రెండో విడతల్లో సుమారు 56 శాతం స్థానాలను గెలిచిన పార్టీ మూడో విడతలోనూ అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. కాగా 31 జిల్లాల్లోని 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో 7,010 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. 3,502 స్థానాల్లో బిఆర్ఎస్ గెలుపొందిం ది. బిజెపి 688 స్థానాలు పొందగా, ఇతరులు 1,505 స్థానాల్లో గెలిచారు. అయితే తమకు పట్టున్న కొన్ని చోట్ల స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్టానం సీరియస్‌గా ఉంది. ఈ క్రమంలోనే అందుకు బాధ్యులైన ఎంఎల్ఎలు, నియోజకవర్గ బాధ్యులతో సమావేశం నిర్వహించింది.

## భారీ దాడులు

**(మొదటి పేజీ తరువాయి)**

ఆయన చెప్పారు. వాటిని ధ్వంసం చేశామని, ఈ దాడులు విజయవంతమయ్యాయని రాకీమౌంట్‌లో చెప్పారు. డిసెంబరు 13వ తేదీన సిరియా పాల్మైర్‌లో ఐఎస్ ఉగ్రవాదులు దాడి చేసి ఇద్దరు అమెరికా సైనికులను చంపారు. ఈ దాడుల్లో ఒక అమెరికా సివిలియన్ ఇంటర్‌ప్రెటేటర్ కూడా మరణించాడు. దీనికి ప్రతీకారంగా భారీ ఎత్తున ఐఎస్ స్థావరాలపై శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు ఈ దాడులు ప్రారంభమయ్యాయి. పశ్చిమ ఆసియా ప్రాంతంలో అమెరికా సైనికులపైన లేదా అమెరికా భాగస్వామ్యదేశాలపైన దాడులు చేయడం లేదా వారిని హాని తలపెట్టిగానీ అమెరికా సైన్యం అవిశ్రాంతంగా పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా ట్రంప్ ప్రకటన చేశారు. అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ మాట్లాడుతూ, ఇది యుద్ధారంభం కాదని, కేవలం ప్రతీకార చర్య మాత్రమేనన్నారు. ఈ దాడుల అనంతరం సిరియా ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తూ ఐఎస్ఐఎల్ గ్రూపు ఉగ్రవాదులకు సిరియా ఎప్పటికీ స్వర్గధామం కాబోదని, వాటిపై పోరాటానికి సిరియా కట్టుబడి ఉందని పేర్కొంది. అదేవిధంగా అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ, ఫైటర్ జెట్లు, ఎటాక్ హెలికాప్టర్లు, పదాతిదళ బృందాలు దాదాపు 70 మౌలిక సదుపాయాలు, ఆయుధ కేంద్ర స్థావరాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. అనేక ప్రాంతాలలో ఈ స్థావరాలు ఉన్నాయని తెలిపింది. ఐతే ఐఎస్ సంస్థ బహిరంగంగా దీనిపై ఎలాంటి వ్యాఖ్యానాలు చేయలేదు.

## శిక్షకు చట్టం తెస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

బోధనల స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ఎవరు ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టినా, దుష్ప్రచారం చేసినా, రాష్ట్రంలో శాంతిని కాపాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. క్రిస్టియన్ మిషనరీలు విద్య, వైద్యాన్ని ప్రాధాన్యతగా తీసుకుని పేదలకు అందించాయన్నారు. ఒక యుద్ధంలా, యజ్ఞంలా అంకితభావంతో ప్రభుత్వంతో పోటీ పడి పేదలకు విద్య, వైద్యాన్ని అందించాయని చెప్పారు.

## అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హజ్రత్ ఖ్వాజా మొహియుద్దీన్ చిష్తి 814వ ఉర్సును పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్‌ను సమర్పించారు. అజ్మీర్ షరీఫ్ దర్గా ఆధ్యాత్మికత, సామాజిక సామరస్యం, ప్రేమ, సోదరభావానికి చిహ్నంగా నిలుస్తుంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పించిన సందర్భంగా మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎంపి పోరిక బలరాం నాయక్, పలువురు ఎంఎల్ఎలు టిఎంఆర్ఇఐఎస్ వైస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ ఖాద్రీపాషా బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో పాటు ఇతర ముస్లిం మైనారిటీ నేతలు హాజరయ్యారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 2026-27 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ సిద్ధం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేసే ప్రక్రియను ప్రారంభించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం లో తమ తమ కార్యకలాపాల కోసం అవసరమయ్యే అంచ నా వ్యయాల ఆధారంగా బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చే యాల ని రాష్ట్ర ఆర్థిక శాఖ అన్ని శాఖలను ఆదేశించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సు ల్తానియా శనివారం ఉత్తర్వులను (జిఒఎంఎస్ 153) జారీ చేశారు. బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయడానికి సంబంధించిన వివ రణాత్మక మార్గదర్శకాలను ఈ ఉత్తర్వులలో పొందుపరిచా రు. అన్ని శాఖలూ తమ బడ్జెట్ ప్రతిపాదనల ను 2026 జన వరి 3వ తేదీలోగా సచివాలయంలోని తమ సంబంధిత విభా గాధిపతుల కార్యాలయాలకు ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉం టుంది. ఆ తర్వాత, సంబంధిత విభాగాధిపతుల కార్యాల యాలు ఈ ప్రతిపాదనలను తమ వ్యాఖ్యలతో సహా 2026 జనవరి 6వ తేదీలోగా ఆర్థిక శాఖకు పంపాలి.

### మరణాల రేటు నివారించడమే లక్ష్యంగా
# జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

- ప్రతీ జిల్లాలో రోడ్డు భద్రత ఫోర్స్ వలంటీర్ల బృందాల ఏర్పాటు
- రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు, డ్రైవర్లకు అవగాహన సదస్సులు
- జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్




ప్రజాపక్షం/హైదరాబాద్ : రోడ్డు ప్రమాదాలను పూర్తి గా తగ్గించి మరణాల రేటును నివారించడమే లక్ష్యంగా జనవరి మాసంలో జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసో త్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో తీసుకోవాల్సిన కార్యాచరణపై సచివా లయంలో సిఎస్ కె.రామకృష్ణారావు, స్పెషల్ సిఎస్ వికా స్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తిలతో కలిసి రవాణా శా ఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం తెలంగాణలో 25,934 రోడ్డు ప్రమాదాలు జరగగా, 7949 మరణిం చారని, రాష్ డ్రైవింగ్, డ్రైవర్ల నిరక్ష్యం వల్లే ప్రమాదాలు జరిగినట్లు గుర్తించామన్నారు. రోడ్డు సేఫ్టీపై ప్రతి జిల్లాలో ఏర్పడిన కమిటీలు ఈ నెలాఖరులోపు సమావే శాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌లకు సూచించా రు. దీనిలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఆర్అండ్‌బి అధికా రి కన్వీనర్‌గా ఉంటారని, ఇందులో రవాణా శాఖ, ఆర్ టిసి, విద్యాశాఖ అధికారులు, పోలీస్, ట్రాఫిక్, ఇతర విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూ చించారు. ప్రతి జిల్లాలో రోడ్ భద్రతా ఫోర్స్ వాలంటీర్ బృందాలను ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో, పాఠశాలల్లో అధికారులతో కలిసి అవగాహన కల్పించాలని ఆదేశిం చారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించ డానికి ఏర్పాటు చేస్తున్న చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ అన్ని జిల్లా ల్లో ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్‌లు చొరవ తీసుకోవాలని సూచించారు.

**క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ద్వారా రూ. 1.50 లక్షల ఉచిత చికిత్స..**

రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు గోల్డెన్ అవ ర్‌లో చికిత్స అందించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ సమర్థవంతం గా అమలవుతుం దని, దీని ద్వారా బాధితుడికి ఏడు రోజుల్లో రూ. 1.50 లక్షల వరకు ఉచితంగా అందజేయబడుతుందన్నారు. అలాగే రోడ్డు ప్రమాద బాధితులను తక్షణ సహాయం అందించిన వా హనదారులను ప్రోత్సహించడానికి రహ వీర్ గుడ్ సమర్థన్ స్కీమ్ ద్వారా రూ.25 వేలు క్యాష్ అవార్డుతో అందించే పథకం రాష్ట్రంలో త్వరలోనే ప్రారం భం కానుందని తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు, ఆర్‌టిఎ మెం బర్లు, నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు అవగాహన కార్యక్రమంలో పాల్గొనేలా రవాణా శాఖ, పోలీస్ ,ఆర్‌టిసి ఇతర విభాగాల అధికారులు సమ న్వయం చేసుకోవాలని సూచించారు. చీఫ్ సెక్రెటరీ కే.రామకృష్ణ రావు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగు తున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి కింది స్థాయి నుండి రాజధాని వరకు విస్తృత అవగాహన ద్వారానే మరణాల రేటు తగ్గించవచ్చని సూచించారు. ప్రజ ల ఆస్తి, ప్రాణ నష్టాలను కాపాడే బాధ్యత మనందరిపై ఉందని, జిల్లా కలెక్టర్‌లు రోడ్‌సేఫ్టీ కమిటీలతో సమావే శాన్ని ఏర్పాటు చేసి, రవాణా శాఖ ఏర్పా టు చేసే కార్యా చరణలో పాల్గొనాలని ఆదేశించా రు. స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జిల్లా కలెక్టర్‌లు , అడిషనల్ డిజి లా అండ్ ఆర్డర్ మహేష్ భగ వత్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, ఎంజెపి సెక్రటరీ సైదులు, నేషనల్ హైవే స్ అథారిటీ అధికారులు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ గెలుపులో న్యాయవాదుల పాత్ర మరువలేనిది

నవీన్ యాదవ్ సన్మాన కార్యక్రమంలో మంత్రి పొన్నం



టిపిసిసి లీగల్ సెల్ ఆధ్వ ర్యంలో శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగిన జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సన్మాన కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లీగల్ సెల్ చైర్మన్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో నవీన్ యాదవ్‌కు సన్మానం చేయడం అభినందనీయమని, జూబ్లీహిల్స్ ఉప ఎన్ని కల్లో నవీన్ యాదవ్ గెలుపులో న్యాయవాదుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. అడ్వకేట్‌లకి సంబం ధించిన సమస్యలు పరిష్కారం చేసి త్వరలో శుభవార్త అందిస్తానని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తనకు కాంగ్రెస్ పార్టీ నుండి అవకాశం ఇచ్చిన అధి ష్టానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు. తన విజయం కోసం పొన్నం అశోక్ నేతృత్వంలో న్యాయవాదులు ఎంతో కృషి చేశారని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజ యం సాధించమన్నారు. టిపిసిసి లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యేగా మొదటి సారి యువకుడు నవీన్ యాదవ్ విజయం సాధించారని, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా లీగల్ సెల్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి లీగల్ సెల్ సభ్యులు, న్యాయవాదులు, చిన్న శ్రీశైలం యాదవ్ , తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూముల వేలం నిలిపివేయాలి

- గత ప్రభుత్వ హయంలో లీజుకిచ్చిన ప్రభుత్వ భూములను వెనక్కు తీసుకోవాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/హనుమకొండ : జిల్లాలో ప్రభుత్వ భూములను వేలం వేయ డాన్ని నిలిపివేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివా సరావు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో శనివా రం సిపిఐ , సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ ల ఆధ్వర్యంలో రౌండ్ టేంబుల్ సమావేశం జరిగిం ది. ఈ సమావేశంలో వామపక్ష పార్టీల, ప్రజా సం ఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ల పల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూముల వేలంను నిలిపి వేయాలని అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నా రు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, వాటిని ప్రజా ప్ర యోజనాల కు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాలలో కార్యకలాపా లు నిర్వహిస్తు న్న ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ హాస్టల్స్ కోసం ప్రభుత్వ స్థలాలలో భవనాలను నిర్మించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుల సం ఘం రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంక ట నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ భూ ముల పరిరక్షణకై ఉద్యమించా లన్నారు. అందుకు వామపక్ష పార్టీలు నడుం బిగించాలని, ప్రజాసంఘా లు, పౌర సంఘాలను కలుపుకొని ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని సూచిం చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ రానున్న రోజులలో నిర్వహించాల్సిన కార్యాచరణ కార్యక్రమాన్ని రూ పొందించారు. ఈ రౌండ్ టేంబుల్ సమావేశానికి సిపిఐ హనుమకొండ జి ల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.చుక్క య్య అధ్యక్షత వహించగా ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి ఎన్.హంసా రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నున్నా అప్పారావు, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, మాల మహానాడు జిల్లా అధ్య క్షుడు కె.రాంచందర్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆద రి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ప్రజాసంఘాల నా యకులు నేదునూరి రాజమౌళి, ఏదునూరి వెంకటరాజం, ఎన్.అశోక్ స్టా లిన్, కొట్టెపాక రవి, సిపి ఎం జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, టి.ఉప్ప లయ్య, కెవిపిఎస్, డివైఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హక్కు కాపాడుకునేందుకు కలిసి కట్టుగా పోరాడుదాం

కేంద్రం కుట్రలకు నిరసనగా 'ఉపాధి హామీ'నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయండి: మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హా మీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం తల పెట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాష్ట్ర పం చాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి చేశారు. కూలీల ఉపాధి హక్కును కాపాడుకునేందుకు కలిసి కట్టుగా పోరాడుతామని, రాజకీయాలకు అతీ తంగా అందరూ ఉపాధి హామీ పరిరక్షణ పోరాటంలో పాలుపంచుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమాల్లో కార్మికులు, కర్షకులు, కూలీలు, సర్పంచులు, ప్రజా స్వామ్యవాదు లు, ప్రగతిశీల శక్తులు పెద్ద ఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. పల్లెల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి కనీసం వందరోజుల పాటు ఉపా ధి కల్పించేందుకు 20 ఏళ్ల క్రితం నాటి కాం గ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టానికి నరేం ద్ర మోదీ నేతృత్వంలోని బిజె పి కేంద్ర ప్రభుత్వం ఉరి వేస్తోందని సీతక్క శని వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీల్లో 90 శాతం మంది ఎస్ సి, ఎస్‌టి, మహిళలు ఉపాధి పొందుతున్నారని, . వారి ఉపాధిని దెబ్బతీసేం దుకు కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని సీతక్క మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా ఉపాధి కూలీల్లో 60 శా తం మహిళలు, తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి హామీ లబ్ధిదారుల్లో 62 శాతం మహిళలే ఉన్నారని, అలాగే 20 శాతం ఎస్‌సిలు, 20 శా తం ఎస్‌టిలు లబ్ధిదారు లుగా ఉన్నారని, కేంద్ర వైఖరి కారణంగా వారంతా ఉ పాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కేవలం ఉపాధి హా మీ కల్పనకే పరిమితం కాలేదని, మహిళలు అట్టడుగు వర్గాల ఆర్థిక స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని మంత్రి సీతక్క అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్ర తి ఏడాది పనిదినాలను తగ్గిస్తూ పేదల హక్కులను కా లరాస్తోందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 45 కోట్ల పనిదినాలకు కోత, తెలంగాణలో 5 కోట్ల పనిదినాలకు కోత పెట్టారని ఆరోపించా రు. జిరామ్‌జి చట్టం ద్వారా 125 రోజులు పని కల్పిస్తామని చెప్పినప్పటికీ , ఏ ఏడాదిలో కూడా 50 రోజులకు మించి పని ఇవ్వలేద ని, ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటుకు నివేదించిందని సీతక్క వివరించారు.

## ఎన్నికల విధులకు గైర్హాజరు.. షోకాజ్ నోటీసులు

ప్రజాపక్షం/కరీంనగర్ : మూడు విడతల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నిక లకు విధులు కేటాయించినప్పటికీ ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా గై ర్హాజరైన 713 మంది ఉద్యోగులకు జిల్లా విద్యాధికారి, గ్రామ పంచాయతీ ఎన్నికల నోడల్ అధికారి అశ్విని తానాజీ వాకడే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 11,14,17 తేదీల్లో జరిగిన ఎన్నికల్లో విధులు కేటాయించినప్పటికీ సంబంధిత ఉద్యోగులు విధులకు హాజరు కాలేదని, తద్వారా ఎన్నికల నిర్వహణకు అసౌ కర్యం ఏర్పడిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించినందుకు సిసిఏ నియమాల ప్రకారం సదరు ఉద్యోగులపై చర్యలు ఎందుకు తీసుకోరాదో లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు.

## ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ఏడాది పొడవునా అడ్మిషన్లు

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్‌లోని 3 ప్రత్యేక పాఠశాలల్లో 1నుంచి10వ తరగతి వరకు ప్రవేశాలకు గాను ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులు (అంధ, బధిర) విద్యార్థు ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశా ల విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ తెలిపారు. ఇందుకు సంబంధించి అం ధ విద్యార్థులకు గాను మలక్‌పేట్‌లోని బాలికల పాఠశాల, దారుల్‌షిఫాలో బాలుర పాఠశాలలో హాస్టల్ సదుపాయంతో సహా నడుస్తున్నాయన్నా రు. అదేవిధంగా బధిర విద్యార్థులకు సంబం ధించి మలక్‌పేట్‌లో ఉన్నత పాఠశాల ఉందని తెలిపారు. ఈ మూడు పాఠశాలల్లో ప్రత్యేక అవ సరాలు కలిగిన (అంధ,బధిర) విద్యార్థులకు అన్నివసతులు కల్పించబడ్డయని ఈ పాఠశాల్లో సంవత్సరంపొడవునా అడ్మిషన్ల పొందే అవకా శం ఉంటుందని దీనిని సద్వినియోగం చేసుకో వాలని విద్యా శాఖ సంచాలకులు వెల్లడించా రు. మరిన్ని వివరాల కోసం దారుల్ షిఫా బా లుర (అంధులు) పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, సెల్ నంబర్ 9666691272,మలక్‌పేట్ బాలికల(అంధులు ) పాఠశాల అస్రా ఫాతిమా సెల్ నంబర్ 9849761418,మలక్‌పేట్ (బధి రులు) ఉన్నత పాఠశాల రామ్ మోహన్ సెల్ నంబర్9394889158 ద్వారా సంప్రదించా ల్సిందిగా నవీన్ నికోలస్ కోరారుకోరారు.

## గీత వృత్తిదారులకు ఎక్స్ గ్రేషియో విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: గీత వృత్తిదారులకు విడుదల చేయాల్సిన ఎక్స్ గ్రేషియో రూ.13 కోట్లను తక్షణమే విడుదల చేయాలని, పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాల ని, అర్హులందరికీ మోపెడ్స్, బైకులు, సేఫ్టీ కిట్స్‌ను అం దించాలని తెలంగాణ రాష్ట్ర గీత పని వారాల సంఘం అ ధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. ఈ విషయమై గత నవంబర్‌లో ధర్నా లు నిర్వహించామని, డిసెంబర్ మొదటి వారంలో హైద రాబాద్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించామని, ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ కమిషనర్‌లకు విజ్ఞాపన పత్రాలను అందజేసినప్పటికీ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నా యని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బొ మ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు.షెడ్యూల్ ఏరియా లో వృత్తిదారులకు సహకార సంఘాలు,టిఎఫ్‌టిలో కే టాయించడం, ఎక్స్‌గ్రేషియా అమలు వర్తింపచేయాల ని, 560 జిఒ ప్రకారం ప్రతి సొసైటికీ పది ఎకరాల భూమి, దుకాణాలకు 100 గజాల స్థలాన్ని కేటాయిం చాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

## గోర్ బంజారా సాహిత్యానికి 'పోర్యతార' కొత్త దిక్సూచి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్ :తొలి సారిగా గోర్ బంజారా చరిత్రను నవల రూపంలో ఆవిష్కరించడం శుభపరిణామమని రాష్ట్ర పర్యాట క, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నా రు. రవీంద్రభారతి ఆవరణలోని మంత్రి చాంబర్‌లో తె లంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన తొలి తెలుగు గోర్ బంజారా చారిత్రక నవల 'పోర్యతార'ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా విస్తరించిన గోర్ బంజారాల ఘన చరిత్ర ఇప్పటివరకు లిఖిత రూపంలో అందుబాటులోకి రాలే దని మంత్రి పేర్కొన్నారు. వారి జీవన విధానం, సంస్కృతి, సాహసాలు, పోరాటాలను నవల రూపంలో వెలికి తీసిన రచయిత ఆమ్ గోత్ వెంకట్ పవార్‌ను అభి నందించారు. ఆదివాసీ గిరిజన చరిత్రలను ముద్రణలోకి తీసుకువచ్చి, తెలంగాణ సాంస్కృతిక, సాహిత్య వారస త్వా న్ని నిలబెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకె ళ్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ డా. తేజావత్ బెల్లయ్య నాయక్, తెలంగాణ సాహిత్య అకాడ మీ కార్యదర్శి డా. బాలాచారి, రచయిత వెంకట్ పవార్, దినకర్ తదితరులు పాల్గొన్నారు


ఫారం - 7

(చట్టం-30/2013 లోని సెక్షన్ 19(1) లోని సబ్ రూల్ (1) రూల్ 25 ప్రకారం)

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్/సంయుక్త కలెక్టర్/ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ)/ ప్రత్యేక ఉప కలెక్టర్(భూసేకరణ)

రూఢీ ప్రకటన

గెజిట్ నెం./109/2025. తేది: 17.11.2025
జిల్లా కలెక్టర్ యదాద్రి భువనగిరి ఫైల్ నెం.G/1331/2025. తేది: 21.11.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (L.A) యదాద్రి భువనగిరి ఫైల్ నెం. A/12/2025, తేది: .10.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్ట పరిచిన యాదాద్రి భువనగిరిజిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామములో విస్తీర్ణం ఎ. **2-20 గుంటల** భూమిప్రజా ప్రయోజనార్థం కాళేశ్వరం ప్రాజెక్ట్ క్రింద గందమల్ల జలాశయము బందు నిర్మాణము కొరకు భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని నిర్ణయించినారు.
కావున యాదాద్రి భువనగిరి జిల్లాలో తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామములో విస్తీర్ణం ఎ. **2-20 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్థం కాళేశ్వరం ప్రాజెక్ట్ క్రింద గందమల్ల జలాశయము బందు నిర్మాణములో భాగముగా దిగువచూపిన భూమి అవసరమైనందున ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం (డిక్లరేషన్) జారీచేయనైనది.

షెడ్యూల్

జిల్లా: యదాద్రి భువనగిరి మండలం: తుర్కపల్లి గ్రామం: గంధమల్ల
ప్రాజెక్ట్: కాళేశ్వరం ప్రాజెక్ట్ క్రింద గంధమల్ల జలాశయ నిర్మాణము

| క్ర. సం. | సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం) | చెట్లు / కట్టడములు |
|---|---|---|---|---|---|
| 1 | 261 ఖుష్కీ / పట్టా 0.20 | కర్నాల పెంటయ్య తండ్రి వెంకటయ్య | కర్నాల పెంటయ్య తండ్రి వెంకటయ్య | 0.20 | --- |
| 2 | 262 ఖుష్కీ / పట్టా 0.01 | కుకుట్ల అయిలయ్య తండ్రి నర్సయ్య<br>కుకుట్ల కొమురయ్య తండ్రి ఓజయ్య<br>కుకుట్ల ఐలయ్య తండ్రి పెంటయ్య<br>కుకుట్లమైసయ్య తండ్రి పెంటయ్య<br>కుకుట్ల జన్నయ్య తండ్రి కొమురయ్య<br>కుకుట్ల నర్సయ్య తండ్రి కొమురయ్య<br>కుకుట్ల మల్లయ్య తండ్రి కొమురయ్య<br>కుకుట్ల మల్లయ్య తండ్రి పెంటయ్య<br>కుకుట్ల అనిత భర్త ఐలయ్య<br>కుకుట్ల వెంకటేశం తండ్రి నర్సయ్య<br>కుకుట్ల యెల్లేష్ తండ్రి ఐలయ్య<br>కుకుట్ల జహంగీర్ తండ్రి ఐలయ్య<br>కుకుట్ల రాజు తండ్రి ఐలయ్య<br>శెట్టి పెంటమ్మ భర్త రాములు<br>ఆవుల శోభ భర్త మైసయ్య<br>తలమైన రాజ్ కుమార్ తండ్రి నక్క మల్లేశ్<br>కుకుట్ల కనకయ్య తండ్రి కిష్టాయ్య | ఇతరులు | 0.01 | --- |
| 3 | 319 ఖుష్కీ / పట్టా 0.10.25 | తిప్పిరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి తండ్రి లక్ష్మ రెడ్డి | తిప్పిరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి తండ్రి లక్ష్మ రెడ్డి | 0.10.25 | --- |
| 4 | 320 ఖుష్కీ / పట్టా 0.06 | తిప్పిరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి తండ్రి లక్ష్మ రెడ్డి | తిప్పిరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి తండ్రి లక్ష్మ రెడ్డి | 0.06 | --- |
| 5 | 333 ఖుష్కీ / పట్టా 1-10.25 | నాగయిపల్లి బాలనర్సయ్య తండ్రి ఆయిలయ్య | నాగయిపల్లి యాదగిరి తండ్రి శేట్టయ్య | 1-10.25 | --- |
| | | నాగయిపల్లి పోచయ్య తండ్రి బాలయ్య | నాగయిపల్లి మల్లయ్య తండ్రి గాలయ్య | | |
| | | నాగయిపల్లి చిన్న బిక్షపతి తండ్రి మల్లయ్య | నాగయిపల్లి నర్సింహులు తండ్రి యాదగిరి | | |
| | | నాగయిపల్లి చంద్రయ్య తండ్రి చిన్న మల్లయ్య | నాగయిపల్లి బిక్షపతి తండ్రి చంద్రయ్య | | |
| | | నాగయిపల్లి చంద్రయ్య తండ్రి ఆయిలయ్య | నాగయిపల్లి కిస్టాయ్య తండ్రి గలయ్య | | |
| | | నాగయిపల్లి బాలమ్మ భర్త సత్తయ్య | నాగయిపల్లి బిక్షపతి తండ్రి బాలరాజు | | |
| | | నాగయిపల్లి కిస్టాయ్య భర్త బిక్షపతి | నాగయిపల్లి పెంటయ్య తండ్రి మల్లయ్య | | |
| 6 | 332 ఖుష్కీ / పట్టా 0-03.75 | నాగయిపల్లి బిక్షపతి తండ్రి చంద్రయ్య<br>నాగయిపల్లి నవీన్ కుమార్ తండ్రి చంద్రయ్య<br>నాగయిపల్లి మల్లయ్య తండ్రి గలయ్య<br>నాగయిపల్లి కిష్టాయ్య తండ్రి గలయ్య | సాప సత్యానారాయణ తండ్రి నర్సయ్య | 01.50 | --- |
| | | నాగయిపల్లి యాదగిరి తండ్రి శెట్టయ్య<br>నాగయిపల్లి చంద్రయ్య తండ్రి ఆయిలయ్య<br>సాప రామయ్య తండ్రి నర్సయ్య<br>నాగయిపల్లి నర్సయ్య తండ్రి ఐక్క నర్సయ్య<br>సాప లక్ష్మ య్య తండ్రి రామ చంద్రయ్య<br>నాగయిపల్లి నర్సింహులు తండ్రి యాదగిరి | సాప ప్రమీల భర్త లక్ష్మ య్య | 01.50 | --- |
| | | తెలగమ రమేశ్ తండ్రి నర్సింహో | రుద్ర పాండు తండ్రి సత్తయ్య | 0.0075 | --- |
| 7 | 335 ఖుష్కీ / పట్టా 0-02.5 | గట్టు లక్ష్మి నర్సమ్మ భర్త కృష్ణమూర్తి | గట్టు లక్ష్మి నర్సమ్మ భర్త కృష్ణమూర్తి | 0.02.50 | --- |
| | | కసిరబోయిన పెంటయ్య తండ్రి కొమురయ్య<br>కుమ్మరి చిన్న బిక్షపతి తండ్రి మల్లయ్య<br>నాగయిపల్లి చంద్రయ్య తండ్రి చిన్న మల్లయ్య<br>కాశీరాబోయిన లింగయ్య తండ్రి కొమురయ్య<br>వల్లబోజు సూర్యమౌళి తండ్రి పెంటయ్య<br>వల్లబోజు చంద్రమౌళి తండ్రి పెంటయ్య<br>వల్లబోజు వెంకట చారి తండ్రి పెంటయ్య<br>వల్లబోజు మల్లిఖార్జున్ తండ్రి పెంటయ్య<br>వల్లబోజు మురళిధర్ తండ్రి పెంటయ్య<br>నాగయిపల్లి కిస్టాయ్య తండ్రి పెద్ద బిక్షపతి<br>నాగయిపల్లి మహేందర్ తండ్రి బిక్షపతి<br>నాగయిపల్లి శంకర్ తండ్రి బిక్షపతి<br>వల్లబోజు ఉమాదేవి భర్త గోపాలచారి | ఇతరులు | | |
| 8 | 312 ఖుష్కీ / పట్టా 0-03.25 | మైసిరెడ్డి మధుసుధాన్ రెడ్డి తండ్రి కోటిరెడ్డి | మైసిరెడ్డి మధుసుధాన్‌రెడ్డి తండ్రి కోటిరెడ్డి | 0.0025 | --- |
| | | ఇటికల కిష్టయ్య తండ్రి మల్లయ్య<br>శాగా నర్సయ్య తండ్రి బాలయ్య<br>కాగా బాలయ్య తండ్రి ఎర్ర మల్లయ్య<br>గడిపే యాదగిరి తండ్రి ఇస్తారి<br>గడిపే ఇస్తారి తండ్రి మల్లయ్య<br>చిన్న శాగా బిక్ష పతి తండ్రి సాయిలు | ఇతరులు | 0.03 | --- |
| | | శాగా మల్లేశం తండ్రి నర్సయ్య<br>శాగా యాదగిరి తండ్రి నర్సయ్య<br>గాడిపే లక్ష్మి భర్త కిష్టయ్య<br>గాడిపే లక్ష్మి భర్త రాజయ్య<br>శాగా లక్ష్మి భర్త బిక్షపతి | | | |
| | | ఇటిక్యాల బాల నర్సయ్య తండ్రి లింగయ్య<br>ఇటిక్యాల యాదగిరి తండ్రి లింగయ్య<br>గాడిపే మల్లమ్మ భర్త నర్సయ్య<br>ఇటిక్యాల బలమల్లు తండ్రి నర్సయ్య<br>శ్యాగా మహేందర్ తండ్రి బిక్షపతి<br>శ్యాగా సత్తమ్మ భర్త నర్సిహులు<br>ఇటిక్యాల లక్ష్మి భర్త ఆగయ్య<br>గడిపే కృష్ణ తండ్రి చంద్రయ్య<br>గడిపే సరిత భర్త నర్సింహో | | | |
| 9 | 315 ఖుష్కీ / పట్టా 0-0075 | మైసిరెడ్డి మధుసుధాన్ రెడ్డి తండ్రి కోటి రెడ్డి | మైసిరెడ్డి మధుసుధాన్ రెడ్డి తండ్రి కోటి రెడ్డి | 0.0075 | --- |
| 10 | 356 ఖుష్కీ / పట్టా 0-02.25 | బాటా<br>డాకు వెంకటయ్య (పేర్మయ్య)<br>చేర్యాల అఖిల (కనకయ్య)<br>చేర్యాల కనకమ్మ (నర్సింహులు)<br>చేర్యాల లక్ష్మ య్య (మల్లయ్య)<br>చేర్యాల డాకయ్య (మల్లయ్య)<br>తోడేటి మల్లేశం (మల్లయ్య)<br>తోడేటి కిష్టయ్య (రామయ్య)<br>తోడేటి అండమ్మ (యాదగిరి)<br>డాకు నర్సింహులు (డాకయ్య)<br>డాకు రాజయ్య (డాకయ్య)<br>డాకు యాదగిరి (రామయ్య)<br>డాకు జయమ్మ (రామయ్య)<br>డాకు నగేష్ (రామయ్య)<br>డాకు రాములు (రామయ్య)<br>డాకు లక్ష్మ య్య (రామయ్య) | బాటా | 0-02.25 | --- |
| | | మొత్తం విస్తీర్ణం | | 2-20 | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునారావాసం కల్పించబడు విస్తీర్ణం శూన్యం.
భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, ప్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.
పైన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), యాదాద్రి భువనగిరి జిల్లా నందు కార్యాలయపు పనివేళనందు చూసుకొనవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO NO. 960/LA/PP/Advt/Pub/2025-26



**పురపాలక సంఘం, సిరిసిల్ల, జిల్లా: రాజన్న సిరిసిల్ల**

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

No. E1/SRCL/E-PROC.18/2025-26, తేది: 19-12-2025

పురపాలక సంఘం, సిరిసిల్ల కమిషనర్ గారిచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారమ్ ద్వారా పలు అభివృద్ధి పనులు చేయుటకు గాను ఆన్‌లైన్ టెండర్ ద్వారా పిలువడం జరిగినది.

| | | |
|---|---|---|
| > మొత్తం పనులు | : | (2) |
| > మొత్తం పనుల విలువ | : | రూ. 7.00 లక్షలు |
| > బిడ్ డౌన్ లోడ్ ప్రారంభ తేది & సమయం | : | తేది: 20-12-2025 @11:00 AM |
| > బిడ్ డౌన్ లోడ్ ముగింపు తేది & సమయం | : | తేది: 29-12-2025 @4:00 PM |

ఇతర వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్ సైట్ ను సంప్రదించగలరు.
సం/- కమిషనర్, పురపాలక సంఘం, సిరిసిల్ల.
DIPR R.O. No. : 12357-PP/CL/ADVT/1/2025-26, Date: 20-12-2025



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

Short Tender NIT No. 32/EE-6/CRZ/GHMC/2025-26, తేది: 20.12.2025

పని పేరు: (7) నెం.ల ఐఆర్‌టి పనులు మరియు (1) నెం. సిసి రోడ్ వేయడం, **అంచనా విలువ :** రూ.79.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** క్ర.సం.1-7 డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 22.12.2025న ఉ.10.30గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 24.12.2025న ఉ.11.00గం.ల వరకు. **క్ర.సం.8** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 22.12.2025న ఉ.10.30గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 29.12.2025న మ.03.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ పి.సునిల్ కుమార్, ఇఇ, డివిజన్-6, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్. ఫోన్ నెం. 9000922841. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
**గమనిక: టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% ఈఎండిని పొందాలి.**
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6, చార్మినార్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR R.O. No. : 12398-PP/CL/ADVT/1/2025-26, Date: 20-12-2025



**తెలంగాణ ప్రభుత్వం, మిషన్ భగీరథ శాఖ.**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, మిషన్ భగీరథ సర్కిల్ మహబూబ్‌నగర్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

| క్ర. సం. | టెండర్ నోటీసు నెం. మరియు తేది | పని పేరు | అంచనా విలువ (రూ. లక్షలలో) | గ్రాంట్ | కాల్ నెం. |
|---|---|---|---|---|---|
| 1 | నెం. T4/Tenders/15/2025-26, తేది: 20.12.2025 | రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, దూస్కల్ గ్రామంలోని తెలంగాణ డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ స్కీమ్‌కు బల్క్ సరఫరా కనెక్షన్ అందించడానికి పైప్‌లైన్ వేయడం. | 41.895 | 2BHK | 2వ పిలుపు |

టెండర్ డాక్యుమెంట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో అందుబాటులో ఉన్నాయి : **23.12.2025 నుండి 06.01.2026 మ.3.00గం.ల వరకు.** టెండర్లు **06.01.2026 సా.5.00 గం.ల వరకు** స్వీకరించబడును. టెండర్లు **07.01.2026న ఉ.11.00గం.లకు** తెరవబడును. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం నుండి పొందవచ్చును. దయచేసి ప్రకటనల వివరాలను ఇ-మెయిల్ ఐడి: **setdsp1mbnr@gmail.com**కి అందించవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మిషన్ భగీరథ :: మహబూబ్‌నగర్
DIPR R.O. No. : 12319-PP/CL/ADVT/1/2025-26; Date: 20-12-2025



**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

పబ్లిక్ నోటిఫికేషన్
HMDA చట్టం 2008 యొక్క U/S 15 (4) ప్రకారం
(G.O.Ms. No.262 MA & UD డిపార్ట్‌మెంట్, తేదీ : 01.12.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 యొక్క యాక్ట్ నెం.8) లోని సెక్షన్ 15లోని సబ్‌సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం G.O.Ms. No.33 MA & UD డిపార్ట్‌మెంట్, తేదీ : 24.01.2013, ద్వారా జారీచేయబడిన నోటిఫైడ్ MDP-2031లో ఊహించిన భూ వినియోగానికి , ఆ సెక్షన్ యొక్క సబ్‌సెక్షన్ (1) ప్రకారం అవసరమైన విధంగా ఈ క్రింది మార్పును చేస్తున్నది.
**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని శామీర్‌పేట మండలం తుర్కపల్లె (గ్రామం)లోని సర్వే నెంబర్ 563లోని స్థలం 16-20గుంటలు లేదా 66773.12 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. రోడ్డు 1503.35 మీటర్లు ప్రభావితమైంది. నికర స్థలం 65269.77 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఇది ప్రస్తుతం G.O.Ms. No.33 MA & UD డిపార్ట్‌మెంట్ తేదీ : 24.01.2013 ద్వారా జారీచేయబడిన నోటిఫైడ్ MDP-2031 ప్రకారం కన్సర్వేషన్ ఉపయోగంగా కేటాయించబడింది ఏదైతే ఉందో అది ఇప్పుడు నివాస వినియోగ జోన్‌గా గుర్తించబడింది.**
పైన పేర్కొన్న వివరాలు http://gazette.telangana,gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయి.
సం/- ప్లానింగ్ ఆఫీసర్ (KS) HMDA.
DIPR R.O. No. : 12308-PP/CL/ADVT/1/2025-26, Date: 20-12-2025

## 'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

**ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల):** వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజివిక మిషన్ గ్రామీణ పేరును తొలగించాలి సిపిఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. పథకాలు పేర్లు మార్చి పేదలను మోసం చేయాలని నిధులు తగ్గించి దేశ ప్రజలకు ఉపాధి లేకుండా చేయాలనే కుట్రపూరితమైనటువంటి కార్యచరణ ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.దేశంలోనే కోట్లాదిమంది గ్రామీణ పేద ప్రజలు ఉపాధి హామీ పథకం ద్వారా ఎంతోమంది ఉపాధి చేసుకొని లబ్ధి పొందుతున్నారు అని అన్నారు.ఇంత అద్భుతమైన పథకానికి 60 శాతం నిధులు కేటాయించి రాష్ట్రంపై 40 శాతం వేస్తూ పథకానికి తూట్లు పొడవాలని చూడడం సరైన పద్ధతి కాదన్నారు.12 లక్షల కోట్ల నల్లధనం వెనక్కి తెస్తామని దేశంలో ప్రజలకు హామీ ఇచ్చి గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం నేడు అది తీకపోగా ఉన్న స్కీములను నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం ఉపాధి ని ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య హక్కును పథకాల పేర్లు మార్చాలని శాసనాలు చేయడం సమంజసం కాదన్నారు. గ్రామీణ కార్మికులను కర్షకులను రైతులను సమీకరించి ఎంఎన్ఆర్ఇజిఎ చట్టాన్ని కాపాడుకునేంతవరకు దేశవ్యాప్త సమ్మెకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

## ప్రజల మన్ననలు పొందాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రజల చేత సర్పంచ్‌గా ఎన్నికై సేవ చేసే భాగ్యం రావడం ఎంతో అదృష్టమని, ప్రజలకు, గ్రామాభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని రంగాపురం గ్రామ సర్పంచ్‌గా సిపిఐ తరుపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన కట్టా కళ్యాణిని పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లుతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు సిపిఐ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థులు విజయ కేతనం

### పనిచేసి గెలిపించిన పార్టీ నాయకులకు, ఓటర్లకు అభినందనలు తెలిపిన సర్పంచ్‌లు







**ప్రజాపక్షం/డిండి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తరుపున గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిని ఖానాపూర్, రహమంతాపూర్, కింది శేషాయికుంట గ్రామ పంచాయతీల్లో సిపిఐ అభ్యర్థులు విజయ కేతనం ఎగరవేశారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థి తిప్పర్తి ప్రతిమ విజేందర్‌రెడ్డి 153 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రహమంతాపూర్ సిపిఐ అభ్యర్థి 167 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కింది శేషాయి కుంటలో కాంగ్రెస్ బలపరిచిన సిపిఐ అభ్యర్థి వరికుప్పల స్వప్న 131 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మండలంలో పోటీ చేసిన మూడు గ్రామ పంచాయతీల్లో సిపిఐ జెండా ఎగరవేశారు. ఈసందర్భంగా ఖానాపూర్ సర్పంచ్ తిప్పర్తి ప్రతిమ విజేందర్‌రెడ్డి, రహమంతాపూర్ సర్పంచ్ పెంటమళ్ళ రాములమ్మ, కింది శేషాయికుంట సర్పంచ్ వరికుప్పల స్వప్నలు మాట్లాడుతూ సిపిఐ అభ్యర్థులుగా తమకు అవకాశం కల్పించి గెలుపుకోసం కృషి చేసిన సిపిఐ డిండి మండల నాయకత్వానికి, ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తూ గ్రామాల అభివృద్ధికి పనిచేయనున్నట్లు తెలిపారు.

## యువత డ్రగ్స్ ఊబిలో చిక్కుకోవద్దు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నల్లగొండ డిఎస్పి కె.శివరాం రెడ్డి పిలుపునిచ్చారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ప్రభు త్వ మెడికల్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా డి.ఎస్.పి కె శివరాం రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీసు వ్యవస్థ మాదక ద్రవ్యాల నివారణ పై ఉక్కుపాదం మోపిందని డ్రగ్స్‌ను సరదా కోసం మొదలు పెట్టి వాటి ఊబిలో చిక్కుకోవద్దని సూచించారు. అనంతరం, విద్యార్థుల అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి,వన్ టౌన్ ఎస్ఐ సతీష్ , కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కంటి ఆసుపత్రుల అక్రమాలపై కొరడా

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేట్ కంటి ఆసుపత్రుల అక్రమాలపై కొరడా ఝుళిపించారు. శనివారం పట్టణంలోని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం ఆకస్మిక తనిఖీలు మిర్యాలగూడలో నకిలీ కంటి వైద్యుల బాగోతం బట్టబయలు అయింది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పలు కంటి ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంఆ బృందం సభ్యులు డాక్టర్ వి.నరేష్‌కుమార్, కె.రవికుమార్, జె.శ్రీకాంత్, విజిలెన్స్ అధికారి ఎం.రాకేష్‌లు మాట్లాడుతూ పట్టనంలోని ఎనిమిది ఆసుపత్రులను పరిశీలించామని ఏ ఆసుపత్రిలోనూ అర్హత కలిగిన వైద్యులు లేరని గుర్తించామని తెలిపారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తామని, ప్రజారోగ్యం పరిరక్షణ కోసం నకిలి వైద్యులపై నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం ఈ తనిఖీలకు పూర్తి రక్షణ కల్పించిన డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## టచ్‌లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు.. బడా నాయకులు...

### కాంగ్రెస్ నాయకులపై మాజీ మంత్రి సంచలన వ్యాఖ్యలు

**ప్రజాపక్షం/హాలియా:** నల్లగొండ జిల్లాలో సగం మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు... అధికార పార్టీ బడా నాయకులు నాకు టచ్ లోనే ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం హాలియాలో టిఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్ లకు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనించదగ్గ విషయం. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందని తనకు టచ్ లో ఉన్న ఎమ్మెల్యేల ద్వారానే స్పష్టం అవుతుందని ఆరోపించారు. అన్న మరో రెండేళ్లు ఆగే మేము మీతో వస్తామంటూ సగం మంది ఎమ్మెల్యేలు తనకు టచ్ లోకి వస్తున్నారని ఆయన చేసిన ఆరోపణలు సంచలం సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పడానికి స్థానిక సంస్థల్లో టిఆర్ఎస్ పార్టీ గెలిచిన అభ్యర్థుల లెక్కలే బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. అధికార పార్టీకి చెందిన బడా నాయకులు తనతో తరచూ మాట్లాడుతూ మరో రెండేళ్లలో మేము మీ వెంట నడుస్తామని చెబుతుండడం తనకు విస్మయం కలిగించిందని చెప్పారు. కార్యకర్తలు ఎవరు కూడా భయపడాల్సిన పనిలేదని మరో రెండేళ్లలో తాము అధికారంలోకి రాబోతున్నామని జోస్యం చెప్పారు.

## రాజేష్ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐ సురేష్‌రెడ్డి

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ దళిత బిడ్డ కర్ల రాజేష్ మృతికి ప్రధాన నిందితుడు చిలుకూరు ఎస్సై సురేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలసిందేనాని, మాజీ ఎమ్మెల్యే మౌనం వెనుక వెనుక మర్మం ఎమిటో తెలియజేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. శనివారం కోదాడ పట్టణ పబ్లిక్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కోదాడ రూరల్ సి.ఐ బి.సి వర్గానికి చెందినవాడు కావడంతో సస్పెండ్ చేశారు. సురేష్ రెడ్డి వర్గం కావడంతో జిల్లాకు అటాచ్ చేశారని మిగత వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని డిమాండ్ చేశారు. రాజేష్ కేసులో కుల, మతాలకు అతీతంగా చర్యలు తీసుకోవాలని డీజీపీకి, ఎస్సీ కమీషన్‌కు పిర్యాదు చేశామని తెలిపారు. మృతునికి ఎస్కార్టుగా వచ్చిన వారిని, డిఎస్‌పి, ఎస్పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీలో ఎంతో మంది వైద్యులు ఉన్న రెడ్డి కమ్యూనిటి వైద్యునితో పోస్టుమార్టం చేయించడంపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మతురాలి తల్లి , ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి రాజు, చింతా బాబుమాదిగ, కొండపల్లి ఆంజనేయులు, యలమర్తి రాము, నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి 25-30 ఇందిరమ్మ ఇండ్లు

### సర్పంచ్‌లు బాధ్యతగా పనిచేయాలి
### ఓడిన వారు లోపాలు తెలుసుకోవాలి
### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గెలిచిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులను అభినందిస్తూ శనివారం పట్టణంలోని కౌండిన్య గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సన్మానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచులను మూడు రంగుల కండువాలతో మంత్రి ఉత్తమ్ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గెలిచిన సర్పంచులు వార్డు సభ్యులు తమ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అలాగే కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలన్నారు. ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు వార్డు సభ్యులు ఓటమికి గల కారణాలను తెలుసుకుని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భారత దేశంలో హుజూర్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కంచుకోగా నిలవడానికి గల కారణం కార్యకర్తలే అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగాగత మార్చి నెలలో ఉగాది పర్వదినం రోజున సన్నబియ్యం కార్యక్రమానికి హుజూర్‌నగర్ గడ్డపై నుండి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో 85 శాతం మంది ప్రజలకు ఒక్కొక్కరికి ఆరుకేజీల చొప్పున సన్నబియ్యం అందజేయడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు అందజేయడం జరుగుతుందని, త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి 25 నుండి 30 ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గెలిచిన నాటి నుండి ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఒక్కొక్కటికిగా వివరించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వేలాది కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నూ తన సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు సీజ్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఇసుకను తెగ తోడేస్తున్నారు!... రాజకీయ నాయకుల కన్నుసైగల్లోనే... పట్టించుకోని అధికారులు అంటూ శనివారం ప్రజాపక్షం మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తా కథనానికి మైనింగ్ అధికారులు స్పందించారు. సూర్యాపేట మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకన్న తన సిబ్బందితో కలిసి మూసీ పరివాహక ప్రాంతాలలోని రహదారులపై విస్తృతంగా తనిఖీలు చేశారు. ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్లను ఆపి అనుమతులు ఉన్నాయా లేవాఅని ఇసుకను తరలిస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఎ లాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు (03) వాహనాలకు జరిమానాలు విధించారు. మరో ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

## నిరుపేద క్రీడాకారులకు సహకారం అందిస్తాం

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గ్రామీణ ప్రాంతాల్లో టాలెంట్ ఉన్న పేద విద్యార్థులను గుర్తించి వారిని జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి సుశీలమ్మ ఫౌండేషన్ తరపున సహకరిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 20 రోజులుగా జరుగుతున్న నల్లగొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఫైనల్‌కు చేరిన ఆదా సీ.సీ, డీకే వారియర్స్ టీంల మధ్య జరిగిన మ్యాచ్ లో డీకే వారియర్స్ టీం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవర్‌తో కలిసి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక సామర్థ్యం మెరుగుపడుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలో క్రికెట్ ఫుట్‌బాల్ లాంటి ఆటలు ఆడడానికి 10 ఎకరాల స్థలంలో నూతన హంగులతో స్టేడియం ఏర్పాటు చేసుకొని సామర్థ్యం ఉన్న క్రీడాకారులను తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,మాజీ జడ్‌పిటీసీలు వంగూరి లక్ష్మయ్య, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,టోర్నమెంట్ ఆర్గనైజర్స్ ప్రదీప్ నాయక్,కేసాని వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## సిసిరోడ్లకు సైడ్ బర్మ్స్ పనులు ప్రారంభం



**నందికొండ/ప్రజాపక్షం:** సీసీ రోడ్లు వేశారు సైడ్ బర్మ్స్ మరిచారు.. పనుల్లో నిర్లక్షం ప్రాణాలతో చెలగాటం" అనే శీర్షికతో ఈ నెల 16న ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కథనంలో ప్రస్తావించిన లోపాలపై దృష్టి సారించిన సంబంధిత శాఖ అధికారులు,సీసీ రోడ్లకు సైడ్ బర్మ్స్ నిర్మాణ పనులను శుక్రవారం మట్టిని పోసి శనివారం పనులు ప్రారంభించారు.ఇప్పటివరకు సైడ్ బర్మ్స్ లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్డు అంచులు కుంగిపోతున్నాయని ప్రజాపక్షం కథనం ద్వారా వెల్లడైంది. ఈ అంశం ప్రజల్లో చర్చకు దారి తీసి అధికారులపై ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆయా రోడ్ల ఇరువైపులా మట్టిని సమతలపరుస్తూ, సైడ్ బర్మ్స్ ఏర్పాటు చేసే పనులు సాగుతున్నాయి. స్థానికులు ఈ చర్యపై హర్షం వ్యక్తం చేస్తూ, పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా పర్యవేక్షణ పెంచాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

## యూరియా,ఎరువులు పారదర్శకంగా అందించాలనే 'యాప్'



### ఈయాప్ పట్ల రైతులు ఎలాంటి అపోహలు నమ్మొద్దు
### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రైతులకు అవసరమైన యూరియా,ఎరువులు సమయానికి,పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో ఫర్టిలైజర్స్ యూరియా ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.శనివారం ఆమె జిల్లా కేంద్రంలో మన గ్రోమోర్ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీలో ఫర్టిలైజర్ యూరియా బుకింగ్ యాప్ ప్రారంభించారు. ఈయాప్ వల్ల బోగస్ కంపెనీలు లేకుండా,బ్లాక్ మార్కెట్ జరగకుండా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఈ యాప్ పట్ల రైతులు ఎలాంటి అపోహాలు నమ్మవద్దని, వ్యవసాయ శాఖ మంచి అడుగు వేసిందని,అవసరమైతే రెవిన్యూ సిబ్బందిని ఉపయోగించుకుంటామని తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన యూరియాను ముందుగానే బుక్ చేసుకుని, నేరుగా సమీప డీలర్ వద్ద పొందే సౌకర్యం కల్పించబడిందని కలెక్టర్ తెలిపారు.ఇకపై ఎరువుల కోసం రైతులు క్యూలో నిలబడాల్సిన అవసరం ఉండదని, ఎరువుల అక్రమ నిల్వలు, దళారుల బెడద తగ్గుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,వ్యవసాయ శాఖ జెడి శ్రవణ్ కుమార్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరు శ్రీనివాస్,పిఏసిఎస్ డైరెక్టర్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

**ఆర్థికహక్కులపై ప్రజలు అవగాహన ఉండాలి**

ఆర్థికహక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. శనివారం ఉదయాదిత్య భవన్‌లో జిల్లా బ్యాంకర్లు, ఖాతాదారులతో అన్ క్లైమెడ్ ఖాతాల పై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకుల్లోని పొదుపు ఖాతాలు ,ఫిక్స్‌డ్ డిపాజిట్లు ,రికరింగ్ డిపాజిట్లు,షేర్లపై వచ్చే డివిడెండ్లు,మ్యూచువల్ ఫండ్ యూనిట్లు, ఇన్సూరెన్స్ పాలసీల మెచ్యూరిటీలు, డెత్ క్లైమ్‌లు, పోస్టాఫీస్ పథకాలు తదితర ఆర్థిక ప్రయోజనాలు చాలా చోట్ల సరైన సమాచారం లేకపోవడం వల్ల క్లైమ్ చేయకుండా మిగిలిపోతున్నాయని అన్నారు.

## రైల్లో ప్రయాణిస్తూ జారిపడి ఒకరు మృతి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** శ్రీరాంపురం,చిట్యాల రైల్వే స్టేషన్ల మధ్య ఏదో ఒక గుర్తు తెలియని రన్నింగ్ రైల్లో ప్రయాణిస్తూ శనివారం ప్రమాదవశాత్తు జారీ కిందపడి మృతి చెందాడని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ బొడిగె రామకృష్ణ తెలిపారు.మృతుడు 5.6 ఎత్తు,గోధుమ కలర్ షర్ట్,బ్లూ కలర్ జీన్స్ పాయింట్,బ్రౌన్ కలర్ బెల్ట్,నలుపు రంగు షోల్డర్ బ్యాగ్,కోల ముఖం,కలర్ తెలుపు రంగు,మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. దీనిపైన నల్లగొండ రైల్వే స్టేషన్ స్టేషన్ సూపరిండెంట్ నవీన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. మృతుని గురించి ఏమైనా సమాచారం తెలిస్తే ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ నల్లగొండ ఎస్ఐ ఫోన్ నెంబర్:8712658595 కు సమాచారం ఇవ్వాలని కోరారు.



## పట్టు నిలుపుకున్న పటేల్

### బాలెంల సర్పంచ్ గాలి మమత నగేష్‌లు కాంగ్రెస్‌లో చేరిక

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తన స్వంత గ్రామంలో తిరిగి తన పట్టును నిలుపుకున్నారు. ఈనెల 11వ తేదీన మొదటి విడతలో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో తన స్వంత గ్రామం బాలెంలలో పార్టీ తరపున మామిడి రేణుక యల్లయ్యను పంచాయితీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దింపగా బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి గాలి మమత నగేష్ చేతిలో 147 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. దీంతో పటేల్ తన స్వంత గ్రామంలో పట్టు కోల్పో యాడని సొంత పార్టీలోని తన వ్యతిరేక వర్గంతోపాటు, ఇతర పార్టీల నాయ కులు పెద్దఎత్తున ప్రచారం చేశారు. బాలెంలలో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమికి కారణం పార్టీలో ఉన్న వర్గ పోరేనని పటేల్ అనుచరులు తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగా ఎన్నికలు ముగిసిన పది రోజులలోనే బాలెంల గ్రామ సర్పంచ్‌గా విజయం సాధించిన గాలి మమత నగేష్‌లు బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ నాయకులు శివరాత్రి శేఖర్ ఆధ్వ ర్యంలో శనివారం హస్తం గూటికి చేరారు. సర్పంచ్ మమత నగేష్‌లకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఆయన సోదరుడు, స్ప్రెడ్ ఇండియా సేవా సంస్థ చైర్మన్ పటేల్ శ్రీధర్ రెడ్డిలు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారపల్లి ప్రభాకర్, ఆలకుంట్ల ముత్తిలింగం, పలాస నరేష్ గౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఈనెల 23 మినీ జాబ్ మేళా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు పలు ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాలను కల్పించుటకు ఈనెల 23 ఉదయం 10:30లకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయము,ఐటిఐ క్యాంపస్, నల్లగొండ నందు జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ తెలిపారు.జాబ్ మేళలో ఎంపిక కాబడిన వారికి రూ.10వేల నుండి25వేల వరకు జీతం ఇవ్వబడతాయి అన్నారు.

## డ్రగ్స్‌రహిత జిల్లాకు అధికారులు సమన్వయంగా కృషి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడంలో అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులకు సూచించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో అడిషనల్ డీసీపీ లక్ష్మీ నారాయణ, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాధా కృష్ణ, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, తదితర సంబంధిత విభాగాలతో కలిసి డ్రగ్స్ నిర్మూలన పై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా సరఫరా చేసిన వారిని గుర్తించి పోలీస్ శాఖ ద్వారా 4 కేసులు, ఎక్సైజ్ శాఖ ద్వారా 1 కేసు మొత్తం 5 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అన్ని విభాగాల సమన్వయంతో జిల్లాలో డ్రగ్స్, మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ ఏడి ప్రశాంత్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి రమేష్ నాయక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహా రావు, డ్రగ్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, సంబంధిత అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## మాక్ డ్రిల్ ఎక్సర్‌సైజ్‌పై విస్తృత ఏర్పాట్లు




### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఆకస్మికంగా సంభవించే వరదలు అగ్నిప్రమాదాల నివారణపై ఈనెల 22న నిర్వహించు మాక్‌డ్రిల్ ఎక్సర్‌సైజ్‌పై విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. అనుకోకుండా జరిగే వరదలు, అగ్ని ప్రమాదాలలో ప్రజలను అప్రమత్తం చేయడానికి మాక్‌డ్రిల్ ఎక్సర్‌సైజ్ ఏర్పాట్లపై శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్‌పి కె నరసింహతో కలిసి అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న కోదాడ పట్టణంలోని షిరిడి సాయినగర్ నందు మాక్‌డ్రిల్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా ఆకస్మికంగా వరదలు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలను ఏవిధంగా అప్రమత్తం చేయాలి, వారి ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అలాగే ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా వారిని ఎలా రక్షించాలో కండ్లకు కట్టినట్టుగా ఈ మాక్‌డ్రిల్ ఎక్సర్సైజ్ ద్వారా ప్రదర్శించటం జరుగుతుందన్నారు. దీనిలో రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, వైద్య ఆరోగ్య, పంచాయితీరాజ్, ఇరిగేషన్, మున్సిపాలిటి, ఎలక్ట్రిసిటి, స్పోర్ట్స్ అండ్ యూత్, ప్రజలను భాగస్వాములు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, అదనపు ఎస్‌పి జనార్థన్ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ వై కృష్ణారెడ్డి, కోదాడ ఆర్‌డిఓ సూర్యనారాయణ, డిపిఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్, డిఎస్ఓ మోహన్‌బాబు, అడిషనల్ సిఈఓ శిరీష, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు పెన్‌పహాడ్ పునాది వేసిందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఇటీవల గెలిచిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మానం కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన వారు గెలిచిన సర్పంచ్‌లను సన్మానించి మాట్లాడారు. త్వరలో జరగబోయే మండల పరిషత్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. రావిచెరువును మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఎన్ఎస్‌పి కెనాల్ నుండి నీళ్ళు తెస్తానని 3 సార్లు నమ్మబలికి మోసం చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ కార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ భుజంగరావు, మాజీ జడ్‌పిటిసి పిన్నెని కోటేశ్వరరావు, మార్కెట్ కమిటి డైరెక్టర్లు దామోదర్ రెడ్డి, ఆర్తి కేశవులు, మండల సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.






# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## లాలూకు విజయవంతంగా కంటి శస్త్రచికిత్స

**న్యూఢిల్లీ:** ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ శనివారంనాడు కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. స్థానిక 'సెంటర్ ఫర్ సైట్' ఆసుపత్రిలో జరిగిన క్యాటరాక్ట్, రెటీనర్ సర్జరీ విజయవంతమైందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. సెంటర్ ఫర్ సైట్ గ్రూప్ ఐ ఆసుపత్రుల చైర్మన్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మహిపాల్ సింగ్ సచ్‌దేవ్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ జరిగింది. లాలూ ప్రసాద్ కంటి శస్త్రచికిత్స విజయవంతమైందని, చికిత్సకు బాగా స్పందించారని, త్వరలోనే పూర్తిగా కోలుకుంటారని ఆసుపత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. అడ్వాన్స్‌డ్ ఆప్థమాలిక్ టెక్నిక్స్ ఉపయోగించి ఎలాంటి కాంప్లికేషన్స్ లేకుండా సర్జరీ పూర్తి చేసామని, సర్జరీ అనంతరం డిశ్చార్ చేశామని, ఆయన ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటారని వెల్లడించాయి. లాలూ ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని ఆయన కుమార్తె మిసా భారతి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అందరితో పంచుకున్నారు. తన తండ్రి ఆరోగ్యం కోసం ప్రార్థించిన శ్రేయాభిలాషులు, వైద్య బృందం, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. 77 ఏళ్ల లాలూ 2022 డిసెంబర్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

# ట్రంప్‌నకు 'శాంతి' చేకూర్చేందుకే

- పార్లమెంట్‌లో న్యూక్లియర్ బిల్లు బుల్డోజ్ అని కాంగ్రెస్ మండిపాటు
- 'శాంతి' చట్టాన్ని 'టంప్' చట్టంగా అభివర్ణించిన జైరామ్ రమేష్



**న్యూఢిల్లీ:**పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో శాంతిబిల్లును బలవంతంగా ఆమోదింపచేయడంపై కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఒకప్పటి మంచి స్నేహితుడితో శాంతిని పునరుద్ధరించుకోవడానికే న్యూక్లియర్ బిల్లును బలవంతంగా ఆమోదింపజేశారని ఆరోపించింది. శాంతి బిల్లు పౌర అణు నష్ట పరిహార చట్టంలోని కీలక నిబంధనలను తొలగిస్తుందని, ఈ విషయంపై యునైటెడ్ స్టేట్స్ 2026 జాతీయ రక్షణ అధికార చట్టంలో ఆందోళన వ్యక్తం చేయబడిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. అమెరికా 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జాతీయ రక్షణ అధికార చట్టంపై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడే సంతకం చేశారని రమేష్ ఎక్స్‌లో పేర్కొంటూ 'ఈ చట్టం 3,100 పేజీల పొడవు ఉంది. 1,912వ పేజీలో అణు బాధ్యత నిబంధనలపై యునైటెడ్ స్టేట్స్, భారతదేశం మధ్య ఉమ్మడి అంచనాకు సంబంధించిన ప్రస్తావన ఉంది. ఈ వారం ప్రారంభంలో ప్రధానమంత్రి పార్లమెంటులో శాంతి బిల్లును ఎందుకు బలవంతంగా ఆమోదింపజేశారో ఇప్పుడు మాకు కచ్చితంగా తెలిసింది. ఈ బిల్లు, ఇతర విషయాలతో పాటు, పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన 2010 పౌర అణు నష్ట పరిహార చట్టంలోని కీలక నిబంధనలను తొలగించింది. ఇది తన ఒకప్పటి మంచి స్నేహితుడితో శాంతిని పునరుద్ధరించుకోవడానికే' అని కాంగ్రెస్ నాయకుడు తన పోస్ట్‌లో అమెరికా చట్టం కాపీని జతచేస్తూ అన్నారు. 'శాంతి చట్టాన్ని ట్రంప్ చట్టం— ది రియాక్టర్ యూజ్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రామిస్ యాక్ట్' అని కూడా పిలవవచ్చని రమేష్ పేర్కొన్నారు. అమెరికా చట్టంలోని 1,912వ పేజీలో 'అణు బాధ్యత నిబంధనలపై యునైటెడ్ స్టేట్స్, భారతదేశం మధ్య ఉమ్మడి అంచనా' అనే శీర్షిక కింద ఒక విభాగం ఉందన్నారు. కాగా, రాజ్యసభలో ఈ బిల్లుపై జైరామ్ రమేష్ మాట్లాడుతూ అణు విద్యుత్ మౌలిక సదుపాయాలను నిర్మించడంలో ప్రభుత్వ రంగాన్ని పణంగా పెట్టి ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించవద్దని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. దేశంలో ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి అందుబాటులో ఉన్న స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలపైకి ప్రైవేట్ సంస్థలు ప్రవేశించలేవు కాబట్టి అవి అణు రంగం వృద్ధికి చోదకంగా ఉండలేవని కూడా ఆయన అన్నారు. పార్లమెంట్ గురువారం అణు ఇంధన బిల్లును ఆమోదించింది. పటిష్టంగా నియంత్రించబడిన పౌర అణు రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యం కోసం తెరవడానికి ఉద్దేశించిన చట్టానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ప్రతిపాదిత చట్టాన్ని పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన అనేక సవరణలను తిరస్కరిస్తూ, ఎగువ సభ సస్టయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లును మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. దీనిని బుధవారం లోక్‌సభలో ఆమోదించారు. ఈ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, అణు ఇంధన శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారతదేశాన్ని అణుశక్తిలో స్వావలంబన చేయడం, ఇతర ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం దీని లక్ష్యమని అన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో
# కాంగ్రెస్ అధిష్ఠానంపై విద్వేష రాజకీయాలు

గాంధీ భారతదేశాన్ని గాడ్సే భారత్‌గా మారనివ్వం
నరేగా నుంచి గాంధీ పేరును తొలగించిన వారు ద్రోహులు
కర్ణాటకలో నిరసన కాంగ్రెస్ ప్రదర్శన



**బెంగళూరు:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.నరేగా) పేరును మార్చడాన్ని వ్యతిరేకిస్తూ కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరసన తెలిపింది. అలాగే, నేషనల్ హెరాల్డ్ కేసులో పార్టీ నాయకత్వంపై 'విద్వేష రాజకీయాలకు' పాల్పడుతోందని ఆరోపించింది. కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నేతృత్వంలో బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, శాసనసభ్యులు పాల్గొన్నారు. ఈ నిరసన సభలో శివకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, కార్యకర్తలు గాంధీ భారతదేశాన్ని గాడ్సే (నాథూరామ్ గాడ్సే) భారత్‌గా మార్చడానికి అనుమతించరన్నారు. దేశ ఐక్యత, స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహాత్మా గాంధీ పేరును తొలగించడానికి నాథూరామ్ గాడ్సే పార్టీ (స్పష్టంగా బిజెపిని ఉద్దేశిస్తూ) ప్రయత్నిస్తోం దని మండిపడ్డారు. నరేగా పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించినందుకు వారిని ద్రోహులు అని అభివర్ణించారు. గాంధీ విగ్రహాల ముందు నిరసనలు తెలిపే హక్కును బిజెపి నాయకులు కోల్పోయారని శివకుమార్ అన్నారు. 'ఇకపై మీరు (బిజెపి) గాంధీ విగ్రహాల ముందు నిరసనలో కూర్చోకూడదని సూచించారు. కరెన్సీ నోట్లపై ఉన్న మహాత్మాగాంధీ చిత్రాన్ని తొలగించాలని బిజెపిపి, కేంద్రంలోని ఆ పార్టీ ప్రభుత్వానికి సవాలు విసురుతూ, 'చరిత్రను వక్రీకరించడానికి మీరు చేసే ప్రయత్నాలను మేము విజయవంతం కానివ్వం. కాంగ్రెస్ దీనిని జరగనివ్వదు' అని ఆయన అన్నారు. నెహ్రూ—గాంధీ కుటుంబం ఈ దేశం కోసం తమ ఆస్తిని, ప్రాణాలను, అధికారాన్ని త్యాగం చేసిందని పేర్కొంటూ, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకున్నందుకు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బిజెపి గౌరవాన్ని కోల్పోయిందని ఆరోపించారు. రాజకీయ విద్వేషంతో ఏజెన్సీలను ఉపయోగించి కాంగ్రెస్ నాయకత్వంపై తప్పుడు కేసులు పెడుతోందని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈనెల 8—19 వరకు రాష్ట్ర శాసన సభ శీతాకాల సమావేశాలు జరిగిన బెళగావిలోని సువర్ణ విధాన సౌధ వద్ద ఉన్న గాంధీ విగ్రహం ముందు 17న ఈ విషయంపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు, శివకుమార్ నిరసనలో పాల్గొన్నారు.

## శక్తిమంతమైన దేశం
### తన ఇష్టాలను ఇతరులపై రుద్దొద్దు
అది సమంజసం కాదు: జైశంకర్



**న్యూఢిల్లీ:** ఒక దేశం శక్తిమంతమైన దేశమైనంత మాత్రాన అది తన ఇష్టాలను ఇతరులపై రుద్దడం సరికాదని భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. ప్రపంచీకరణ మన ఆలోచన, పని విధానాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. శనివారం మహారాష్ట్ర పుణెలోని సింబయోసిస్ ఇంటర్నేషనల్‌లో జరిగిన స్నాతకోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, అనేక అధికార కేంద్రాలు ఉద్భవించాయని మంత్రి జైశంకర్ చెప్పారు. అధికారం అనేదానికి ఎన్నో అర్థాలు ఉంటాయని.. వాణిజ్యం, మిలిటరీ, ఇంధనం, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా అవి మారుతుంటాయని పేర్కొన్నారు. ఈ అధికారం ఏ ఒక్క దేశానికి పరిమితం కాదని, ఈ విషయాన్ని గ్లోబల్ పవర్స్ గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎంత శక్తిమంతమైన దేశమైనా సరే అది తన ఇష్టాలను ఇతరులపై రుద్దలేదని, ప్రపంచ దేశాల మధ్య సహజమైన పోటీ ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇక భారత్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు తయారీ రంగంలో దూసుకువెళ్లాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తుచేశారు. ఇదిలావుంటే ప్రస్తుతం భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఇరుపక్షాల మధ్య చర్చలు జరుగుతుండగానే ట్రంప్ భారత వస్తువులపై టారిఫ్‌ను రెట్టింపు చేసి 50 శాతానికి చేర్చారని మంత్రి చెప్పారు. అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ దిగుమతులపై భారత్ పన్నులు తగ్గించాలని అగ్రరాజ్యం కోరుతోందని, అందుకు భారత్ ఒప్పుకోవడం లేదని తెలిపారు. ఆ నేపథ్యంలోనే ట్రంప్ టారిఫ్‌లను ఆయుధంగా వాడుకుంటున్నారని అన్నారు.

## గగన్‌యాన్ గాలిగుమ్మటాల పనితీరు భేష్:ఇస్రో

**బెంగళూరు:**గగనయాన్ ప్రయోగానికి ముందుగా జరుగుతున్న అనేక వరుస పరీక్షలలో భాగంగా గాలిగుమ్మటాల పరీక్షను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. గగనయాన్ యాత్ర ముగించుకుని సురక్షితంగా తిరిగి వచ్చే సమయంలో వ్యోమగాములను తీసుకువచ్చే మాడ్యూల్‌ను తీవ్రమైన గాలి ఒత్తిడి నుండి నియంత్రించడానికి సంబంధించిన గాలిగుమ్మటం పారాఛ్యూట్స్ విజయవంతంగా తెరచుకుని పనిచేశాయని ఇస్రో అధికారులు చెప్పారు. ఈ గాలిగుమ్మటాలు మాడ్యూల్ వేగాన్ని తగ్గించి సురక్షితంగా దిగడానికి దోహదం చేస్తాయి. ఈనెల 18,19 తేదీలలో చండీగఢ్‌లోని టర్మినల్ బాలిస్టిక్ రీసెర్చ్ లేబొరేటరీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్‌టిఆర్‌ఎస్ (రైల్ ట్రాక్ రాకెట్ స్లెడ్) ట్రాక్ ద్వారా ఈ పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసినట్లు చెప్పారు. వ్యోమగాములు గగనయాన్ లక్ష్యం పూర్తిచేసుకుని సురక్షితంగా భూమ్మీద దిగడానికి మాడ్యూల్ తోక భాగంలో నాలుగు రకాలైన పది గాలిగుమ్మటాలను అమరుస్తారు. భూమి వాతావరణంలోకి ప్రవేశించిన తర్వాత నిర్దేశిత సమయానికిఈ గాలిగుమ్మటాలు కమాండ్స్‌కు అనుగుణంగా తెరచుకోవాల్సి ఉంటుంది. అగ్రభాగాన ఉండే మూతనుండి రెండు పారాఛ్యూట్స్ వేరుకావడంతో గాలిగుమ్మటాలు తెరచుకునే ప్రక్రియ ప్రారంభం అవుతుంది. పారాఛ్యూట్స్ ఉండే విభాగంపై రక్షణగా ఉన్నమూత తొలగిపోవడంతో ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత మాడ్యూల్ వేగాన్ని నియంత్రించడానికి, స్థిరీకరించడానికి పారాఛ్యూట్స్ పనిచేయడం ప్రారంభిస్తాయి. గాలిగుమ్మటాలు తెరచుకోగానే దానికి రక్షణగా ఉంటే మూడు గాలిగుమ్మటాలు ప్రధానమైన పారాఛ్యూట్‌ను లాగడానికి విస్తరించుకుంటాయి. దాంతో వ్యోమగాములున్న మాడ్యూల్ మెల్లిగా వేగం తగ్గుతూ ఉంటుంది. ఈ పరీక్షకు సంబందించిన అన్ని లక్ష్యాలను విజయవంతంగా ఇస్రో పూర్తిచేయగలిగిందని అధికారులు చెప్పారు.

## బిడిఎస్ అడ్మిషన్ల నిబంధనలు ఉల్లంఘన..
# 100 డెంటల్ కాలేజీలకు జరిమానా

- రూ.10 కోట్ల చొప్పున విధిస్తూ 'సుప్రీం' తీర్పు



**జైపూర్ :** అడ్మిషన్లలో 10 ప్రైవేట్ దంత వైద్య కళాలలు అక్రమాలకు పాల్పడ్డాయన్న నేరాభియోగంపై విచారించిన సుప్రీంకోర్టు శనివారం తన కీలక తీర్పును వెలువరించింది. ఒక్కో కళాశాలకు రూ.10 కోట్ల చొప్పున జరిమానా విధించింది. వారు చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడ్డారని, నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడమేనని, అది 'కఠినమైన శిక్షార్హమైన చర్య' అని వ్యాఖ్యానించింది. ఈ కేసులో వైద్య విద్యా ప్రమాణాలు దిగజారాయని గమనించిన న్యాయమూర్తులు జస్టిస్ విజయ్ బిష్ణోయ్, జస్టిస్ జె.కె. మహేశ్వరిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ డెంటల్ కళాశాలల తీరు, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. 20162017 విద్యాసంవత్సరానికి బిడిఎస్ (బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ) అడ్మిషన్లలో చట్టపరమైన విధానాలను పాటించనందుకు రాజస్థాన్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఆర్‌ఎస్‌ఎల్‌ఎస్‌ఎ)లో రూ. పది లక్షలు డిపాజిట్ చేయాలని కూడా అత్యున్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండానే బిడిఎస్ విద్యార్థులకు అవసరమైన కనీస పర్సంటైల్‌కు వ్యతిరేకంగా నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) 10శాతం, 5 శాతం తగ్గించిన అడ్మిషన్ల ప్రక్రియలో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని గుర్తించిన తర్వాత కోర్టు ఈ కఠినమైన ఉత్తర్వులు జారీచేసింది. ఈ తగ్గింపులు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటుచేసిన కనీస అర్హత ప్రమాణాలను అందుకోలేకపోయినప్పటికీ కొంతమంది విద్యార్థులు డెంటల్ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు వీలు కల్పించాయి. అలాగే ఈ 10+శాతం మించి మరికొంతమంది విద్యార్థులను చేర్చుకున్నాయి. డిసెంబరు 18న కోర్టు ఇచ్చిన తీర్పులో 20162017 విద్యా సంవత్సరానికి నీట్ పర్సంటైల్ సడలింపు తర్వాత ప్రవేశం పొందిన విద్యార్థులకు పూర్తి న్యాయం చేయడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద తన పూర్తి అధికారాన్ని వినియోగించి వారి బిడిఎస్ డిగ్రీలను క్రమబద్ధీకరించడం ద్వారా కోర్టు ఉపశమనం కల్పించింది. ప్రధాన పిటీషన్‌లో, 59మంది విద్యార్థుల తరపున న్యాయవాది రిచెబ్ సాంచెటి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశం మేరకు విద్యార్థులు అందరూ రాజస్థాన్ హైకోర్టు ముందు అఫిడవిట్లు దాఖలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైనప్పుడు సేవలు అందించాలని కోరినట్లు తెలిపారు. 10+5 శాతం సడలింపుతో విద్యార్థులను చేర్చుకోవడం ద్వారా డెంటల్ కళాశాలలు 2007 నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించాయని సుప్రీంకోర్టు ఎత్తిచూపిందతి. రాష్ట్ర ప్రభుత్వం అలాంటి సడలింపులను మంజూరు చేయడానికి అనధికారిక చర్య తీసుకోవడంతోపాటు , కేంద్ర ప్రభుత్వం, డిసిఐకి నిర్ణయాలను వెంటనే తెలియజేయడంలో విఫలమైందని తీవ్రంగా విమర్శించింది. 'ప్రస్తుత కేసులో వైద్య విద్యా ప్రమాణాలు క్షీణించడం పట్ల మేము మా అసంతృప్తిని వ్యక్తం చేయాల్సి వచ్చింది. కళాశాలలు 10+5శాతం దాటి విద్యార్థులను చేర్చుకోవడం ద్వారా 2007 నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించాయని, బహిరంగంగా, చట్టవిరుద్ధంగా వ్యవహరించాయని, అందువల్ల కఠినమైన శిక్ష చర్య అవసరం' అని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కాగా జరిమానా మొత్తాలను 8వారాలలోగా ఆర్‌ఎస్‌ఎల్‌ఎస్‌ఎకు జమచేయాలని, ఆ నిధులను రాష్ట్రంలోని వన్‌స్టాప్ సెంటర్లు, నారీ నికేతన్స్, ఓల్డ్ ఏజ్ హోమ్స్, చైల్డ్ కేర్ వంటి సామాజిక సంస్థల సంక్షేమానికి ఉపయోగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## అది దురదృష్టకర ఘటన..
### హిజాబ్‌పై బిహార్ సిఎం క్షమాపణ చెప్పాలి
మాయావతి



**న్యూఢిల్లీ:** ఇటీవల బిహార్‌లో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఒక ముస్లిం మహిళ ముఖంపై ఉన్న హిజాబ్‌ను లాగడం వివాదాస్పదమైంది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో బిఎస్‌పి అధ్యక్షురాలు మాయావతి ఈ అంశంపై స్పందించారు. ఘటనపై నితీశ్ కుమార్ సారీ చెప్పాలని సలహా ఇచ్చారు. నితీశ్ తన తప్పును ఒప్పుకుని సారీ చెప్పకుండా పెద్దది చేశారని, కొందరు మంత్రులు, ఇతరుల వ్యాఖ్యలు ఆ వివాదాన్ని మరింత పెద్దది చేశాయని మాయావతి తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఇలా జరగడం దురదృష్టకరమని, అది చింతించాల్సిన విషయమని అభిప్రాయం వ్యక్తంచేశారు. వైద్యులకు అప్పాయింట్‌మెంట్ లెటర్స్ పంపిణీ చేసే ఆ కార్యక్రమంలో మహిళల భద్రతకు, గౌరవానికి భంగం కలుగకుండా చూసుకోవాల్సిన అవసరం ఉండెనని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆ ఘటనపై క్షమాపణ చెప్పి విషయం మరింత పెద్దది కాకుండా చూసుకోవాల్సి బాధ్యత ఉండేనని మాయవతి పేర్కొన్నారు. ఇప్పటికైనా సారీ చెప్పి వివాదానికి తెరదించాలని సలహా ఇచ్చారు.

# 'మహా జంగిల్‌రాజ్'ను అంతం చేస్తాం

- అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు బెంగాల్ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయ్
- టిఎంసి ప్రభుత్వంపై ప్రధాని మండిపాటు



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని 'మహా జంగిల్ రాజ్'గా అభివర్ణించిచారు. అధికార పార్టీ అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాదియా జిల్లాలోని తాహెర్‌పూర్‌లో జరిగిన భారీ సభనుద్దేశించి కోల్‌కతా నుంచి ఫోన్ ద్వారా ప్రసంగించారు. సభా ప్రాంగణంలో దట్టమైన పొగమంచు కారణంగా ప్రధానమంత్రి హెలికాప్టర్ తాహెర్‌పూర్‌లోని తాత్కాలిక హెలిప్యాడ్‌లో దిగలేకపోయింది. దీంతో ఆయన కోల్‌కతా విమానాశ్రయానికి తిరిగి వెళ్లవలసి వచ్చింది. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 2026 అసెంబ్లీ ఎన్నికలలో బిజెపికి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. 'టిఎంసి నన్ను, బిజెపిని ఎంతగా వ్యతిరేకించినా వ్యతిరేకించనీయండి, కానీ అధికార పార్టీ ప్రజలను బందీలుగా ఉంచి, వారిని ఇబ్బందులకు గురిచేసి, బెంగాల్ అభివృద్ధిని ఆపలేదు' అని ఈ ఏడాది బెంగాల్‌లో జరిగిన నాల్గవ 'పరివర్తన్ సంకల్ప సభ'లో మోదీ అన్నారు. అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్న బెంగాల్‌లో టిఎంసి 'మహా జంగిల్ రాజ్'ను తాము అంతం చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంతానికి సద్భావన, పథకాలు, నిధులకు కొరత లేనప్పటికీ, 'కట్ మనీ, కమిషన్' సంస్కృతి రాష్ట్రంలో అభివృద్ధిని నిలిపివేసిందని ప్రధానమంత్రి ఆరోపించారు. బెంగాల్‌లో అభివృద్ధిని తీసుకురావడానికి తన పూర్తి శక్తిని ఉపయోగించాలనుకుంటున్నానన్నారు. బిజెపికి అవకాశం ఇవ్వండి... ఇక్కడ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తీసుకురండి అంటూ వచ్చే ఏడాది రాష్ట్ర ఎన్నికల కోసం తన పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తూ మోదీ ఉద్ఘాటించారు. ఇటీవల ముగిసిన బిహార్ ఎన్నికలలో ఎన్‌డిఎ సాధించిన భారీ విజయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, పొరుగు రాష్ట్రంలోని ఫలితాలు బెంగాల్‌లో పార్టీ భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బిహార్ ఎన్నికల ఫలితాలు బెంగాల్‌లో బిజెపి విజయానికి తలుపులు తెరిచాయని, ఎందుకంటే గంగానది బిహార్ నుండి బెంగాల్‌లోకి ప్రవహిస్తుందని అందరికీ తెలుసునన్నారు. బెంగాల్‌లో క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావం టిఎంసి దుర్మార్గపు పాలన నుండి విముక్తి పొందడమే అని మోదీ పేర్కొన్నారు. 'రాష్ట్రంలోని వీధులు, సందులు 'బంచ్‌తే చాయ్, బిజెపి తాయ్' (జీవించడానికి బిజెపి కావాలి) అనే నినాదంతో మారుమోగుతున్నాయి' అని అన్నారు. మోదీ తన ప్రసంగంలో మతువా శాఖకు చెందిన మత నాయకులు, వ్యవస్థాపకులైన హరిచంద్ ఠాకూర్, గురుచంద్ ఠాకూర్‌లను స్మరించుకున్నారు. సమాజ అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. ప్రధానమంత్రి తహేర్‌పూర్ ర్యాలీలో పాల్గొన్న ప్రజలకు ఆ ప్రాంతానికి చెందిన 15వ శతాబ్దపు బెంగాలీ సాధువుకు గుర్తింపుగా 'జై నితాయ్' నినాదంతో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, మతువా సమాజం పూజించే మరో భక్తి సాధువు, ఆ ప్రాంతానికి చెందిన చైతన్య మహాప్రభు చేసిన సేవలను కూడా ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రంలో బిజెపి ప్రధాన ఎన్నికల ఎజెండాలలో ఒకటైన చొరబాటుదారుల సమస్యను ప్రస్తావించిన మోదీ తృణమూల్ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. బెంగాల్‌లో చొరబాటుదారులకు టిఎంసి మద్దతు, ఆశ్రయం కల్పిస్తోందని ఆరోపించారు. చొరబాటుదారులను గుర్తించకుండా కాపాడటానికే టిఎంసి ఎస్‌ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తోందని, అదే ఆ పార్టీ నిజస్వ రూపమని మోడీ అన్నారు. పార్లమెంటులో జరిగిన బంకిమ్ దా వివాదంపై మాట్లాడుతూ, ప్రధాని వందేమాతరం సృష్టికర్తను ఋషి బంకిమ్ బాబు అని పిలుస్తూ స్మరించుకున్నారు.

## జస్టిస్ స్వామినాథన్‌పై అభిశంసనయత్నం
# ప్రజాస్వామ్యానికి విఘాతమట!

**న్యూఢిల్లీ:** మత సామరస్యాన్ని దెబ్బతీసేవిధంగా మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ ఇచ్చిన ఉత్తర్వులను తప్పుపడుతూ చట్టసభలో అభిశంసించేందుకు ప్రతిపక్షాలు సిద్ధం కావడాన్ని 36 మంది మాజీ న్యాయమూర్తులు మూకుమ్మడిగా వ్యతిరేకించారు. ఈ చర్యకు అనుమతించినట్లయితే ప్రజాస్వామ్యం, భారత న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్య మూలాలను తెగ్గోసినట్టే కాగలదని వారు పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుల చర్యను బహిరంగంగా వ్యతిరేకించాలని పార్లమెంటేరియన్లు, ప్రజలకు వారు పిలుపు ఇచ్చారు. కార్తీకమాసంలో తమిళనాడు తిరుప్పరంకుంద్రంలోని కొండపై ఉన్న సికిందర్ బాద్‌షా దర్గాకు కొన్ని మీటర్ల దూరంలో ఉన్న కొండపై రాతిస్తంభంమీద కార్తీకదీపం వెలిగించాలని గత కాలపు తీర్పులకు విరుద్ధంగా వివాదాస్పద ఉత్తర్వులు ఇవ్వడం వివాదానికి దారితీసింది. ఇటీవల ముగిసిన పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో డిఎంకె సారథ్యంలో అనేకమంది ప్రతిపక్ష ఎంపీలు డిసెంబరు 9వ తేదీన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నోటీసు ఇచ్చారు. మద్రాసు హైకోర్టు సింగిల్ జడ్జ్ జస్టిస్ స్వామినాథన్‌ను తొలగించాలని కోరుతూ సభలో స్పీకర్‌కు ఒక తీర్మానం అందజేశారు. ఈ తీర్మానాన్ని అనుమతిస్తే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమంటూ తాజాగా 36 మంది న్యాయమూర్తులు ప్రతిస్పందించారు. లోక్‌సభలో ప్రతిపక్షాలు ఈ విధంగా ఒక తీర్మానం ప్రవేశపెట్టాలని స్పీకర్‌ను కోరడాన్ని ఈ న్యాయమూర్తులు తీవ్రంగా తప్పుపట్టారు. సమాజంలో ఒక ప్రత్యేక వర్గానికి రాజకీయ మినహాయింపులు ఇవ్వకుండా, వారి సైద్ధాంతిక భావజాలాన్ని సమర్థించకుండా ఉన్న న్యాయమూర్తులను నిస్సిగ్గుగా బెదిరించి, కన్నెర్రజేసే ప్రయత్నమేనని ఒక ప్రకటనలో ఆ న్యాయమూర్తులు ఆరోపించారు. ఈ విధమైన తీర్మాన ప్రక్రియకు సభలో అనుమతించినట్లయితే, ప్రజాస్వామ్యమూలాలను తెగ్గోసినట్టే కాగలదని వారు విమర్శించారు. న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యాన్ని హరించినట్లే కాగలదన్నారు. "అందువల్ల మేం పార్టీలకు అతీతంగా ఎంపీలు అందరూ, న్యాయవాదుల సంఘాల సభ్యులు, పౌర సమాజం, విస్తారంగా ఉన్న పౌరులు చాలా స్పష్టంగా నిరసన వ్యక్తం చేయాలని, వ్యతిరేకించాలి, ఇలాంటి చర్యలను మొగ్గలోనే తుంచేసేవిధంగా స్పందించాలి" అని పిలుపు ఇచ్చారు. న్యాయమూర్తులు భారత రాజ్యాంగానికి, వారు దానిపై చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి ఉండాలేతప్ప పక్షపాత ధోరణితో కూడి రాజకీయ ఒత్తిడులకు, బెదిరింపులకు గురిచేసే సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని న్యాయమూర్తులు తమ ప్రకటనలో పేర్కొన్నారు.

## హిమాచల్‌ప్రదేశ్‌లో నలుగురి అరెస్ట్

**న్యూఢిల్లీ:** హిమాచల్‌ప్రదేశ్ , ఢిల్లీ ఎన్ సి ఆర్ మధ్య మాదక ద్రవ్యాల గొలుసును ఢిల్లీ పోలీస్‌లు ఛేదించారు. నలుగురిని అరెస్టు చేసి సుమారు చరస్‌ను పట్టుకున్నారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం నలుగురిలో ఒకరైన కుందన్‌లాల్ (40) కుల్లు జిల్లా వాసి, ఇతనిని ఈనెల 12న పహర్ గంజ్ లోని ఒక హోటల్‌లో పోలీస్‌లు పట్టుకున్నారు. అతని వద్దనుండి 1,136 గ్రాముల చరస్‌ను స్వాధీనం చేసుకున్నారు. కుందన్‌ను నార్కోటిక్ డ్రగ్స్ ,సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం ప్రకారం అరెస్ట్ చేశారు. 2024లో హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్ పూర్‌లో ఇతనిపై దీనికి సంబంధించిన కేసులు ఉన్నాయని తెలిసిందన్నారు. కుందన్ చరస్‌ను డిల్లీ ఎన్‌సిఆర్‌లో పంపిణీ చేయటం కోసం తెచ్చాడన్నాడు. ఈస్ట్ డిల్లీ నివాసులైన గౌరవ్‌వర్మ పియూష్ కుమార్ అలియాస్ ఎలు ఇద్దరు కాంట్రాబాద్ రిసీవర్లుగా ఉన్నారని పేర్కొన్నారు. వీరిని 13న దాడుల్లో అరెస్ట్ చేశారు. వీరిలో కుల్లూ జిల్లా నివాసి మనీష్ కుమార్ అలియాస్ మనీష్ ఠాకూర్ సరఫరా నెట్‌వర్క్‌లో కీలక వ్యక్తిగా పేర్కొన్నారు. మజ్నుకా తిలా ఐఎస్‌బిటి ప్రదేశంలో దాడులలో ఈనెల 18న అరెస్టు చేశారన్నారు. అతని వద్ద 562 చరస్ ఉందన్నారు.

## అక్రమ కోడైన్ సిరప్ బాధ్యులపై బుల్‌డోజర్ యాక్షన్:అఖిలేశ్ డిమాండ్

లక్నో: వివాదాస్పద కోడైన్ సిరప్ అక్రమ వాణిజ్యంపై ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ మధ్య మాటల యుద్ధం మరింత పెరిగింది. యోగి ఆదిత్య ద్విపదలతో, పద్యాలతో విమర్శలు ప్రారంభించగా అఖిలేశ్ యాదవ్ కవితాత్మకంగా ఎదురుదాడి చేశారు. లక్నోలోని సమాజ్‌వాదీపార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ, నేరస్థులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం రాజకీయ ఆరోపణలు చేస్తోందని, ఫొటోలు అందరికీ పంచుతోందని విమర్శించారు. కోడైన్ సిరప్ అక్రమాలు, మరణాలకు సంబంధించిన కేసులో బాధ్యులైన, భాగస్వాములైన అందరినీ రాజకీయ అనుబంధాలకు అతీతంగా మట్టుపెట్టాలని, 'బుల్డోజర్ యాక్షన్' తీసుకోవాలని కోరారు.ఈ సమస్య కేవలం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే పరిమితం కాదనీ, ప్రధానమంత్రి పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసికి కూడా సంబంధం ఉందని అన్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పద్యం ద్వారా చేసిన విమర్శలను అఖిలేశ్ యాదవ్ ప్రస్తావిస్తూ, తాను స్వతహాగా ఒక కవిని కాదని, కానీ తన పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఉదయ్ ప్రతాప్ తన పక్కనే కూర్చుని ఉన్నారనీ, ఆయకు సాహిత్యంతో చాలా బాగా పరిచయం ఉందని అన్నారు. ఆయన రాసిన రచనలలోని కొన్ని వాక్యాలను అఖిలేశ్ ఉటంకించారు. "నీ మొహాన్ని నీ అంతట నువ్వు శుభ్రం చేసుకోలేక అకారణంగా అద్దాన్ని ముక్కలు చేస్తున్నావు" అనేదే ఆయన ఉటంకించిన కవితలోని అంతరార్థం. పరులపై నిందలు వేయవద్దంటూ ముఖ్యమంత్రికి ఈ కవిత ద్వారా పరోక్ష హెచ్చరిక చేశారు. శీతాకాల శాసనసభ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందుగా, ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ శుక్రవారం మాట్లాడుతూ, ముఖంమీద మట్టి ఉంది గానీ నేను అద్దాన్ని శుభ్రంగా ఉంచుతున్నానని కవితాత్మకంగా చెప్పారు. అఖిలేశ్ యాదవ్‌తో కలిసి మాఫియాలు, ఇతరులు కలిసి ఉన్న ఫొటోలను ఆదిత్యనాథ్ ప్రదర్శించారు. ఈ విషయంలో దర్యాప్తు చేయడం ద్వారా నిజాలు బహిర్గతం అవుతాయని ఆయన అన్నారు. దీనిపై అఖిలేశ్ యాదవ్ పైవిధంగా ఎదురుదాడి చేశారు. తన సొంత పార్టీ నాయకులను, కార్యకర్తలను దాచిపెట్టి వారికి రక్షణ కల్పిస్తూ, ముఖ్యమంత్రి ఎదుటివారిపై దాడి చేస్తున్నారని విమర్శించారు.

## యువకుడి హత్య కేసులో ఇద్దరు మావోయిస్టులు అరెస్టు

**న్యూఢిల్లీ :** పోలీసు ఇన్ఫార్మర్ అనే అనుమానంతో మహారాష్ట్రకు చెందిన ఒక యువకుడిని హత్య చేసిన కేసులో ప్రమేయం ఉన్న ఇద్దరు మావోయిస్టులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అరెస్టు చేసింది. నిషేధిత సిపిఐ (మావోయిస్టు) ఉగ్రవాద సంస్థకు చెందిన ఈ ఇద్దరినీ తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు చెందిన రఘు అలియాస్ ప్రతాప్, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాకు చెందిన శంకర్ మహాకాగా గుర్తించినట్లు వారు తెలిపారు. పోలీస్ ఇన్ఫార్మర్ అని, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సభ్యుడని అనుమానంతో, బాధితుడైన దినేష్ పుసు గవాడేను నవంబర్ 2023లో గడ్చిరోలిలో సిపిఐ (మావోయిస్ట్) సభ్యులు కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేశారని ఎన్ఐఎ జారీ చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.అరెస్టు చేయడానికి ఎన్ఐఎ కృషి చేస్తోందని పేర్కొంది.




## రహస్య డ్రోన్ల మర్మం ఏమిటో?



అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికత ఒక్కోసారి సమస్యలకు, ఆందోళనలకు కారణమవుతున్నది. ఇటీవల పశ్చి మ యూరప్‌లోని కొన్ని దేశాల విమానాశ్రయాలు, ప్రధాన మౌలిక వసతుల ప్రాంతాలపై అనుమతిలేని రహస్య డ్రోన్లు కనిపించడం ఆందోళనకు కారణమైంది. ఈ డ్రోన్లు ఎవరు నడుపుతున్నారో, ఏ ఉద్దేశంతో పంపిస్తున్నా రో స్పష్టత లేకపోవడంతో భద్రతా సమస్యలు తీవ్రమయ్యాయి. ఇలాంటి డ్రోన్ల వల్ల విమానా లు లేదా ల్యాండింగ్ సమయంలో ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉంది. విమానాశ్రయా లు, విద్యుత్ కేంద్రాలు, సైనిక స్థావరాలపై డ్రోన్లు కనిపించడం వల్ల ఇవి గూఢచర్యం లేదా విధ్వంసక చర్యలపై అనుమానాలు పెరిగాయి. ప్రత్యక్ష యుద్ధం కాకుండా, టెక్నాలజీ, సైబర్, డ్రోన్ల ద్వారా దేశాలను అస్థిరం చేసే హైబ్రిడ్ యుద్ధ వ్యూహాలలో భాగమై ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. రాడార్, రేడియో ఫ్రీక్వెన్సీ సెన్సర్లు, ఎఐ ఆధారిత గుర్తింపు పద్ధతులు అమలుచేసే విషయంపై విస్తృత చర్చ మొదలైంది. డ్రోన్లను జామ్ చేయడం, నియంత్రణ స్వాధీనం చేసుకోవడం (టేక్‌ఓవర్), లేదా అవసరమైతే నిర్వీర్యం చేయడం వంటి పద్ధతుల దిశ గా వివిధ దేశాలు ఆలోచిస్తున్నాయి. కాగా, డ్రోన్ వినియోగంపై కఠిన నియమాలు, శిక్షలు అమలు చేయాలని యూరోప్ దేశాలు పరిశీలిస్తున్నాయి.



## మూఢ భక్తికి పరాకాష్ఠ



ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లా, వ్రిందావన్ (బ్రుందావనం) బిహారి గుడిలో జరిగిన ఒక వింత వైరల్ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఒక ఆలయంలో భక్తులు ఎయిర్‌కండిషనర్ నుంచి కారుతున్న నీటిని దేవుని చరణామృతంగా భావించి తాగిన దృశ్యాలు వీడియోగా బయటకు వచ్చాయి. ఆలయంలో అమర్చిన ఎసి నుంచి నీరు చుక్కలుగా కారడాన్ని చూసిన కొంత మంది భక్తులు ఆ నీటిని దేవుని పవిత్ర జలంగా భావించారు. తీర్థం మాదిరి తీసుకున్నారు. కొంతమంది టీ గ్లాసులతో నీటిని పట్టుకొని వెళ్లారు. మూఢ భక్తికి పరాకాష్టగా చాలా మంది ఈ ఘటనను విమర్శిస్తుంటే, కొంతమంది మాత్రం ఇది నిజమైన భక్తిని నిదర్శనమంటూ సమర్థించుకుంటున్నారు. ఏ విధంగా చూసినా ఇలాంటి ఘటనలు సమాజానికి ఏమాత్రం మంచిది కాదు. శాస్త్రీయ అవగాహన లేకపోతే, మూఢ విశ్వాసాలు పెరుగుతాయి. ఎసి నీరు శుభ్రమైనది కాదని, తాగితే ఆరోగ్యానికి హానికరమని అందరికీ తెలుసు. కానీ, గుడిలోని ఎసికీ, గదిలోని ఎసికి తేడా ఉంటుందని వాదించడం దారుణం. అంధ విశ్వాసాలు సమాజంలో ఎలా వ్యాపిస్తున్నాయనడానికి ఇదో నిదర్శనం. భక్తి, విజ్ఞాన అవగాహన మధ్య సమతుల్యత ఎంత ముఖ్యమో ఈ ఘటన గుర్తుచేస్తుంది. విశ్వాసం వ్యక్తిగత విషయం అయినప్పటికీ, ఆరోగ్యం, తర్కం కూడా సమానంగా అవసరమని స్పష్టం చేస్తున్నది.

## కశ్మీర్‌లో ప్రాచీన నాణెం



ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్రాచీన హూన్ నాణెం కశ్మీర్ ప్రాంతంలో లభించింది. ఇది క్రీస్తు శకం ఐదవ శతాబ్దం నాటి క్లిష్టమైన స్కైథియన్‌హూన్ సమాఖ్యకి సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ సమాఖ్య అనేది అనేక యావనిక గోత్రాల సంయోగ ఫలితం. మరో రకంగా చెప్పాలంటే, వివిధ రకాల జాతుల సమ్మేళనం. అందులో స్కైథియన్లు, హూన్లు, సార్మాటియన్లు, అలాన్లు వంటి గోత్రాలు ఒకే సైనిక శక్తిగా ఏకమయ్యాయి. వీరు మధ్య ఆసియా నుండి యూరప్ వరకు విస్తరించిన అత్యంత శక్తివంతమైన సంచార జాతుల సమూహాల్లో ఒకటిగా పేరుపొందారు. వారి సమాజ నిర్మాణం వంశపారంపర్య విధానంలో ఉండేది. యోధుల వర్గం అత్యంత ప్రధానమైది. ఈ వర్గానికి ఆధిపత్యం ఉండేది. వీరి నాయకత్వం కింద యుద్ధాలు, భూభాగ విస్తరణ లు, వాణిజ్య మార్పిడి వంటి కార్యక్రమాలు తరచుగా చోటుచేసుకునేవి. ఈ నాణెం వంటి పురావస్తువులు ఆ కాలంలో హూన్ సమాజం ఆర్థిక వ్యవస్థ శ్రేణులు ఎంత విస్తరించాయో చూపిస్తాయి. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వాణిజ్య సంబంధాలు నెలకొన్నాయి, ముఖ్యంగా భారత ఉపఖండం, మధ్య ఆసియా, చైనాతో హూన్ జాతుల ఆర్థిక పరస్పరాలు ఉన్నాయి. కశ్మీర్ ప్రాంతం ఆ కాలంలో వ్యూహాత్మకంగా ప్రాముఖ్యమైన కేంద్రంగా ఉండేది. ఇది ఇండోస్కైథియన్, కుశాణ రాజ్యాల ఆనవాళ్లు కలిగి ఉండటం వల్ల హూన్ ప్రభావం ఇక్కడ స్పష్టంగా కనిపించింది.

## విశ్వ నమూనాలకు సవాళ్లు!



కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ (సిఎంబి)ని ఖగోళ శాస్త్రవేత్తలు విశ్వానికి సంబంధించిన శిశువయసు ఫొటోగా అభివర్ణిస్తారు. ఇది బిగ్ బ్యాంగ్ తర్వాత సుమారు 3.8 లక్షల సంవత్సరాలకు విడుదలైన కాంతి అవశేషం. అయితే, ఈ సిఎంబిలో ఇటీవల గుర్తించిన కొన్ని అసాధారణ లక్షణాలు ప్రస్తుత ప్రమాణ విశ్వ మోడల్‌కు సవాలు విసురుతున్నాయి. డైపోల్ అసిమెట్రీ (విశ్వం ఒక దిశగా వంగినట్లు కనిపించడం), తక్కువ స్థాయి తరంగాల లోపం వంటి లక్షణాలను సిఎంబిలో శాస్త్రవేత్తలు గమనించారు. ఇవి యాదృచ్ఛికంగా ఏర్పడ్డవా? లేక విశ్వ నిర్మాణంలో దాగి ఉన్న లోతైన సంకేతాలా? అన్నది ఇప్పుడొక పెద్ద చర్చగా మారింది. ఇటీవలి పరిశోధనల ప్రకారం, ఈ అసాధారణతలు విశ్వం వల్ల కాకుండా, మన సౌర వ్యవస్థ కదలికలు, మన గెలాక్సీ ప్రయాణ దిశ లేదా మన స్థానిక ఖగోళ పరిసరాల వల్ల ఏర్పడిన కలుషిత ప్రభావం కావచ్చని సూచిస్తున్నాయి. విశేషమేమిటంటే, సిఎంబిలో కనిపించే కొన్ని సంకేతాలు మన సౌర వ్యవస్థ సమతలంతో లేదా మిల్కీవే గెలాక్సీ కదలిక దిశతో ఆశ్చర్యకరంగా సరిపోతున్నాయి. అయితే, ఈ అంశం శాస్త్రవేత్తలను రెండు వర్గాలుగా చీల్చింది. ఇవన్నీ యాదృచ్ఛిక సమాంతరాలు మాత్రమేనని ఒక వర్గం అంటోంది. ఇవి కొత్త భౌతిక శాస్త్రానికి సంకేతాలు కావచ్చని మరో వర్గం విశ్వసిస్తున్నది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# బంగ్లా, నేపాల్ ఎన్నికల క్షేత్రం

నూతన సంవత్సరం తొలి త్రైమాసికం (జనవరి – మార్చి) భారతదేశం తన ఇరుగుపొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలకోసం ఆసక్తితో ఎదురుచూడాల్సిన సందర్భం. వాటిని ఎంతోకొంత ప్రభావితం చేయగల సత్సంబంధాలను భారత్ కోల్పోయింది. రెండు దేశాల్లోనూ ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాలు అర్థాంతరంగా కూలిపోవటానికి ఆ ప్రభుత్వాల 'అవినీతి' పాలనపై యువతరం ఆకస్మిక తిరుగుబాటు, వీధిపోరాటం కారణం. రానున్న ఎన్నికల్లో ఆ యువత కొత్త రాజకీయ శక్తిగా అవతరించి తమ దేశాలకు కొత్తబాట వేస్తుందా? ప్రస్తుతానికైతే అది ఎండమావిగానే కనిపిస్తున్నది. రెండు దేశాల్లోను స్థిరపడిన సాంప్రదాయక పార్టీల మధ్య లేదా వాటి కూటముల మధ్య పోరాటానికే ఎన్నికల గోదా సిద్ధమవుతుంది. బంగ్లాదేశ్‌లో అయితే ప్రధాని షేక్ హసీనాను దేశం నుంచి తరిమి వేయటమేగాక ఆమె పార్టీ అవామీలీగ్‌ను ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధించారు. ఆమెకు భారత్ ఆశ్రయం ఇచ్చింది. ఆమెపై నేరారోపణలతో కోర్టు ఉరిశిక్ష సైతం విధించగా, ఆమెను అప్పగించాలనే డిమాండ్‌తో అక్కడ భారత్ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. భారత ప్రభుత్వానికి ఇది మరీ ఇబ్బందికర పరిస్థితి. ఎవరితో మాట్లాడాలో తెలియదు, ఏమి చేయాలో తోచదు. 1971లో పాకిస్థాన్ అణచివేతనుంచి తూర్పు పాకిస్థాన్ విముక్తి ఉద్యమానికీ, పర్యవసానంగా బంగ్లాదేశ్ ఆవిర్భావానికీ సైనికంగా తోడ్పడిన భారత్‌కు ఈ స్థితి ఎదురుకావటం కలలోనైనా ఊహించలేని పరిణామం. అందుకు అవామీలీగ్ అధినేత షేక్ హసీనా నిరంకుశ పాలనే ప్రధానం. అధికారంకోసం వేచిచూస్తూ అవకాశాన్ని వెతుక్కుంటున్న ప్రధాన ప్రతిపక్షపార్టీ బిఎన్‌పి అధినేత బేగం జియా, పాకిస్థాన్ అనుకూల ముస్లిం మతతత్వ సంస్థ జమాతే ఇస్లామీ గత జులైలో జన్–జడ్ ఉద్యమానికి దన్నుగా నిలిచాయి. 2024 ఆగస్టు 5న ప్రధాని షేక్ హసీనా వాజెద్ ప్రత్యేక విమానంలో భారత్ చేరి ఆశ్రయం పొందారు. గత 16 మాసాల్లో రాజకీయ పార్టీల స్థితిలో పెనుమార్పులు సంభవించి — ఫిబ్రవరి 12 ఎన్నికల అనంతర బంగ్లాదేశ్ భవిష్యత్ అనిశ్చితంగా కనిపిస్తున్నది. మహమ్మద్ యూనస్ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రజల్లో ఆశలు నింపలేకపోయింది. ప్రధాన ప్రతిపక్షనేత బేగం జియా తీవ్ర అనారోగ్యంతో విదేశాల్లో చికిత్స పొందుతున్నారు. జమాత్ రాజకీయ పార్టీగా కొంత బలం పుంజుకున్నా దాన్ని ప్రత్యామ్నాయంగా అంగీకరించటానికి ప్రజలు సిద్ధంగా లేరు. జులై ఉద్యమ విద్యార్థి గ్రూపుల నేతలు 9 నెలల క్రితం ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సిపి) స్థిరమైన ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించలేదు. ఆ ఉద్యమ ముఖ్య నాయకుల్లో ఒకరైన షరీఫ్ ఉస్మాన్ హది ఎన్నికల ప్రచార సభలో కాల్పులకు గురై సింగపూర్ ఆసుపత్రిలో గురువారం రాత్రి మరణించటంతో సరికొత్త సంక్షోభం తలెత్తింది. అల్లర్లకు దిగిన గుంపులు పత్రికా కార్యాలయాలపైన, హిందూ మైనారిటీలపైన దాడులకు పాల్పడి అరాచకం సృష్టిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ సాధ్యమా? జరిగితే ఏ శక్తులు అధికారంలోకి రాగలుగుతాయి, భారత్‌పై దాని పర్యవసానాలెలా ఉంటాయి — ఇవన్నీ వేచిచూడదగిన పరిణామాలు. ఏ ప్రభుత్వం వచ్చినా దానితో నేర్పుగా వ్యవహరించటమే ఢిల్లీ ముందున్న కర్తవ్యం — అయితే హసీనా భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్న.

ప్రజాపక్షం
21-12-2025, ఆదివారం

నేపాల్‌లో వచ్చే మార్చి 5న సార్వత్రి క ఎన్నికలు జరుగుతాయి. 20 ఏళ్ల క్రితం రాచరిక వ్యవస్థ అంతమై రిపబ్లిక్‌గా ఏర్పడిన నాటినుంచి మూడుముక్కలాటగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. కె.ఎస్.ఓలి నాయకత్వంలోని నేపాలీ కమ్యూనిస్టుపార్టీ (యూనిఫైడ్–మార్క్సిస్టు–లెనినిస్ట్), పుష్ప కుమార్ దహల్ అకా ప్రచండ నాయకత్వంలోని నేపాలీ కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు సెంటర్), నేపాలీ కాంగ్రెస్ పార్టీల్లో ఏ రెండు పార్టీలు కలిస్తే ఆ ప్రభుత్వం ఏర్పడి అర్థాంతరంగా కూలిపోతూ దేశం రాజకీయ అస్థిరతలో ఉంది. ఓలీ–ఎన్‌సిపి చివరి ప్రభుత్వం ఈ సంవత్సరం సెప్టెంబర్ రెండవ వారంలో జన్–జడ్ తరం రెండు రోజుల హింసాత్మక వీధి పోరాటంతో కూలిపోయింది. సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేసిన సుశీల కార్కి యువతరం తోడ్పాటుతో తాత్కాలిక ప్రధాని బాధ్యతలు చేబట్టారు. బంగ్లాదేశ్‌లో పార్లమెంటు ఎన్నికలతోపాటు నూతన రాజ్యాంగ రచనకు కమిషన్‌ను ఏర్పాటు చేయటంపై రెఫరెండం నిర్వహిస్తున్నట్లు నేపాల్‌లో కూడా అవినీతి తదితర కొన్ని ముఖ్య సమస్యలపై రెఫరెండం ఆలోచన చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు అరడజనుపైగా పాత ప్రధాన పార్టీలే కూడికలు– తీసివేతలతో ఎన్నికల క్షేత్రంలో ఉన్నాయి. జన్–జడ్ యువతరం పార్టీ ఏర్పడలేదు. యువకులు అనేక స్థానిక పార్టీలు రిజిస్టర్ చేసుకున్నారు. సెప్టెంబర్ తిరుగుబాటులో లేవనెత్తిన అంశాలు సాధించుకునేందుకు ఈ యువత పార్టీలన్నీ ఐక్యం అవుతాయా? ఈ అనిశ్చితిని జాగ్రత్తగా గమనిస్తూ చిరకాల హిమాలయన్ మిత్రదేశంతో సంబంధాలు నెరపటమే భారత్‌కు ప్రయోజనం.

# పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగి పడుతుందా?



ఎస్.బాబు
వర్కింగ్ కమిటీ సభ్యులు
ఎ.ఐ.టి.యు.సి

భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి 12–12–2025న ఆంధ్రజ్యోతి పత్రికలో "కార్మిక లోకానికి శాపం... ఈ కమ్యూనిస్టులు" అనే వ్యాసాన్ని వ్రాశారు. దాన్ని పూర్తిగా ఖండిస్తున్నాను. ఆయన కమ్యూనిస్టులను విమర్శించటం మానుకుని ప్రవచనాలు, పేదరాశి పెద్దమ్మ కథలు చెప్పుకుంటే మంచిదని నా అభిప్రాయం. భారతదేశంలో మొగల్ సామ్రాజ్యంపై నాదిర్ షా దండయాత్ర చేసి, నెమలి సింహాసనాన్ని, కోహినూర్ వజ్రాన్ని కొల్లగొట్టాడు. అలాగే నరేంద్ర మోదీ లేబర్ చట్టాలపై దాడిచేసి, వారికి నచ్చిన రీతిలో మార్పులు చేసి పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని హత్య చేశారు అనేది నిజం. కార్మిక లోకానికి కమ్యూనిస్టులు శాపం కాదు వరం. కార్మిక వర్గం శతాబ్దం పైగా ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి బ్రిటిష్ వారికి కార్మిక గుండె చప్పుడు వినిపించి రుధిర ధారలు చిందించి సంపాదించిన హక్కులు, సౌకర్యాలకు ఒక చరిత్ర ఉంది. చరిత్రను వక్రీకరించే బిజెపి నాయకులకు ఆ చరిత్ర పునాది అర్థం కాదు. అర్థం కావాలనే భ్రమలు కూడా నాకు లేవు. కార్మిక హక్కుల పోరాటాల చరిత్ర మొదలయినప్పుడు బిజెపి పిండోద్భవం కూడా జరగలేదు. కాబట్టి ఆ చరిత్ర వారికి తెలియదు. భాజపా జాతీయ కార్యదర్శి వ్రాసిన వ్యాసంలో కమ్యూనిస్టులు మరియు కమ్యూనిజంపై తమ అక్కసు వెళ్ళగక్కారు. ఆయన శాపనార్థాలేమంటే... 1. 70 ఏళ్ళు దాటినా కమ్యూనిస్టులు ఏమీ మారలేదు అన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ పుట్టి 100 సంవత్సరాలైన సందర్భంగా శత జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి అనే విషయం వారికి తెలియకపోవటం విచారకరం. 2. కొత్తగా వచ్చిన 4 లేబర్ కోడ్‌లు కార్మికులకు వ్యతిరేకం అని రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారు అని వ్రాసుకొచ్చారు. కొత్తగా వచ్చిన 4 లేబర్ కోడ్‌లలో ఏం ఉందో, వాటి వల్ల కార్మిక వర్గానికి ఏ నష్టం జరిగిందో తప్పక వివరిస్తాను. 3. కమ్యూనిస్టులు కార్మిక హక్కుల పోరాటం అంటారు. కాని పరిశ్రమల నాశనమే విధానంగా పని చేస్తున్నారు అన్నారు. 4. కమ్యూనిస్టులు కార్మికులను ఓటు బ్యాంకుగా చూస్తారు అన్నారు. ఎవరు ఎవరిని ఓటు బ్యాంకుగా చూస్తున్నారో దేశ ప్రజలు గమనిస్తున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు కమ్యూనిస్టు సిద్ధాంతం కాదు. అవి బిజెపి లాంటి బూర్జువా పార్టీలవి. చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం దగ్గర బిజెపి నాయకులు హిందువులు ఓట్లువేస్తే చాలు అని అనడం ఓటు బ్యాంకు రాజకీయం కిందికి రాదా? 5. వారికి పుట్టగతులుండవు. కార్మికులు, ప్రజలు వారికి అవకాశం ఇవ్వరు. సరైన సమయంలో బుద్ధి చెప్తారు అన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ అధికారం కోసం వెంపర్లాడే పార్టీ కాదు. కార్మికులు, ప్రజలు అవకాశం ఇవ్వరు అని శాపనార్థాలు పెట్టనవసరం లేదు. పిల్లి శాపనార్థాలు పెట్టినంత మాత్రాన ఉట్టి తెగిపడదు. సమయం చూసుకుని ప్రజలు బిజెపికు బుద్ధి చెప్తూనే ఉన్నారు. మొన్న జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. ఇప్పుడు తెలంగాణ లోకల్ బాడీ ఎలక్షన్స్ లో ప్రజలు బాగానే బుద్ధి చెప్పారు.

గతంలో కూడా ఇలాంటి శాపనార్థాలతో వి.వి.సుబ్రహ్మణ్యం అనే ఆయన ఈ పత్రికలోనే మార్క్సిజంపై విమర్శలు గుప్పించారు. ఇప్పుడీ బిజెపి జాతీయ కార్యదర్శి ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి కమ్యూనిజంపై అవాకులు, చవాకులు పేల్చారు. ఈ 4 కోడ్‌లలో ఏముందో కమ్యూనిస్టులకే స్పష్టత లేదు అన్నదానికి స్పష్టత ఇవ్వదలచాను. 44 చట్టాలను 4 లేబర్ కోడ్స్ గా మార్చి పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలను మళ్ళీ పెట్టుబడి దారులకు ఈ కోడ్‌ల ద్వారా తాకట్టు పెట్టటం వాస్తవం కాదా? వర్కింగ్ క్లాస్‌ని బలహీన పరిస్తే కమ్యూనిస్టుల శక్తి నశిస్తుందని బిజెపిఆలోచన. కమ్యూనిస్టుల అణచివేతే వారి ఏకైక లక్ష్యం. అందుకే ఆపరేషన్ కగార్. పెట్టుబడిదారీ వ్యవస్థను ఎప్పటికైనా కూలదోసేది కమ్యూనిస్టు సిద్ధాంతమే – అది మార్క్సిజం. ఇది చారిత్రక సత్యం. కార్మిక చట్టాలను కోడ్‌లుగా మార్చటం వలన పర్మినెంట్ ఉద్యోగులు ఉండరు. కాంట్రాక్ట్ లేబర్, క్యాజువల్ వర్కర్స్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుంటారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగాలుంటాయి. లే ఆఫ్, రిట్రెంచ్మెంట్, క్లోజర్‌లు ఉంటాయి. యాజమాన్యం హైర్ అండ్ ఫైర్ సిస్టమ్‌ని అమలు చేస్తుంది. ఒక ఉదాహరణ చెప్తాను. ఆర్టీసిలో 57 వేల మంది ఉద్యోగులుండే వారు. ప్రస్తుతం 39 వేలమంది మాత్రమే ఉన్నారు. రిటైర్‌మెంట్, రిమూవల్స్ తప్ప రిక్రూట్మెంట్ లేదు.

ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ అన్నారు. ఆ ఉద్యోగాలు ఏమయ్యాయో, ఈ 11 ఏళ్ళలో ఎంతమందికి ఇచ్చారో వారు చెప్తేనే బాగుంటుంది. బోనస్ 8.33 శాతం పెంచామని వ్యాసకర్త అన్నారు. ఇది గతంలో బోనస్ యాక్ట్ లో ఉన్నదే అనే విషయం బిజెపి జాతీయ కార్యదర్శి తెలుసుకుంటే మంచిది. కొత్త కోడ్‌లో అసలు బోనస్ సీలింగ్ ప్రస్తావనే లేదు. బోనస్ సీలింగ్ ఎత్తివేయాలని కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారు. అసలు ఆర్టీసి కార్మికులకు బోనస్ లేదనే విషయం ఆయనకు తెలియదు. లేబర్ కోడ్స్ పై కమ్యూనిస్టులకు స్పష్టత ఉంది. ఆ స్పష్టతకు కూడా ఒక లెక్కుంది. గతంలో ఉన్న కార్మిక చట్టాల్లో 100 మంది కార్మికులు పనిచేసే పరిశ్రమ మూసివేయాలంటే ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి కావాలి. కాని నరేంద్రమోదీ కొత్తగా మార్చి తెచ్చిన "ది ఇండస్ట్రియల్ కోడ్ 2020" సెక్షన్ 77 లో ఆ సంఖ్యను 300 కు పెంచారు. ఇది వర్కింగ్ క్లాస్ కి నష్టమని వారికి తెలియదా? దీన్నిబట్టి బిజెపి ప్రో క్యాపిటలిస్టిక్ క్యారెక్టర్ అని స్పష్టం అవుతోంది. ఇవి మోదీ తెస్తున్న లేబర్ రిఫార్మ్స్ కాదు. లేబర్ వినాశనం. 50 మంది పని చేసే పరిశ్రమను లే ఆఫ్ చేస్తే మారిన కోడ్ సెక్షన్ 65 ప్రకారం నష్టపరిహారం ఇవ్వాల్సిన పనిలేదు. గత చట్టంలో నష్ట పరిహారం ఇవ్వాలని ఉంది. మరి మారిన కోడ్ వలన కార్మికుడికి లాభమా? పెట్టుబడిదారీ వర్గానికి లాభమా?నష్టపరిహారం ఇవ్వకపోతే అంతకాలం సర్వీస్ చేసిన కార్మికుడి గతి ఏమిటి? అందుకే కమ్యూనిస్టుల పోరాటం. మార్చిన కోడ్ ప్రకారం కాంట్రాక్ట్ లేబర్‌కి లే ఆఫ్/క్లోజర్ సమయాల్లో నష్టపరిహార హక్కులు లేవు. చట్టాన్ని మార్చినప్పుడు ఎంతోకొంత సౌకర్యం కార్మికులకు ఉండాలి కదా? మరి ఈ కోడ్‌లో అది లేదు. పోరాటం చేయాలా వద్దా? అందుకే కమ్యూనిస్టులుంటారు. అధికారం కోసం అడ్డదారుల్లో, అవినీతి పద్ధతుల్లో అందలం ఎక్కడానికి కాదు, తెగించి కార్మికవర్గం తరపున పోరాడటానికి.

7 మంది ఉంటే ట్రేడ్ యూనియన్ పెట్టుకోవచ్చు. ఇది పాత చట్టం. మారిన కోడ్ ప్రకారం పరిశ్రమ సిబ్బందిలో 10 శాతం లేదా 100 మంది సిబ్బంది ఉంటేనే ట్రేడ్ యూనియన్ పెట్టాలి. దీన్ని అడ్డం పెట్టుకుని బిజెపి ప్రభుత్వం ట్రేడ్ యూనియన్లను ఖననం చేస్తోంది. మరి వ్యాసకర్త అయిన బిజెపి జాతీయ కార్యదర్శి దీన్నేమంటారు? కొత్తగా వచ్చిన ఈ కోడ్ కంటే 1926 లో బ్రిటిష్ పీరియడ్‌లో వచ్చిన ట్రేడ్ యూనియన్ యాక్ట్ బెటర్ అవునా, కాదా? పోనీ ఈ 100 మంది వర్కర్స్ ఉంటేనే ట్రేడ్ యూనియన్ పెట్టాలి అనే దానికి ఐ.ఎల్.ఓ అప్రూవల్ ఉందా? అది లేకుండా కోడ్ ఎలా అమలు అవుతుంది? తెల్లదొరలు నల్లవారికి కొంతైనా న్యాయం చేస్తే, నల్లవారు అధికారంలో ఉండి నేల నాకించేస్తున్నారు. అందుకే ఉద్యమాలకు ఊపిరులూదాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది కమ్యూనిజం ఉనికి కోసం కాదు. కార్మికులను రెచ్చగొట్టానికి అంతకన్నా కాదు. ఈ కొత్త కోడ్ ప్రకారం కార్మికుడు, యజమాని మధ్య వివాదం తలెత్తితే సెక్షన్ 97 ప్రకారం సివిల్ కోర్టుల్లో ఈ వివాదాలు వేయరాదు. బిజెపి నాయకుడేమో పారిశ్రామిక వివాదాలు ఈ కొత్త కోడ్ వల్ల సత్వరం పరిష్కారం అవుతాయంటున్నారు. ఇది కార్మికవర్గాన్ని మోసం చేయటం కాదా? ఇప్పటికే ట్రిబ్యునల్స్‌లో దశాబ్దాల కాలంగా కేసులు పరిష్కారానికి నోచుకోవటం లేదు. 2000లో వేసిన ఆర్టీసి ఎన్.ఎం.ఆర్ ల కేసుపై తీర్పు రావటానికి 25 సంవత్సరాలు పట్టింది అనేది వ్యాసకర్త తెలుసుకుంటే మంచిది.

పాత ఐడి యాక్ట్ 1947 సెక్షన్ 22 (ఎ) (బి) ప్రకారం కార్మికులు సమ్మె చేసుకోవచ్చు. బిజెపి ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ 2020 ప్రకారం సమ్మె పూర్తిగా నిషేధించబడింది. ఇది కార్మికుడి సమ్మె హక్కుని లాక్కోవటం కాదా? ఈ కోడ్ ద్వారా కార్మికవర్గాన్ని బిజెపి ప్రభుత్వం 8 దశాబ్దాలు వెనక్కి నెట్టింది. 4 గోడల మధ్య పిల్లిని బంధిస్తే అది తిరగబడి కళ్ళు పీకుతుంది. అది ప్రకృతి ధర్మం. ఆ ధర్మాన్నే కమ్యూనిజం ఆచరిస్తోంది. సమ్మె నిషేధం అన్నారంటే బిజెపి అనేది యాంటీ వర్కింగ్ క్లాస్ పార్టీ. పెట్టుబడిదారుల తాబేదారు అని స్పష్టం అవుతోంది. మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్ 26 వారాలకు కొత్త కోడ్‌లో పెంచామని వ్యాసకర్త వ్రాసుకొచ్చారు. కాని ఈ కొత్తగా వచ్చిన కోడ్ ప్రకారం ఈ బెనిఫిట్ యూనివర్సల్ కాలేదు. ఈ కోడ్‌లో ఎస్టాబ్లిష్మెంట్ అనే పదాన్ని చేర్చారు. ఈ పదంలో అసంఘటిత రంగ మహిళలను కలపలేదు. కాబట్టి అసంఘటిత రంగంలో ఉన్న మహిళలకు ఈ మెటర్నిటీ బెనిఫిట్ వర్తించదు. చరిత్రను వక్రీకరించటం బిజెపికు అలవాటు. అలాగే లేని హక్కుని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తూ మహిళల ఉసురు పోసుకోకూడదు. 90 శాతం అసంఘటిత రంగానికి పి.ఎఫ్ హామీ లభిస్తుందని బిజెపి నాయకుని ఉవాచ. కాని మైక్రో మరియు చిన్న ఎంటర్ ప్రైజెస్‌లో పని చేస్తున్న కొన్ని మిలియన్ల కార్మికులకు ఈ కొత్త కోడ్ వర్తించటం లేదు అనేది సత్యం. రాముణ్ణి మారీచుడు తప్పుదారి పట్టించినట్లు, కార్మికులను నమ్మించి మోసం చేస్తున్నారు బిజెపి నాయకులు.

అసంఘటితరంగంలో 90 శాతం మందికి మారిన కోడ్ ప్రకారం గ్రాట్యుటీలో మేలు జరుగుతుందని వ్యాస రచయిత చెప్పారు. కాని అది అమలులో లేదు. ఒక చిన్న షాపులో పనిచేస్తున్న కార్మికుడికి ఈ కొత్త కోడ్ ప్రకారం యజమాని గ్రాట్యుటీ ఇస్తున్నాడా? ఇది బిజెపి ప్రచార పటాటోపం తప్ప మరేమీ కాదు. కోవిడ్ 2019లో పనిచేసిన ఆశా మరియు అంగన్ వాడీ వర్కర్లకు గ్రాట్యుటీ లేదు. అంగన్ వాడీ వర్కర్లకు గ్రాట్యుటీ ఇవ్వాలని పోరాటం చేసి లక్షన్నర రూపాయలు సాధించింది ఈ కమ్యూనిస్టులే. గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు ఈ న్యూ కోడ్‌లో అమోఘమైన భద్రత లభిస్తుందని వ్యాసకర్త అభిప్రాయం. ఈ వర్కర్లు ఈ మధ్యకాలంలో ప్రాచుర్యం పొందారు. కాని కొత్త కోడ్‌లో వారికి నమ్మదగిన రక్షణ లేదు. వారి సోషల్ సెక్యూరిటీపై కూడా ఈ కోడ్ మూగనోము పట్టింది. కొత్త కోడ్ అమలైతే బేసిక్ పే, పి.ఎఫ్ పెరుగుతాయని వ్యాసంలో వ్రాశారు. టేక్ హోం పే తగ్గుతుంది, రిటైర్మెంట్ సేవింగ్స్ పెంచుతారు. ఇది ప్రస్తుతానికి చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. కాని కార్మికులు రిటైర్ అయినప్పుడు విలువలో సేవింగ్స్ మొత్తాలు చాలా చిన్నగా కనిపిస్తాయి. దీనివల్ల అయ్యో నేను మోసపోయానని కార్మికుడు నెత్తీ నోరు కొట్టుకుని లబోదిబోమంటాడు. వేజెస్ రీ స్ట్రక్చర్ కావటం వలన ప్రభుత్వానికి ఇన్ కం ట్యాక్స్ రూపంలో ఎర్నింగ్స్ పెరుగుతాయి. ఇది కార్మికుడికి నష్టం, ప్రభుత్వానికి లాభం. కమ్యూనిజం అంటేనే ఆర్థిక అసమానతలను తొలగించటం. మరి ఈ అన్యాయాన్ని కార్మికవర్గానికి చెప్పి చైతన్యపరచటమే కమ్యూనిజం. దీనివల్ల బిజెపి అభద్రతా భావానికి లోనైతే కమ్యూనిస్టులు చేయగలిగిందేమీ లేదు.

కొత్త కోడ్ ప్రకారం రోజుకి 8 గంటలు, వారానికి 48 గంటలు పని చేయాలని వ్యాస రచయిత అంటున్నారు. ఇది పాత ఎంటిడబ్ల్యు యాక్ట్‌లో ఉన్న విషయమే. కాని ఆర్టీసి కార్మికులు రోజుకు 16 గంటలు, వారానికి 96 గంటలు పనిచేస్తున్నారు. ఒక డ్రైవర్ రోజుకు 600 కిలోమీటర్ల డ్యూటీ చేస్తున్నాడు. మరి ఈ కొత్త కోడ్ ఎటుపోయింది? ఈ కోడ్‌లో చెప్పిన ప్రకారం డ్యూటీలు ఎటుపోయాయి? వీరి ఆరోగ్యంపై పడే ప్రతికూల ప్రభావాలు ప్రభుత్వం ఎందుకు గుర్తించదు? కమ్యూనిస్టులు పడికట్టు పదాలు వాడుతారని బిజెపి జాతీయ కార్యదర్శి అభిప్రాయం. కాని ఆ పడికట్టు పదాలతో వారికొచ్చే నష్టమేమిటో చెప్పలేదు. అలా అంటూనే వారు కూడా అలాంటి పదాలనే వాడుతున్నారు. మేకిన్ ఇండియా అంటారు, వికసిత భారత్ అంటారు, వన్ నేషన్ – వన్ ఎలక్షన్ అంటారు, స్వచ్ఛ భారత్ అంటారు, మన్ కీ బాత్ అంటూ వస్తుంటారు. ఎలక్షన్లు వస్తుంటే అధికారం నిలుపుకోవడం కోసం కార్గిల్ వార్ చేస్తారు, సర్జికల్ స్ట్రైక్స్ అంటారు. ఆపరేషన్ సింధూర్ అంటారు.

ఇప్పటికైనా బిజెపి జాతీయ కార్యదర్శి కమ్యూనిస్టులను విమర్శించటం మాని, చేతనైతే కొత్త కోడ్‌లలో మార్పులు చేయించి కార్మిక వర్గానికి న్యాయం చేయాలి. లేకపోతే అజ్ఞానాన్ని దాచుకోవటం ఉత్తమం.

# అసమానతలో అగ్రస్థానం భారతదేశానిదే!

అత్యంత సమానత్వం కలిగిన దేశాల్లో భారతదేశం నాల్గవ స్థానంలో ఉందని భారత ప్రభుత్వం ఐదు మాసాల క్రితం – 2025 జులైలో గొప్పలు చెప్పుకుంది. అయితే వాస్తవానికి దేశంలో అసమానత అత్యున్నత స్థానంలో ఉన్నట్లు ప్రపంచ అసమానత నివేదిక, 2026 కనుగొన్నది. అంతేగాక ఈ విషయంలో ఇటీవల సంవత్సరాల్లో ఏమాత్రం మెరుగుదల లేదని పేర్కొన్నది.

ప్రపంచ అసమానత నివేదిక, 2026ను ప్రపంచ అసమానత లాబ్ విడుదల చేసింది. అందులో ఇలా ఉంది: "ఆదాయార్జనపరుల్లో పైస్థాయిలోని 10శాతం మంది జాతీయాదాయంలో సుమారు 58 శాతం సొంతం చేసుకుంటుండగా, దిగువ 50 శాతం 15 శాతం మాత్రమే పొందుతున్నారు. సంపదలో అసమానత ఇంకా హెచ్చుగా ఉంది. అత్యంత ధనికులైన 10శాతం మంది చేతిలో మొత్తం సంపదలో 65 శాతం ఉండగా, పై స్థాయిలోని 1 శాతం మంది చేతిలో సుమారు 40 శాతం ఉంది. పై 10 శాతం, దిగువ 50 శాతం మధ్య ఆదాయ వ్యత్యాసం 2014–2024 మధ్య స్థిరంగా ఉంది. తలసరి వార్షికాదాయం సగటు సుమారు 6200 యూరోలు (పిపిపి),సగటు సంపద 28,000 యూరోలు (పిపిపి).శ్రామికశక్తిలో స్త్రీలు పాల్గొనటం చాలా తక్కువగా 15.7 శాతం వద్దే ఉంది. గత దశాబ్దంలో ఇందులో మార్పు లేదు. మొత్తంమీద భారతదేశంలో అసమానత ఆదాయం, సంపద, లింగ కోణాల్లో గాఢంగా పాదుకుని ఉంది. ఆర్థిక వ్యవస్థలోపల పట్టి ఉన్న నిర్మాణాత్మక విభజనను ఇది తెలియచేస్తున్నది."

గ్యాన్ పాథక్

భారత ప్రభుత్వం నుంచి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) జులైలో విడుదలచేసిన పత్రికా ప్రకటన, భారతదేశం ప్రపంచంలో అత్యంత సమానత్వం కలిగిన దేశాల్లో నాల్గవదిగా ఉందని చెప్పింది. దాన్ని అనేకమంది కేంద్రమంత్రులు, సోషల్ మీడియాపై బిజెపి నాయకులు నొక్కి వక్కాణించారు. అధికారిక పత్రికా ప్రకటన చెప్పినదేమంటే, "భారతదేశం 25.5 జినీ ఇండెక్స్(2022 డేటా ప్రకారం) కలిగి ఉంది. అది దేశాన్ని "ఒక మోస్తరు తక్కువ అసమానత" శ్రేణిలో ఉంచింది. ఇది మన దేశాన్ని అమెరికా(41.8), చైనా (35.7) వంటి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలకన్నా ముందు, ప్రపంచంలో అత్యంత సమానత్వం కలిగిన దేశాల్లో నాల్గవస్థానంలో ఉంచింది.

జినీ కోఎఫిషిఎంట్ అంచనా నిమిత్తం ఆదాయ డేటాను కాకుండా వినిమయ డేటాను ఉపయోగించి ప్రపంచబ్యాంక్ తయారు చేసిన వసంతకాలం, 2025 దారిద్ర్యం, సమానత అంచనా' ఆధారంగా ప్రభుత్వం తన ప్రకటన తయారు చేసింది. వినిమయం ప్రాతిపదికగా జినీ సూచీ చిత్రంగా అసమానతను ఆదాయం ప్రాతిపదికన్నా ఆకర్షణగా చూపుతుంది. ఇది వాస్తవానికి గణాంకాల జూదం.

భారతదేశం 80 కోట్లకుపైగా ప్రజలకు ఉచిత ఆహార ధాన్యాలు సరఫరా చేస్తున్నది. ఉచిత వైద్యం, విద్య, సబ్సిడీపై వస్తువులు, సేవలు అందిస్తున్నది. ఈ వాస్తవాలను గమనంలో ఉంచుకోవాలి. వాటిని కప్పిపుచ్చి వినిమయం ఎంతో మెరుగుపడిందని చూపటం డేటాను తారుమారు చేయటమే. అసమానతను కొలవటానికి తమ నివేదికలకు ప్రాతిపదిక అయిన వినిమయాన్ని ప్రమాణంగా తీసుకోవాలని ప్రభుత్వం ఐఎల్‌ఒ, ప్రపంచ బ్యాంక్‌లకు నచ్చజెప్పింది. అటువంటి వినిమయం ప్రాతిపదికపై ప్రపంచబ్యాంక్ భారత్‌కు ప్రపంచంలో అత్యంత సమానత్వం కలిగిన నాల్గవదేశం ర్యాంక్ ఇచ్చింది.

అయితే ప్రపంచ అసమానత ల్యాబ్ వినిమయం బదులు ఆదాయాన్ని అసమానత కొలతకు ప్రాతిపదికగా తీసుకుంది. అది సరైనది. ఉచిత ఆహారధాన్యాలు, మందులు, విద్య లేదా సబ్సిడీపై వస్తువులు పేదవాణ్ణి ధనికుణ్ణి చేయవు. వారి జీవితాన్ని కొంత మెరుగుపరుస్తుంది, అంతే. పేద–ధనికుల మధ్య అసమానత తొలగిపోదు. డేటా చూపుతున్నట్లు పేదలు మరింత పేదలవుతారు. సంపన్నులు మరింత కూడబెట్టుకుంటారు. అందువల్ల ప్రజలమధ్య అసమానత కొలవటానికి ఆదాయమే సరైన కొలమానం. మోదీ ప్రభుత్వం క్లెయిం "మేధోపరంగా నిజాయితీ లేనిది", "మోసపూరితమైంది" అని ప్రతిపక్షాల నుంచి, ఆర్థికవేత్తల నుంచి విమర్శలకు గురైంది. వినిమయానికి, ఆదాయానికీ చాలా విస్తృతమైన భిన్నత్వం ఉంటుంది. అటువంటి సర్వేల్లో సంపన్నుల స్థితి పూర్తిగా లెక్కలోకి రాదు. అందువల్ల వినిమయాన్ని ప్రాతిపదికగా తీసుకోవటం తప్పుత్రోవ పట్టిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఆ లెక్కలు తీసుకున్నప్పుడు, భారత్‌ను ఆదాయం ప్రాతిపదికపై కొలిచినట్లయితే ప్రపంచంలోని అసమానతలో 216 దేశాలకు గాను రమారమీ 176వ స్థానంలో ఉండేది.

1980లో ప్రపంచ సంపన్నులు అత్యధికంగా ఉత్తర అమెరికా, ఓసియానా, ఐరోపాల్లో కేంద్రీకృతమై ఉన్నారు. లాటిన్ అమెరికాలో కూడా అగ్రశ్రేణికి చేరువలో కొందరున్నారు. అయితే చైనా, భారత్‌లు ఆ విభజనలో అట్టడుగు సగభాగంలో ఉన్నాయి.ఆనాడు చైనాలో ప్రపంచ కుబేరులెవ రూ లేరు. కాగా భారత్, స్థూలంగా ఆసియా, సబ్–సహారన్ ఆఫ్రికాలో అతి తక్కువ శాతాల్లో వారు కేంద్రీకరించి ఉన్నారు.

2025 నాటికి ఈ దృశ్యం గణనీయంగా మారింది. చైనా పరిస్థితి ఎగబాకింది. దాని జనాభాలో ఎక్కువ భాగం మధ్యస్థాయి 40శాతంలోకి మారారు. ఎగువ మధ్యతరగతిలో చేరేవారి సంఖ్య పెరుగుతున్నది. ఇతర ఆసియాదేశాల్లో కూడా ఇది వాస్తవం. కాగా సాపేక్షికంగా భారత్ పరిస్థితి దిగజారింది. 1980లో దాని జనాభాలో పెద్ద భాగం మధ్యస్థాయి 40 శాతంలో ఉండగా, నేడు అట్టడుగు 50 శాతంలో ఉన్నారు. భారతదేశ మధ్యతరగతి తక్కువ స్థాయి ల్లో ఉండగా, చైనీయుల ఆదాయం హెచ్చుగా ఉంది.

డబ్ల్యుఐఆర్ నివేదిక 2026, డేటాను చారిత్రక కోణంలో ఉంచింది. అతి చిన్నదేశాలు – 1,00,000 లోపు జనాభా ఉన్నదేశాలు 1970 నుంచి తలసరి ఆదాయాలను ప్రపంచ సగటుకన్నా ఎక్కువగా నమోదు చేస్తున్నాయి. అవి సాపేక్షికంగా ఇంకా మెరుగుపడుతున్నాయి. 2024 నాటికి వాటి ఆదాయాలు ప్రపంచ సగటుకన్నా నాలుగురెట్లు హెచ్చుగా ఉన్నాయి. 50 కోట్ల మందికి పైగా జనాభా ఉన్న అతిపెద్ద దేశాలు – ఉదాహరణకు చైనా, భారత్‌లో ఆదాయాలు, అందుకు భిన్నంగా, ఎప్పుడూ ప్రపంచ సగటుకు తక్కువగా ఉంటున్నాయి.

ఫలితాలలోని భిన్నత్వం ఆయాదేశాల్లోని పరిస్థితులు, ప్రత్యేకతలకు అసమానతలకు గల అంతర్ సంబంధాన్ని ఎత్తిచూపుతున్నాయి. భారతదేశంలో కుల, మత అస్థిత్వాలు ఆదాయం, విద్య వ్యత్యాసాలను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి అని ఆ నివేదిక వక్కాణించింది. భారతదేశంలో అగ్రస్థాయిలోని 1 శాతం సగటు ఆదాయం 1,40,649 యూరోలు, కాగా వారి సగటు సంపద 11,28,435 యూరోలు. తద్భిన్నంగా క్రింది 50శాతం సగటు ఆదాయం 940 యూరోలు, సంపద 1801 యూరోలు. అసమానత అగాధం ఎంత పెద్దగా ఉందో విదితమవుతున్నది.

## ఉచిత చేప పిల్లల పంపిణీ



**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు మండల కేంద్రంలో 100/శాతం రాయితీపై మత్స్యశాఖ ద్వారా ఉచిత చేప పిల్లల పంపిణి కార్యక్రమం మండల కేంద్రంలో శనివారం జరిగింది. ఈసందర్భంగా గూడూరు మండల కేంద్రం 9గ్రామాల్లో పెద్ద చెరువులలో చేప పిల్లలను పంపిణి చేశారు. సుమారు ఐదు లక్షల 64వేల చేప పిల్లలను పంపిణి చేశారు ఈకార్యక్రమంలో గూడూరు ఎంపిడివో సత్యనారాయణ వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ సర్పంచ్ పూర్ణంచర్, శ్రీనువాస్ గ్రామస్తులు పాల్గోన్నారు.

## జనవరిలో రోడ్డు భద్రతా మాసోత్సవం

**ప్రజాపక్షం/జనగామ :** జనవరిలో జరిగే రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం రోడ్డు భద్రత పోస్టర్స్‌ను ఆవిష్కరించ రవాణా శాఖ అధికారులు, ఆర్‌టిసి, పోలీస్, ట్రాఫిక్ , విద్యాశాఖ, వేల్పేర్ శాఖ అధికారులలో సమీక్షించారు. రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు, డ్రైవర్లకు అవగాహన నిర్వయించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించి మరణాల రేటు తగ్గే విధంగా చూడాలన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. గత సంవత్సరం తెలంగాణలో 25వేల 934 రోడ్డు ప్రమాదాలు జరగగా 7వేల 949 మరణాలు జరిగాయన్నారు. రోడ్డు నిబంధనలు ఉల్లంగించడం, రాష్ డ్రైవింగ్, డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ఇవి జరిగాయన్నారు. ఈ నెలాకరులోపు సమావేశాలు నిర్వయించాలని, అర్‌అండ్‌బి అధికారులు కన్వీనర్‌గా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, ఆర్‌టిసి, రవాణా, ఆర్‌అండ్‌బి పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మొబైల్ యాప్ ద్వారానే యూరియా బుకింగ్



**ప్రజాపక్షం/తొర్రూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటకు కావాల్సిన యూరియా బస్తాలు తీసుకోవాలంటే తప్పనిసరిగా యూరియా బుకింగ్ ఆఫ్‌లో బుకింగ్ చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.భరత్‌చంద్ర అన్నారు. శనివారం మండలంలోని అమ్మాపురం గ్రామంలోని రైతు వేదికలో రైతులకు యూరియా బుకింగ్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌చంద్ర మాట్లాడుతూ రైతులు మొదట ఫోన్ నెంబర్‌తో ఓటీపీ ద్వారా ఆప్‌లో లాగిన్ కావాలని, లాగిన్ అయిన తరువాత తమ భూమి వివరాలు, పంటల వివరాలు(ఏ పంట, ఎన్ని ఎకరాలు విస్తీర్ణం) నమోదు చేయాలని, పంట వివరాలు (ఏ పంట, ఎన్ని ఎకరాలు) ఆధారంగా నిర్ణీత బస్తాల యూరియా సంఖ్యను యాప్‌లో ముందుగా బుక్ చేసుకోవాలన్నారు. యాప్‌లో జిల్లాలోని అన్ని ఫెర్టిలైజర్ షాపుల్లో అందుబాటులో ఉన్న యూరియా బస్తాల సంఖ్య రైతుకు చూపిస్తుందని చెప్పారు. రైతులు జిల్లాలోని తనకు అందుబాటులో ఉన్న ఏ షాపులోనైనా యూరియా బస్తాలు బుక్ చేసుకోవచ్చన్నారు. పై విధంగా యాప్‌లో బుక్ చేసుకున్న రైతులు మాత్రమే డీలర్లు లేదా సొసైటీల వద్ద యూరియా బస్తాలు తీసుకునే వీలుంటుందన్నారు. యాప్‌లో బుకింగ్ చేసుకున్న రైతులు 24గంటల సమయంలో బస్తాలు తీసుకోవాలని లేనిచో మరల బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.యాప్ వినియోగంలో, యూరియా బస్తాల బుకింగ్‌లో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే టో ల్‌ఫ్రీ నెంబర్ 18005995779కి కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మాపురం, జీకె తండా, ఖానాపురం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** రహదారి ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో పోలీస్, రవాణా, ఆర్టీసీ, వైద్య, విద్యా, సంక్షేమ శాఖలు, ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, మున్సిపల్, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన రహదారి భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రహదారి ప్రమాదాలపై సమీక్ష నిర్వహించి, ప్రమాదాలకు కారణాలు గుర్తించి వాటి నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్లను గుర్తించి అవసరమైన ఇంజినీరింగ్ మార్పులు చేపట్టాలని, వేగ నియంత్రణ, హెల్మెట్ మరియు సీటు బెల్ట్ వినియోగాన్ని కఠినంగా అమలు చేయాలని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎఎస్పీ నరేష్ కుమార్, ఆర్టిఓ సంధాని, ఆర్టీసీ డిఎం ఇందు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, జిల్లా వైద్యాధికారి డా॥ మధుసూదన్, డీఈఓ రాజేందర్, జాతీయ రహదారుల డీఈ కిరణ్, ఐఆర్డీ డిఆర్ఎం లక్ష్మణ్, అన్ని శాఖ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతిక విజ్ఞాన అభివృద్ధిలో ములుగు జిల్లా ముందుండాలి

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లాలోని ప్రతి పాఠశాలలో కూడా ఉపాధ్యాయులు రెండు రోజులు పాటు జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి పాఠశాలను ఒక విజ్ఞాన ప రదర్శన కేంద్రంగా తీర్చిదిద్దాలని ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థరెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్స్పైర్ మనకు ప్రదర్శన కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు ప్రదర్శించబడిన 278 ప్రాజెక్టులను తిలకించి విజ్ఞానాన్ని పొందిన విద్యార్థులు ఇంకా మెరుగైన ప్రదర్శనను తీర్చిదిద్ది ప్రతి పాఠశాలను శాస్త్రవేత్తల కేంద్రంగా తయారు చేయాలని విద్యార్థులందరూ భారతీయ విజ్ఞాన భాండాగారాన్ని అవగాహన చేసుకొని శాస్త్రవేత్తల ఆవిష్కరణలను పూర్తిగా అధ్యయనం చేసి భారతదేశ శాస్త్ర సాంకేతిక విజ్ఞాన అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ట్రైబల్ వెల్ఫేర్ కేటగిరిలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 21 మంది విజేతలు, ఒక్క రోజు సైన్స్ సెమినార్ కార్యక్రమంలో విజేతగా నిలిచినవారు 2026, జనవరి 7వ తేదీన కామారెడ్డి జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనడానికి వెళ్తారని చెప్పారు.

## టిఎలు, సరెండర్ డబ్బులురాక పోలీసుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నిత్యం ప్రజాసేవ చేసే పోలీసులకు ఆదరణ కరువైంది. 24 గంటలూ కష్ట, నష్టాలకు ఓర్చి బందోబస్తు నిర్వహిస్తూ నిత్యం ప్రజా రక్షణకు పాటు పడుతున్న పోలీసులపై పట్టింపు లేకుండా పోయింది. తమ కుటుంబాలను వదిలి అహర్నిశలు ఆపదలలో, విపత్తులలో, ప్రజా రక్షణలో అనునిత్యం కష్టపడే పోలీసులను ఆదుకునే వారు లేకుండా పోయారు. కొంత కాలంగా పోలీసులకు డ్యూటీలో రావాల్సిన డబ్బులు రాక నానా అవస్థలు పడుతున్నారు. పోలీసులకు రావాల్సిన టీఏలు,సరెండర్ లీవ్స్ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారు. గత ఆరు నెలలుగా వారికి రావాల్సిన సరెండర్స్ రావడం లేదని పోలీసులు వాపోతున్నారు. అలాగే ఇప్పటి వరకు 30 టీఏ లు, 6 సరెండర్ లు రాలేదని,టీఎస్ జీఎల్ఐ రాలేదని చెబుతున్నారు.పైగా అవి రాక పోగా ఐటీ కట్ అవుతున్నదని వారు తెలిపారు.డబ్బులు రాకుండా ఐటీ ఎలా కట్ అవుతుందని, ఈ డబ్బులు ఎవరి వద్ద ఉన్నాయని వారు ప్రశ్నిస్తున్నారు. గడిచిన 2 సంవత్సరాల నుండి దరఖాస్తులు పెట్టుకున్నా కనికరించడం లేదని పలువురు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పోలీసులు వాపోయారు. 24 గంటలు కష్టపడే తమకు ఆ మేరకు తమకు రావాల్సిన బెనిఫిట్ లు అందడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధి కారులు, ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఐనవోలు జాతరలో పటిష్టమైన ఏర్పాట్లు




### జాతరను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో సాగాలి
### మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హనుమకొండ:** ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో ఈ నెల 13వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఐనవోలు జాతర ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్,ఆలయ కమిటీ ప్రతినిధులతో కలసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, కుడా, మున్సిపల్, మిషన్ భగీరథ, ఇతర అధికారులతో ఆయా శాఖల ఆధ్వర్యంలో వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, భద్రత వంటి జాతరలో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు లు సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఐనవోలు జాతర నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించాలన్నారు. బస్టాండ్ ఏర్పాటు చేసే చోట భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ కూడా భక్తుల కోసం తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. జాతరలో పారిశుధ్య నిర్వహణ ఎంతో ముఖ్యమని పంచాయతీ అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతరలో ఇరవై నాలుగు గంటలు విద్యుత్ అంతరాయం లేకుండా ఏ చిన్న సమస్య లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. జాతరకు చిన్నపిల్లల కొరకు అంగన్వాడీ కేంద్రాలలో అందించే బాలామృతం పౌష్టికాహారాన్ని ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల ఆరోగ్య సంరక్షణ కు జాతర ప్రాంగణంలో వైద్య సదుపాయాలు కల్పించాలని అన్నారు. జాతర లో 108 వాహనాలు అందుబాటులో ఉంచాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలు అవగాహన కల్పించేలా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రులు కూడా స్వచ్ఛందంగా వైద్య సేవలు అందించే విధంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జాతరలో మెరుగైన సౌకర్యాలను వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. సమీక్షా సమావేశం అనంతరం జాతర ఉత్సవాల పోస్టర్లను మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, కలెక్టర్ స్నేహ శబరీష్, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అంకిత్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, రాథోడ్ రమేష్, ప్రభాకర్ గౌడ్, కార్యనిర్వాహణాధికారి సుధాకర్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికే సైన్స్ ఫెయిర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్‌లు దోహదపడతాయని పరకాల శాశనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్ నాగరాజు అన్నారు. పాఠశాల విద్యాశాఖ హనుమకొండ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన శనివారం హనుమకొండ సెయింట్ పీటర్స్ ఎడ్యూ స్కూల్ ఆవరణలో వైభవంగా ముగిసింది.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి.గిరి రాజ్ గౌడ్ సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఇరువురు ఎమ్మెల్యేలు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సైన్స్ ద్వారా రుగ్మతలను, మూఢనమ్మకాలను పారద్రోలాలని కోరారు. సాంకేతిక పరికరాలు అనేకం అందుబాటులోకి రావడంతో విద్యార్థులలో ఆలోచన శక్తి తగ్గి వాటి మీదనే ఆధారపడటం ఎక్కువైందన్నారు. ప్రకృతిని నాశనం చేస్తుండడం వల్లే అనేక రకాలైన అనర్థాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, బద్దం సుదర్శన్ రెడ్డి, రామ్ ధన్, సదానందం గౌడ్ , నారాయణరెడ్డి, హరిత, సతీష్, నెహ్రూ నాయక్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

## సేవచేసి ప్రజల మన్ననలు పొందండి

**ప్రజాపక్షం/గూడూరు:** గ్రామానికి సేవ చేసి ప్రజల మున్ననలు పొందాలని నూతన సర్పంచ్‌లకు మానుకొట ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ సూచించారు. శనివారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్లో జరిగిరిన గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నూతన సర్పంచ్‌లు ఉపసర్పంచ్‌ల అభినందన సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళినాయక్ మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో త్రాగునీరు సైడుకాలువలు పరిశుభ్రత వీధీలైట్లు ప్రతిరోజు సర్పంచ్‌లు పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాదవపెద్ది ప్రదీప్‌రెడ్డి చిట్టె వెంకన్న ఎడ్ల నరేష్‌రెడ్డి శ్రీపాల్‌రెడ్డి కోమ్మాల్‌నాయక్ లింగాల యాదవరెడ్డి చంటి స్వామి సంపత్ శంకర్ మండల నూతన సర్పంచ్‌లు ఉపసర్పంచ్‌లు తదితరులు పాల్గోన్నారు.

## అజంజాహీ మిల్లులు కాపాడేందుకు పభుత్వం యత్నం

### మీనాక్షి నటరాజన్, మంత్రి పొంగులేటిని కలిసిన అజాంజాహీ మిల్లు కార్మికులు




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** అజంజాహి మిల్లులను కాపాడడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నంగా భాగంగా వరంగల్ ప్రాంతాలకు చెందిన మిల్లు కార్మికులు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొరవి పరమేశ్వర్ ఆధ్వర్యంలో అజంజామి మిల్లు కార్మికులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు వారి యొక్క సమస్యలు తెలియపరుస్తూ 318 మంది కార్మికుల స్థలం విషయం గురించి వారికి విన్నవించారు. మీనాక్షి నటరాజన్ కార్మికుల విషయంపై సానుకూలంగా స్పందించి నేను సిఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని కార్మికులు అన్నారు. అదేవిధంగా వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కూడా కలవమని నటరాజన్ కార్మికులకు సలహా ఇచ్చారు. ఇందులో భాగంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని అజాంజాహి మిల్లు కార్మికులు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మెమోరాండం అందించారు. మంత్రితో మాట్లాడుతూ కార్మికుల యొక్క భవనం గురించి వివరించడం జరిగిందని, కార్మికులకు ఆ స్థలంలో భవనం కట్టించే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంత్రి నా దృష్టిలో ఉన్నదని, సిఎం, మంత్రి వర్గంతో మాట్లాడదామని న్యాయం జరిగేలా సహాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, కొమ్ముల సందీప్ కుమార్, సింగిరెడ్డి యశోద, గుత్తికొండ రవి, గద్దల శ్యామ్, సిరిమల్లె మార్కండేయ, ఆరెల్లి బిక్షపతి, కొమ్ముల కృష్ణ, తదితరులు ఉన్నారు. రాజకీయ నాయకులు దాని పునరుజ్జీవనం కోసం ఆందోళన చేశారు. వారి రాజకీయ కెరీర్లను ముందుకు తీసుకెళ్ళారు.

## సర్పంచ్‌లు, గ్రామస్తులు సమన్వయంతో అభివృద్ధి



**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** నూతన సర్పంచ్‌లు గ్రామస్తులందరు సమన్వయంతో అభివృద్ధి పనులు చేసుకోవాలని మంత్రి సీతక్క సూచన. మండలంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందగా మండలంలోని నూతన సర్పంచ్‌లను, ఉప సర్పంచ్‌లను, వార్డు సభ్యులను ఏటూరునాగారం మండల కేంద్రంలోని బిఆర్ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో భాగంగానే కన్నాయిగూడెం మండలం ఐలాపురం గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా గెలుపొందిన సర్పంచ్ పిరిల సురేష్,ఉప సర్పంచ్ రేగా వంశీ, వార్డు సభ్యులు గుమ్మడి రమాదేవి, ధరం సోత గౌషి, మల్లెల నర్సింహులను శాలువాలతో సన్మానించిన సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టిన గ్రామస్తులందరిని కలుపుకొని సమన్వయంతో కలిసి గ్రామాభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, కన్నాయిగూడెం మండల పార్టీ అధ్యక్షుడు ఎండి అప్సర్ పాషా, మండల నాయకులు, ఆయా గ్రామాల పార్టీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మానేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.203 కోట్లు మంజూరు




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** మానేరుపై బ్రిడ్జి అరెంద మీదుగా దామెర కుంట నిర్మాణానికి 203 కోట్ల నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కు పెద్దపల్లి జిల్లా, మంథని మండల, జయశంకర్ భూపాల పల్లి జిల్లా ప్రజలు, అరెంద, మల్లారం, వెంకటాపూర్, దామరకుంట గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి శ్రీధర్ బాబుకు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. మంథని మండలం మానేరు పై ఆరెంద మీదుగా దామెరకుంట వరకు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆరెంద, మల్లారం, వెంకటాపూర్ నుండి బ్రిడ్జి వరకు అటు సైడు దామరకుంట రోడ్డు వరకు 9.530 మీటర్ల అప్రోచ్ రోడ్డుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖ నుండి 203 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంథని మండలములోని ఆరెంద మీదుగా దామెర కుంట వరకు 1.120 మీటర్ల పొడవు 13 మీటర్ల వెడల్పుతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆరెంద, మల్లారం, వెంకటాపూర్ నుండి బ్రిడ్జి వరకు అటు సైడు దామేరకుంట రోడ్డు వరకు రోడ్డుకు 203 కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖ నుండి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు శనివారం మంజూరు కావడం జరిగిందని అన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వలన మంథని, పెద్దపల్లి జిల్లా వారికి కాళేశ్వరం వెళ్ళడానికి 25 కిలోమీటర్ల వరకు దూరం తగ్గుతుందని, కాళేశ్వరం టూరిజం డెవలప్మెంట్ కూడా పెరుగుతుందని, మహారాష్ట్ర ఇతర ప్రదేశాలకు వెళ్లడానికి చాలా వీలు ఉంటుందని, జయశంకర్ భూపాలపల్లి కాటారం వెళ్లడానికి వీలు ఉంటుందని, ఆరెంద, మల్లారం, వెంకటాపూర్, దామేర కుంట ఈ గ్రామాలలో ప్రజలకు రవాణా పరంగా వైద్య, విద్య పరంగా చాలా ఉపయోగపడుతుంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం ఉంటుందని తెలిపారు.

## నేటి తరానికి ఆదర్శప్రాయుడు పల్లె వీరయ్య

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు నేదునూరి రాజమౌళి

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** సమాజంలో దోపిడి, వివక్షత, అసమానతలు నివారించబడి సమ సమాజం ఏర్పడాలని కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న పోరాటాలకు ఆకృషితుడై హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో పార్టీ పిలుపులో భాగంగా అనేక పోరాటాలలో పాల్గొన్న త్యాగశీలుడు పల్లె వీరన్న అని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సమితి కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి తెలిపారు. శనివారం జయగిరి గ్రామంలో అమరత్వం పొందిన పల్లె వీరయ్య భౌతిక దేహానికి ఎర్రగుడ్డ కప్పి పూలమాలవేసి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి తో కలిసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వీరయ్య మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ వీరయ్య 1984లో కమ్యూనిస్టుగా మారి పేద ప్రజల హక్కుల కొరకు, గీతా కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు తన వంతు కృషిచేసిన త్యాగశీలుడని పేర్కొన్నారు. బలహీన వర్గాలకి బహుజనులకి దళితులకి అసైన్డ్ భూములు పట్టాలు ఇవ్వాలని, కూలీ రేట్లు పెంచాలని, భూమి పంచాలని జరిగిన పోరాటాలలో ముందు వరుసలో నిలిచిన ధైర్యశాలి పల్లె వీరన్న నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జయగిరి గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, పల్లె కుమార స్వామి, గడ్డం చంద్రమౌళి, తాళ్లపల్లి సాగర్, కొత్త కొండ వెంకటేశ్వర్లు, సాంబరాజు, పోతుల రాజు, వీరయ్య కుమారులు పల్లె వేణు, పల్లె దయాకర్, కోడలు శ్రీదేవి, వసంత బంధుమిత్రులు గ్రామ ప్రజలు అంతిమయాత్రలో పాల్గొన్నారు.



## 26న సిపిఐ ఆవిర్భావ దినోత్సవం



**కేసముద్రం/ప్రజాపక్షం:** డిసెంబర్ 26న జరిగే సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్, మండల నాయకులు మంద భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో గుండెల కొమురయ్య అధ్యక్షతన నిర్వహించిన గ్రామ శాఖ సమావేశానికి హాజరైన చొప్పరి శేఖర్, మంద భాస్కర్‌లు మాట్లాడుతూ 26 డిసెంబర్ 1925 సంవత్సరంలో కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించిందన్నారు. రవి అస్తమించని బ్రిటీష్ చెర నుండి దేశాన్ని విముక్తి చేసి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం సిపిఐ పోరాడిందన్నారు. స్వాతంత్ర్యంతో పాటు కార్మికులకు, రైతులకు చట్టాల కోసం అనేక పోరాటాలు సిపిఐ చేసిందన్నారు. తెలంగాణ ప్రాంతంలో నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం, దేశంలో అందరికీ విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని, బ్యాంకుల జాతీయం చేయాలని, 18 సం॥లు నిండిన వారికి ఓటు హక్కు కల్పన లాంటి వాటి కోసం సిపిఐ ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. వందేళ్ల సుధీర్ఘ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో డిసెంబర్ 26న జరిగే భారీ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పూజారి రవి, చొప్పరి వెంకటయ్య, దాసరి సాయిలు, మంగి సురేష్, దాసరి యాకయ్య, శ్రీను, చొప్పరి దేవేందర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం వాయిదా

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ సర్వ సభ్య సమావేశం 23–12–2025 (మంగళవారం) న నిర్వహించవలసి ఉండగా, సంస్థ అధ్యక్షులైన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశాన్ని వాయిదా వేసినట్లు పాలకమండలి సభ్యులు తెలిపారు. సవరించిన తేదీ ప్రకారం, సర్వ సభ్య సమావేశం 30–12–2025 (మంగళవారం) ఉదయం 10:00 గంటలకు, సమీకృత కార్యాలయ భవనం (కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్), సుబేదారిలో నిర్వహించబడుతుందని తెలిపారు. అందువల్ల, సభ్యులందరూ ఈ ప్రకటనను ఆహ్వానంగా పరిగణించి, నిర్ణీత తేదీ, సమయానికి తప్పక హాజరుకావలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# యాప్ ద్వారా యూరియా కొనుగోళ్లు సులభతరం

### అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యాప్ ద్వారా యూరియా కొనుగోలు విక్రయం సులభతరం అవుతుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో మొబైల్ ఫెర్టిలైజర్ యాప్ పై రైతులకు, ఎరువుల డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. యూరియా లభ్యతపై రైతులకు ఎటువంటి అనుమానాలు అపోహలు అవసరం లేదని ప్రతి రైతుకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందన్నారు. పాసుపుస్తకంతో లింక్ చేసిన ఫోన్ నెంబర్‌తో లాగిన్ కావాలన్నారు. ఫోన్ నెంబర్ లాగిన్ కానీ పక్షంలో ఏఈవోలను సంప్రదించాలన్నారు. బుక్ చేసిన తర్వాత బస్తాల వివరాలు, ఓటిపి తెలిపి షాపుల నుంచి యూరియా సరఫరా చేస్తారని తెలిపారు.

# ముక్కోటి ఉత్సవాలకు మంత్రి తుమ్మలకు ఆహ్వానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కార్యనిర్వహక అధికారి దామోదర్ ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఈవో దామోదర్ మర్యాద పూర్వకంగా కలిసి ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ముక్కోటి ఏకాదశి వంటి మహోత్తర ఆధ్యాత్మిక పర్వదినాలు ప్రజల్లో భక్తి, శ్రద్ధ, ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. ఆలయంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాలు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఘనంగా నిర్వహించాలని దేవస్థాన అధికారులకు సూచించారు.

# గిరిప్రసాద్ భవన్ పునర్ నిర్మాణ పనుల పరిశీలన

### కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ శత వసంత సంబురాలు ఖమ్మంలో జరగనున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో చేపట్టిన పునర్ నిర్మాణ పనులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులకు నిర్మాణ పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మధిర మండలంలోని పలువురికి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకటరమణగుప్త చేతుల మీదుగా పంపిణీ చేయటం జరిగింది. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ బాణావత్ వెంకటరమణనాయక్, మండల బిసిసెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చి రామయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాణావత్ వెంకటరరమణనాయక్, రామారావు, షేక్.జహంగీర్, బిట్రా ఉద్దండయ్యా, ఓబులు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని భరత్ విద్యానికేతన్‌లో శనివారం ఘనంగా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భరత్ విద్యానికేతన్ కరస్పాండెంట్ విద్యాలత అమ్మ చేతి వంట ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా స్ట్రీట్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలను, ఆరోగ్య సమస్యలను ఇంటి భోజనం గొప్పతనాన్ని వివరించారు. ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భరత్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఉమా, డీన్ రవీందర్‌రెడ్డి, ప్రైమరీ ఇన్‌చార్జి బెల్లంకొండ స్రవంతి, ఉపాధ్యాయులు ధనుషా, ప్రశాంతి, పూజిత, స్వాతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం

### సిపిఐ నేతలను కలిసిన గాదెపాడు సర్పంచ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. శనివారం కామేపల్లి మండలం గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్, వార్డు సభ్యులు సిపిఐ కార్యాలయంలో సిపిఐ నేతలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సర్పంచ్‌ను, వార్డు సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రజల ఆశలకు అనుగుణంగా పనిచేయాలని, సంక్షేమ పథకాలు పేదల దరిచేరేలా చూడాలని కోరారు. వార్డు సభ్యులు ముక్కంటి విజయ, బానోత్ వీరమ్మ, నానబాల శ్రీను, నానబాల మల్లయ్య, అస్లాం, ఎస్‌కె జైన్, వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ పాల్గొన్నారు.

# ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్ పొంది ఉన్న మైనార్టీ విద్యార్థులు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్సిలు) సిఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కొరకు ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను 2026 జనవరి 31లోగా సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమద్ ముజాహీద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మైనార్టీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం క్రింద స్కాలర్‌షిప్ ఆర్థిక సహాయం కోసం విదేశాలలో పోస్టు గ్రాడ్యుయేట్ చేయుటకు ఇంజనీరింగ్ డిగ్రీలో 60 శాతం, డాక్టరేట్ చేయుటకు పిజిలో 60 శాతం మార్కులు వచ్చి ఉండాలన్నారు. 2025 జులై ఒకటి నుంచి 2025 డిసెంబర్ 31 వరకు అమెరికా, కెనడ, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్, న్యూజిలాండ్, సౌత్ కోరియా లోని విశ్వ విద్యాలయాల్లో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు ఆర్థిక సాయం కోరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుల కుటుంబ సంవత్సర ఆదాయం రూ. 5లక్షల లోపు ఉండాలన్నారు. www.telanganaepass. cgg.gov.in లో దరఖాస్తు చేసుకుని ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తును 2026 జనవరి 31 లోపు సంబంధిత ధృవీకరణ పత్రాలు జత చేసి కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం పిఆర్‌సి ప్రకటించాలి

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్‌సి ప్రకటించాలని టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు అన్నారు. శనివారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో విలేకరులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పిఆర్‌సి గడువు పూర్తి అయి చాలా కాలం గడిచినా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, పెరుగుతున్న ధరల సూచిక, గృహ వ్యయాలు విద్యాఖర్చులు ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవనాన్ని కుదిపేస్తున్నాయని తెలిపారు. వేతనాలు పెరగకపోవడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులు అప్పుల బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాజ్యాంగ ఆర్టికల్ 21 ప్రకారం గౌరవ ప్రదమైన జీవనం ప్రతి ఉద్యోగికి హక్కు, విద్యాసంస్కరణలు, నూతన విధానాలు ఉపాధ్యాయులపై భారం పెంచుతాన్నాయి కానీ వేతనాల్లో మార్పు లేదన్నారు.

# త్వరితగతిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పూర్తి

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిర్మాణం పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 16వ డివిజన్‌లో నిర్మాణం పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్ రూం ఇండ్లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. అక్కడి పరిస్థితులను, నిర్మాణ పనుల పురోగతిని, ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలన సమస్యలను సంబంధిత అధికారుల నుండి మంత్రి అడిగి తెలుసుకున్నారు.మంత్రి తుమ్మల మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూం ఇండ్లను పేద ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల్లో భాగమన్నారు. పనులు ఆలస్యం కావడం వల్ల లబ్దిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. నిర్మాణ పనుల్లో ఉన్న లోపాలు, నిధుల సమస్య, కాంట్రాక్టర్ తదితర అంశాలకు సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేసి హౌజింగ్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌తో చర్చించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట అదనపు నిధులు, సాంకేతిక సహాయం లేదా పరిపాలన అనుమతులు అవసరమైతే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని మంత్రి సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, నాయకులు పాల్గొన్నారు.

**ప్రపంచ స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం మంత్రి తుమ్మల:** ప్రపంచ స్థాయి పోటీలకు మన విద్యార్థులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. శనివారం ఖమ్మం నగరం బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం విజ్ఞానాన్ని వినియోగిస్తూ చిన్న చిన్న యంత్రాలను విద్యార్థులు తయారు చేయడం మంచి పరిణామమని తెలిపారు. విద్య లేకపోతే ఎటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఎన్ని చేసినా ఉపయోగం ఉండదని మన పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌కు 900లకు పైగా ఎగ్జిబిట్స్ రావడం చాలా సంతోషకరమన్నారు.ఇటువంటి వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌లు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిఈవో చైతన్య జైని, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఆర్‌టిఒ కార్యాలయంపై ఎసిబి దాడి

### అదుపులో 15 మంది ఏజెంట్లు

### రూ. 70వేల నగదు స్వాధీనం

**ప్రజాపక్షం/ ఖమ్మం బైపాస్ రోడ్డు :** ఖమ్మం ఆర్టీవో కార్యాలయానికి సంబంధించి కొద్ది రోజులుగా భారీ వసూళ్లపై పలు ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం ఆర్టీవో కార్యాలయాన్ని కొందరు ఏజెంట్లు శాసిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో శనివారం ఏసిబి అధికారులు దాడులు నిర్వహించారు. ఏసిబి డిఎస్‌పి రమేష్ నేతృత్వంలో జరిగిన దాడుల్లో ఏజెంట్ల వద్ద నుంచి రూ. 70వేల నగదు, పలు డాక్యుమెంట్లు, ఆర్‌సి పుస్తకాలు, డ్రైవింగ్ లైసెన్స్ కాపీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రవాణా శాఖ కార్యాలయ ంలోని ల్యాప్‌టాప్, మొబైల్స్ తో పాటు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. కొందరు ఏజెంట్లు అర్హతలు లేని వారికి డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించడంతో పాటు పలు కేసులను పరిష్కరించే క్రమంలో పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.15 మంది ప్రైవేటు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. డిసెంబర్ మూడు నుంచి తొమ్మిది వరకు వారోత్సవాలను నిర్వహించామని ఆయన తెలిపారు. ఏసిబి దాడులతో ఆర్టీవో కార్యాలయంలోని అధికారులు ఒక్కసారిగా కంగుతిన్నారు.

# పాడె మోసి.. కన్నీటి వీడ్కోలు..



**ప్రజాపక్షం/కూసుమంచి:** రాజకీయం అంటే కేవలం పదవులు అధికార దర్పం మాత్రమే కాదు అంతకు మించిన ఆత్మీయ అనుబంధమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరూపించారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తూ, తన వెన్నంటి నడిచిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు యడవల్లి రామిరెడ్డి అకాల మరణం ఆయన్ని తీవ్రంగా కలచివేసింది. శనివారం పాలేరులో జరిగిన రామిరెడ్డి అంత్యక్రియల్లో మంత్రి పాల్గొన్న తీరు అక్కడున్న వేలాది మంది కళ్లను చెమర్చింది.

### అధికార హోదా మరిచి..

అంత్య క్రియల సందర్భంగా మంత్రి పొంగులేటి తన ప్రోటోకాల్‌ను పక్కన పెట్టారు. తన ప్రియతమ అనుచరుడికి కడసారి వీడ్కోలు పలుకుతూ మంత్రి స్వయంగా పాడే మోశారు. సాధారణ కార్యకర్తలు, ఇతర నాయకులతో కలిసి శ్మశాన వాటిక వరకు నడిచి తనపై ఉన్న అపారమైన గౌరవాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు. ఒక రాష్ట్ర మంత్రి హోదాలో ఉండి కూడా, తన అనుచరుడి కోసం పాడే పట్టి కన్నీటి వీడ్కోలు పలకడాన్ని చూసి ప్రజలు భావోద్వేగానికి లోనయ్యారు.

### పాలేరు శోకసంద్రం....

సీనియర్ నాయకుడు రామిరెడ్డి మృతితో పాలేరు గ్రామం మౌన రోదనతో నిండిపోయింది. వేలాదిగా తరలివచ్చిన జనవాహిని మధ్య అంత్యక్రియలు ముగిశాయి. పార్టీ ఒక నిబద్ధత గల సీనియర్ నాయకుడిని కోల్పోయింది. నా రాజకీయ ప్రయాణంలో రామిరెడ్డి పాత్ర మరువలేనిది అని మంత్రి ఆవేదన వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

### మాజీ ఎమ్మెల్యే కందాల నివాళి....

కాంగ్రెస్ నేత రామిరెడ్డి అంత్యక్రియలు సందర్భంగా శనివారం నాడు పాలేరు మాజీ ఎంఎల్‌ఏ కందాల ఉపేందర్‌రెడ్డి, మృతుడు రామిరెడ్డి భౌతికాయంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావుతో పాటు బండి రమేష్ పాల్గొనగా న్యూడెమోక్రసీ పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకట్రాంరెడ్డి పలు పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నష్టం చేసే నాయకుల పట్ల అప్రమత్తం

### గాంధీ పేరు తొలగించడం దేశ ద్రోహమే

### బిజెపికి చోటివ్వని ఖమ్మం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీలో ఉండి కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కొంత మంది పార్టీలో ఉండి పదవులు అనుభవిస్తూ పార్టీ విజయాలను అడ్డుకున్నారని కొన్ని గ్రామాల్లో నేతల వైఖరి కారణంగానే పార్టీ ఓటమి చెందిందని ఆయన అన్నారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమితులైన నాగండ్ల దీపక్ చౌదరి పదవి స్వీకారోత్సవ కార్యక్రమం శనివారం తుమ్మల క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో తుమ్మల మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి ఉన్న మహత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చి గాంధీ పేరును తొలగించడం దేశ ద్రోహమేనన్నారు. ఈ దేశం కోసం గాంధీ చేసిన సేవలు గుర్తుంచుకోవాలని తుమ్మల తెలిపారు. ఈ దేశం కోసం తుపాకీ తూటాలకు బలై ప్రాణత్యాగం చేసిన మహనీయుడు మహత్మ గాంధీ అని ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా ప్రజలు బిజెపికి చోటివ్వకుండా సరైన రీతిలో సమాధానం చెప్పారని ఈ సందర్భంగా బిజెపికి చోటివ్వని ఖమ్మం ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మంచి విజయాన్ని అందించారని ఈ ఫలితాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు గీటురాయిగా నిలిచాయన్నారు. జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఛైర్మన్ మానుకొండ రాధా కిషోర్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో గొర్రెలు మృతి



**ప్రజాపక్షం/కల్లూరు:** చంద్రు పట్ల గ్రామానికి చెందిన జోగిని బోయిన కృష్ణయ్య అనే గొర్రెల కాపరి కి చెందిన వీధి కుక్కల దాడిలో 11 గొర్రెలు మృతి చెందగా 9 గొర్రెలు గాయాల పాలైన ట్లు యజమాని కృష్ణయ్య తో పాటు ప శువైద్యాధికారి మమత లు తెలిపారు. ఈ విషయమై వైద్య అధికారిని వివరణ కోరగా కుక్కల దాడిలో మరణం అనంతరం పోస్టుమార్టం చేశామని, గాయాలు పాలైన వాటిని వైద్యం అందించామని తెలిపారు. గొర్రెల కాపరి యజమానికి 1.20 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. బాధితులు లబోదిబోమంటూన్నారు. గ్రామస్తులు కుటుంబాన్ని పరామర్శిస్తున్నారు.

# అబ్బురపరిచిన సైన్స్ నమూనాలు

### 'స్మార్ట్‌కిడ్జ్‌లో' ఇన్‌స్పైర్ 2025

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో నిర్వహించిన ఇన్‌స్పైర్ 2025 కార్యక్రమంలో సైన్స్ నమూనాలు అబ్బురపరిచాయి. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ 2025 కార్యక్రమాన్ని జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ ప్రారంభించారు.భవిష్యత్తులో సైంటిస్టులుగా ఎదిగి సమాజానికి సేవలు అందించాలన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో చిన్నారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. అన్ని రంగాలలో శిక్షణనిస్తున్న పాఠశాల యజమాన్యాన్ని అభినందించారు. కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలలో గత 13 సంవత్సరాలుగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 200లకు పైగా సైన్స్ నమూనాలు ప్రదర్శించారు. భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, ఆరోగ్యం, రవాణా మార్గాలు, అంతరిక్షం, సూర్యకుటుంబం, ప్రజల జీవన విధానం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సోలార్ ఎనర్జీ, గ్లోబల్ వార్నింగ్, నదులు, అడవుల ప్రస్థానం నమూనాలను విద్యార్థులు రూపొందించి ప్రదర్శించారు .కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, పైడిపల్లి సత్యనారాయణ, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఎస్‌బిఐటి స్వాగత వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి కళాశాలలో మేనేజ్‌మెంట్ విద్యార్థుల స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో, వ్యాపారంలో కీలకంగా నిలిచేది మేనేజ్‌మెంట్ విభాగమేనన్నారు. ఆర్థిక వ్యవహారాలపై ప్రణాళిక లేకపోవడం వల్ల ఎంతో మంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఆర్థిక సంబంధమైన వ్యవహారాలపై నిర్దిష్టమైన వైఖరి కలిగి ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥జి. ధాత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ వంటి టెక్నికల్ విద్యతో పాటు మేనేజ్ మెంట్ కోర్సులకు కూడా డిమాండ్ ఉందన్నారు. అకౌంట్స్, హెచ్ఆర్, మార్కెటింగ్, ఫైనాన్స్ రంగాల్లో మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. వైస్ ఛైర్మన్ శ్రీచైతన్య మాట్లాడుతూ సరైన ప్రణాళిక కలిగి ఉంటే అవకాశాలు వాటంతట అవే దరి చేరుతాయన్నారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణనిస్తూ టీమ్ లీడర్స్‌గా ఎదిగేందుకు తర్ఫీదునిస్తున్నామన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంబిఏ విభాగాధిపతి డా॥పి. రామకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

### ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రాత్రివేళ పెరుగుతు న్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పోలీసుశాఖ పటిష్ఠ భద్రతాచర్యలు చేపడుతోందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి అడిషనల్ డిసిపి లా అండ్ ఆడర్ ప్రసాద్‌రావు పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు చేపట్టారు. మ ద్యం సేంవించి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్‌ఎనలైజర్‌తో తనిఖీలు చేపట్టడంతో పాటు పలువురు అనుమానితుల నుంచి మొబైల్ చెక్‌ద్వారా వేలిముద్రలు సేకరించారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేసి న్యాయస్థానంలో జైలుశిక్ష, జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందన్నారు. జిల్లా లో గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్లు, ట్రాఫిక్ సిగ్నాల్స్, బ్లింక్ లైట్లు, ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం, ర్యాష్, మద్యం సేవించి వాహనాలు నడపడం వలనే ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులు కావడానికి కారణమని నివేదికలు చెపుతున్నాయన్నారు. జిల్లా వ్యాప్తాంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నిత్యం వాహనాల తనిఖీలు చేపట్టాలని పోలీసు అధికారులు, ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించడం జరిగిందని పోలీసుకమిషనర్ పేర్కొన్నారు. ప్రధానంగా మద్యం సేవించి వాహనాలను నడిపేవారిపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.

**నేటి జాతీయలోక్ అదాలత్‌ను నియోగించుకోండి సిపి సునిల్‌దత్ :** నేడు జరగనున్న జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ విజ్ఞాప్తి చేశారు. చిన్నచిన్న విషయాలకు కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయంతో పాటు ఆర్థికంగా నష్టపోకుండా ఇరువర్గాల వారు జాతీయలోక్ అదాలత్‌కు హాజరై పరస్పర సమ్మతితో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాజీచేసుకునే అవకాశం ఉన్న వివిధ రకాల కేసులు, క్రిమినల్ కంపౌండ్ కేసులు, సివిల్, ఆస్తి తగాదాలు, భర్యభర్తలు, కుటుంబ సమస్యలు, డ్రంకన్‌డ్రైవ్, మోటారు వాహన చట్టం ఉల్లంఘనలు, చెక్‌బౌన్స్, బ్యాంక్‌రికవరీ తదితర కేసులను ఈ జాతీయలోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సిపి తెలిపారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.



# క్రీడ

## 2026 టీ20 ప్రపంచకప్
# భారత జట్టు ప్రకటన
### గిల్‌కు షాక్.. ఇషాన్‌కు ఛాన్స్




వచ్చే ఏడాది భారత్-శ్రీలంక వేదికగా జరుగనున్న టీ20 ప్రపంచకప్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగనున్నది. ఈ సారి టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భారత జట్టు భావిస్తున్నది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని జాతీయ సెలక్షన్ కమిటీ శనివారం టీ20 ప్రపంచ టోర్నమెంట్ కోసం 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ప్రధాన కార్యాలయంలో జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో జట్టును ఎంపిక చేసింది. ఇదే జట్టు జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌లో కూడా ఆడనుంది.



రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత్ 2024లో దక్షిణాఫ్రికాను ఓడించి ట్రోఫీని గెలుచుకుంది. భారత్ తన టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే సంకల్పంతో ఈ టోర్నమెంట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నది. ఈ ఇది టోర్నమెంట్ 10వ ఎడిషన్. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు ఏ జట్టు కూడా టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయాయి. సొంత గడ్డపై ఈ రికార్డును బద్దలు కొట్టాలని టీమిండియా కృతనిశ్చయంతో ఉన్నది. టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టులో శుభ్‌మన్ గిల్ దూరమయ్యాడు. మొన్నటి వరకు వైస్ కెప్టెన్‌గా కొనసాగిన గిల్ స్థానంలో అక్షర్ పటేల్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఫామ్ లేమితో గిల్ ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే.
ఇదిలా ఉండగా.. వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్, రింకు సింగ్ జట్టులోకి తిరిగి వచ్చారు. ఇషాన్ చివరిగా 2023 నవంబర్ 28న ఆస్ట్రేలియాపై భారత్ తరఫున చివరి మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత ఇషాన్ దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపికయ్యాడు. కానీ అక్కడ ఒక్క మ్యాచ్ కూడా ఆడే ఛాన్స్ రాలేదు. పర్యటన మధ్యలోనే ఇషాన్ తిరిగి స్వదేశానికి వచ్చాడు. దేశవాళీ క్రికెట్ కంటే ఐపిఎల్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాడన్న విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే జాతీయ జట్టులో చోటు కోల్పోయాడు. తాజాగా రెండేళ్ల తర్వాత జట్టులోకి తిరిగి వచ్చాడు. రింకు సింగ్ చివరిసారిగా ఆసియా కప్‌లో ఆడాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో మాత్రం చోటు దక్కలేదు. శుభ్‌మన్ గిల్ స్థానంలో అక్షర్ పటేల్‌ను టీ20 జట్టు వైస్ కెప్టెన్‌గా నియమించారు. అక్షర్ గతంలో కూడా టీ20ల్లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. వాస్తవానికి ఈ సారి ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ జట్టులోకి తిరిగి వచ్చాడు. కిషన్ ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్‌లో 101 పరుగులు చేశాడు. టోర్నమెంట్ మొత్తం అద్భుతమైన బ్యాటింగ్‌తో అలరించాడు. ఇషాన్ చేరికతో జితేష్ శర్మ చోటు కోల్పోయాడు. సంజు శాంసన్ వికెట్ కీపర్‌గా వ్యవహరిస్తాడు. జట్టును ప్రకటించే సమయంలో అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. సంజు శాంసన్ వికెట్ కీపర్‌గా కొనసాగుతాడని తెలిపాడు. గిల్ జట్టులో లేకపోవడంతో అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. శాంసన్, అభిషేక్ ఓపెనింగ్ జోడీ అద్భుతంగా ఉంటుంది. గతంలో ఇద్దరు ఓపెనర్లుగా వచ్చి పరుగుల వరద పారించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదవ టీ20లోనూ ఇదే దృశ్యం కనిపించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచకప్ జరుగనున్నది. భారత్‌శ్రీలంక సంయుక్తంగా టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇస్తున్నాయి. ఇప్పటికే ఐసిసి వేదికలను ఖరారు చేసిన విషయం తెలిసిందే. టీమిండియా టీ20 ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న ముంబయిలో యూఎస్‌ఏతో ఆడుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 12న నమీబియాతో ఢిల్లీలో ఆడుతుంది. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడుతుంది. అనంతరం ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లోని భారీ నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో చివరి గ్రూప్ మ్యాచ్ ఆడుతుంది.

### భారత జట్టు

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకూ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ఇషాన్ కిషన్, వరుణ్ చక్రవర్తి.

### భగవద్గీత చదివి ఒత్తిడి, కష్టాలను అధిగమించా.. : ఇషాన్



దేశవాళీలో విధ్వంసక ఆటతో సెలెక్టర్లకు సవాల్ విసిరిన ఇషాన్ కిషన్ మళ్లీ నీలిరంగు జెర్సీ వేసుకోనున్నాడు. ఇటీవలే ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్‌ను తొలిసారి ఛాంపియన్‌గా నిలిపిన ఇషాన్ అనుకున్నట్టే ప్రపంచ కప్ బెర్తు దక్కించుకున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో స్వదేశంలో జరుగబోయే టీ20 ప్రపంచకప్ స్క్వాడ్‌కు తనను ఎంపిక చేయడంపై ఇషాన్ స్పందించాడు. ఈ లెఫ్ట్ హ్యాండర్ శనివారం ఏఎన్ఐతో మాట్లాడుతూ తనకు చాలా సంతోషంగా ఉందని అన్నాడు. భగవద్గీత చదవడం ద్వారా ఒత్తిడి, కష్టాలను అధిగమించానని చెప్పాడీ హిట్టర్. న్యూజిలాండ్‌తో ఐదు టీ20 సిరీస్‌తో పాటు ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన 15మంది స్క్వాడ్‌లో ఇషాన్‌కు చోటు లభించింది. శవాళీలో మెరుపు ఇన్నింగ్స్‌లతో అవకాశం దక్కించుకున్నాడు. దాంతో.. రెండేళ్ల క్రితం చివరి టీ20 ఆడిన ఇషాన్ కిషన్‌ను మళ్లీ బ్లూ జెర్సీలో చూసే రోజులొచ్చేశాయి. టాపార్డర్‌లో రెండో వికెట్ కీపర్ ఉండాలనే ఉద్దేశంతోనే ఇషాన్‌కు చోటిచ్చామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. దాంతో.. ఈ చిచ్చరపిడుగుకు ప్రపంచకప్ స్క్వాడ్‌లోకి వచ్చాడు. ఈ సందర్భంగా ఎన్ఐఏ భారత స్టార్‌ను పలకరించింది. చాలా సంతోషంగా ఉంది. దేశవాళీలో నా టీమ్ జార్ఖండ్ తొలి సారి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గెలుపొందడం పట్ల కూడా చాలా సంతోషంగా ఉంది. ప్రతిఒక్కరూ చాలా బాగా ఆడారు అని ఇషాన్ తెలిపాడు.

# ఫోకస్






**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ/ క్లోజింగ్):**
సెన్సెక్స్ 84,929.36 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 85,267.66 పాయింట్లు. నష్టం 338.3 పాయింట్లు).

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్‌ఇ/ క్లోజింగ్):**
నిఫ్టీ 25,966.40 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 26,047.00 పాయింట్లు. నష్టం 81.26 పాయింట్లు)

## జపాన్ వడ్డీ రేట్ల పెంపుపై చర్చ



జపాన్ కేంద్ర బ్యాంక్ (బ్యాంక్ ఆఫ్ జపాన్–బిఒజె) కీలక వడ్డీ రేటును 0.25 శాతం పెంచి 0.75 శాతానికి చేర్చడంపై ప్రపంచ వాణిజ్య రంగంలో చర్చనీయాంశమైంది. గత 30 ఏళ్లలో అత్యధిక స్థాయి కావడమే అందుకు కారణం. ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇతర ప్రధాన దేశాలు వడ్డీ రేట్లు తగ్గించే దశలో ఉండగా, జపాన్ వాటిని పెంచుతోంది. దశాబ్దాలుగా తక్కువ లేదా ప్రతికూల వడ్డీ రేట్లతో ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొన్న జపాన్, ద్రవ్యోల్బణం 2 శాతం లక్ష్యాన్ని మించి స్థిరపడడంతో ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే యెన్ బలహీనపడటంతో దిగుమతుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం వేగంగా పెరిగింది. వడ్డీ రేట్లు పెరగడంతో యెన్ విలువ బలపడే అవకాశం ఉందని, ఇది ధరల ఒత్తిడిని కొంత తగ్గించవచ్చని అంచనా. జపాన్ రేటు పెంపు 'క్యారీ ట్రేడ్'పై ప్రభావం చూపవచ్చు. యెన్‌లో తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుని ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టే వ్యూహం దీని వల్ల బలహీనపడే అవకాశం ఉంది. దీంతో షేర్ మార్కెట్లు, క్రిప్టోకరెన్సీలు వంటి ఆస్తులపై ఒత్తిడి రావొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం మధ్య సమతుల్యత సాధించడం బిఒజెకు సవాలుగా మారింది. జీతాలు పెరుగుతాయని గవర్నర్ కాజుఓ ఉయేదా ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని రేటు పెంపులపై ఆయన వ్యాఖ్యలపై మార్కెట్లు దృష్టి సారిస్తున్నాయి.

## బులియన్ మార్కెట్లు

బంగారం ధరలు గతంలో ఎన్నడూ లేని రీతిలో రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అస్థిరత, ద్రవ్యోల్బణ భయాలు పెరగడం, అలాగే సురక్షిత పెట్టుబడుల వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపడం వల్ల విలువైన లోహాలపై డిమాండ్ భారీగా పెరిగింది. 2025లో బంగారం ధరలు మొత్తం సంవత్సరంలో సుమారు 63 శాతం వరకు పెరిగాయి. కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్లపై స్పష్టత లేకపోవడం, అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు, డాలర్ విలువలో మార్పులు వంటి అంశాలు బంగారానికి మరింత బలం చేకూర్చాయి. కాగా, శనివారం దేశంలో బంగారం 24 క్యారట్ల గ్రాము ధర రూ.13,418. 22 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ. 12,300. అలాగే 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.10,064. వివిధ కారణాలతో బంగారానికి డిమాండ్ తగ్గడం లేదు. డాలర్‌కు రూపాయి మారకం విలువ క్షీణత పెట్టుబడిదారులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఫలితంగా రక్షణాత్మక విధానాలను అనుసరిస్తూ, వారు బంగారంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. వచ్చే వారం కూడా పరిస్థితి ఇదే రీతిలో కొనసాగవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## నిర్లక్ష్యం చేస్తే సమస్యలు తప్పవు




ఆదాయ పన్ను రిటర్న్స్, ఆధార్–పాన్‌కార్డ్ లింక్ వంటి పనులను నిర్లక్ష్యం చేస్తే, భవిష్యత్తులో సమస్యలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈనెలాఖరులోగా ఈ రెండు విషయాలపై స్పందించాలని సూచిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు ఆదాయపు పన్ను రిటర్నులు (ITR) దాఖలు చేయకపోతే, ఈనెల 31వ తేదీలోగా బిలేటెడ్ ఐటిఆర్‌ను దాఖలు చేసుకోవచ్చు. అయితే, వార్షిక ఆదాయం రూ. 5 లక్షల లోపు ఉంటే.. రూ. 1,000 ఫైన్ కట్టాలి. అలాగే ఆదాయం రూ. 5 లక్షల కంటే ఎక్కువగా ఉంటే.. రూ. 5,000 వరకు పెనాల్టీ తప్పదు. ఈ గడువు తర్వాత రిటర్న్స్ దాఖలు చేసే అవకాశం అస్సలు ఉండదు. రావాల్సిన ట్యాక్స్ రిఫండ్ నిలిచిపోతుంది. ట్యాక్స్ బకాయిలపై అదనంగా వడ్డీ కూడా చెల్లించాల్సి వస్తుంది. భవిష్యత్తులో లోన్లు తీసుకోవాలన్నా, వీసా అప్లై చేయాలన్నా ఐటీఆర్ లేకపోవడం పెద్ద సమస్యగా మారుతుంది. అదే విధంగా పాన్ కార్డ్‌ను ఆధార్‌తో లింక్ చేసుకునే అవకాశం వాస్తవానికి 2024 అక్టోబర్ ఒకటో తేదీతో ముగిసింది. అయితే, ఇప్పుడు గడువును ఈనెల 31 వరకూ ఉంది. ఈ అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలి. లేకపోతే, పాన్‌కార్డ్ ఇన్‌యాక్టివ్ అవుతుంది. బ్యాంకు లావాదేవీల నుంచి పెట్టుబడుల వరకూ అన్ని రకాలుగా ఇబ్బందులు తప్పవు. ఈ లింక్ కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్‌లో, ఇంటి వద్ద నుంచే చేసుకోవచ్చు. ముందుగా, ఇన్‌కమ్ ట్యాక్స్ వెబ్‌సైట్ (incometax.gov.in)కి వెళ్లాలి. 'Quick Links' విభాగంలో 'Link Aadhaar' క్లిక్ చేసి, అక్కడ పాన్ నెంబర్, ఆధార్ నంబర్లను ఎంటర్ చేసి ఒటిపి ద్వారా వెరిఫై చేయాలి. అవసరమైన ఫీజు చెల్లించి ప్రక్రియను పూర్తి చేయాలి. లేదా రిజిస్టర్డ్ మొబైల్ నుండి 567678 నంబర్‌కు UIDPAN అని SMS పంపడం ద్వారా కూడా లింగ్ చేసుకోవచ్చు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## అధికారుల తీరుతో దెబ్బతింటున్న సింగరేణి ప్రతిష్ఠ
### ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థలో కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సంస్థ కీర్తి ప్రతిష్టలను దెబ్బతీస్తున్నారని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన అధికారుల తీరుపై మండిపడ్డారు. పదవీ విరమణ పొందిన కార్మికులు క్వార్టర్ ఖాళీ చేస్తేనే లాభాల వాటా, దీపావళి బోనస్ చెల్లిస్తామనడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. గతంలో ఇలాంటి నిబంధనలు ఎప్పుడూ లేవని, క్వార్టర్ ఖాళీ చేయకపోతే కేవలం గ్రాట్యూటీ మాత్రమే ఆపేవారని గుర్తు చేశారు. కొత్త నిబంధనల పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేయడాన్ని యూనియన్ తరపున వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సంస్థల నుండి సింగరేణికి రావాల్సిన రూ. 40 వేల కోట్ల బకాయిలను రాబట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీతారామయ్య ఆరోపించారు. సింగరేణి లేని జిల్లాల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, సింగరేణి అవతరణ దినోత్సవ వేడుకలకు మాత్రం నిధులు లేవనడం హాస్యాస్పదమని అన్నారు. ఏరియాల వారీగా ఘనంగా జరుపుకునే వేడుకలను కేవలం జనరల్ మేనేజర్ కార్యాలయాలకే పరిమితం చేయాలని చూడటం కార్మికులను రెచ్చగొట్టడమేనని పేర్కొన్నారు. సంస్థ భవిష్యత్తును నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి
### సర్పంచ్‌లకు గోదా శ్రీరాములు సూచన



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనం ఎగరవేసిన సర్పంచులు గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి నూతనంగా ఎన్నికైన సర్పంచులు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోదా శ్రీరాములు సూచించారు. యాదగిరిగుట్ట పట్టణంలో సిపిఐ కార్యాలయం వద్ద శనివారం ధర్మారెడ్డిగూడెం సర్పంచు కొల్లూరి రాజయ్య, మల్లిగూడెం సర్పంచ్ బోదాస్ స్వప్న జగన్, ఉప సర్పంచు, వార్డు సభ్యులకు అభినందన సభలో సత్కరించి మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో విజయం కైవసం చేసుకున్న సర్పంచులు గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో సర్పంచులుగా పాలన కొనసాగించి ప్రజలలో మంచి గుర్తింపు సాధించాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మండలంలో ఇద్దరు సర్పంచులు గెలవడం సంతోషమన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ దడిగ ఇస్తారీ, సీపీఐ పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, నాయకులు సుబ్బూరి నర్సయ్య, పేరబోయిన బంగారి, మీసాల దాసు, రాయగిరి బాలకృష్ణ, గోపగాని రాజు, ఆరే పుష్ప, మునుకుంట్ల నరసమ్మ, బోదాసు స్వామి, కోకల రవీందర్, గుండు వెంకటేష్, ముక్కెర్ల పెంటయ్య, పబ్బాల స్వామి, అనంతుల నరసింహా, నమిల సంజీవ, రేఖల మల్లు స్వామి, పాకాలపాటి రాజు, కళ్లెం సిద్దులు, ఆర్టీసీ యాదగిరి,తుమ్మలఇస్తారి,కంబాలవెంకటేష్, స్వామి, కంబాల యాదయ్య, నాతగాని కిష్టమ్మ, నేరేటి లక్ష్మి , మద్దూరి భాగ్యమ్మ, అంజమ్మ, లక్ష్మయ్య, బిక్షపతి, ఆటో కార్మిక సంఘం, టాంగా కార్మిక సంఘం, భగత్ సింగ్ యూత్ మున్సిపల్ కార్మిక సంఘం, ఉంగరాల సంఘం, చిన్న వ్యాపారుల సంఘం, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సన్మానించారు.

# పాలన ఆదర్శవంతంగా ఉండాలి
### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
### సిపిఐలో చేరిన కోడిపుంజులవాగు సర్పంచ్ అజ్మీరా మహేశ్వరి




**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజలు మెచ్చే రీతిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, గ్రామాభివృద్దిలో ఆదర్శంగా పాలన కొనసాగించాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి కోడిపుంజులవాగు సర్పంచ్ అజ్మీరా మహేశ్వరి శ్రీనివాస్ కూనంనేని సాంబశివరావు సమక్షంలో శనివారం సిపిఐలో చేరారు. వారిని ఎర్ర కండువా కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గంలో ఎంఎల్ఏ కూనంనేని చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరామని సర్పంచ్ మహేశ్వరి చెప్పారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామ పంచాయితి పాలన సాగించాలన్నారు. రాగాద్వేషాలకుఅతీతంగాపారదర్శకంగా పంచాయితీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పేదల పక్షాన పోరాడే సిపిఐలోకి రావటం అభినందనీయమన్నారు. ప్రజల పక్షాన చేపట్టే ప్రతీ మంచిపని వెనకాల సిపిఐ అండదండలు ఉంటాయని స్పష్టం చేశారు. సర్పంచ్ మహేశ్వరి చేరికతో స్థానిక సంస్థలల్లో మరింత బలం చేకూరిందన్నారు.సిపిఐజిల్లాకార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు గుండాల నాగరాజు, మ్నెం వెంకన్న, అజ్మీరా రాములు నాయక్, అజ్మీరా శ్రీనివాస్‌నాయక్, బదావత్ రాంజీ, గుగులోత్ రాములు, బదావత్ లక్పతి, బానోత్ చందు, అజ్మీరా బాలు, క్రిష్ణ, తేజావత్ రమేష్, లచ్చిరాం పాల్గొన్నారు.

## గాంధీ పేరు మార్చడమంటే స్వేచ్ఛను హరించడమే
### సిపిఐ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఉపాధి కార్మికులారా ఉద్యమించండి అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శిచింతకుంటలవెంకన్న పిలుపునిచ్చారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో మహాత్మా గాంధీ పేరు మారుస్తూ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలను నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు ఆధ్వర్యంలో స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం ముందు గాంధీ మాస్కులు ధరించి, చిత్ర పటాలను పట్టుకొని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి సర్కార్‌మహాత్మాగాంధీ పేరు మార్చడం చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. దేశ స్వాతంత్రం తీసుకువచ్చి జాతిపితగా పిలువబడే మహాత్మా గాంధీ పేరునే మార్చడం అంటే ఈ దేశంలోని 130 కోట్ల మంది ప్రజల స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. దేశ స్వాతంత్రాన్ని అవమానించే విధంగా రాజ్యాంగాన్ని అవమానించే పరంగా బిజెపి చర్యలను ప్రజలంతా ఖండించాలని వారు పిలుపునిచ్చారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వాతంత్రోద్యమాన్ని రాజ్యాంగాన్ని కించపరిచేలా వ్యవహరిస్తోందని, బిజెపి సర్కార్ నెహ్రూ, నేడు గాంధీ వరుసగా దేశ స్వతంత్రం కించపరిచేలా వ్యవహరిస్తోందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ పేరును యధావిధిగా కొనసాగించాలని, 200 రోజుల పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే ఉపాధి కార్మికులుఉప్పెనలా కదలి వచ్చి మోడీని గద్దెదించాలన్నారు.గాంధీని, అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించిన మోడీకి పతనం తప్పదని, ఉపాధిహామీ పేరు యధావిధిగా ఉంచాలన్నారు. పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, తండ సందీప్, కొమ్ము నారాయణ, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, మంద శంకర్, తండా శ్రీనాథ్,బల్లెం శ్రీకాంత్, మెతుకు కుమార్, రాజు, కూరాకుల పాల్, బోళ్ళ భద్రయ్య, నక్క నాగార్జున ,మేక వెంకటేష్, కొండమీది రవి ఉన్నారు.

## లోపభూయిష్టంగా సైన్స్ ఫెయిర్
### డిఆర్‌ఒకు ఎఐఎస్‌ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థులకు వసతుల కల్పనలో జిల్లా విద్యాశాఖ విఫలమైందని, లోపాభూయిష్టంగా సైన్స్ ఫెయిర్ నిర్వహణ ఉం దని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీకి వినతి పత్రం సమర్పించారు. ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం ప్రచార ఆర్భాటమే తప్ప సౌకర్యాలు కల్పించలేదన్నారు. సైన్స్ ఫెయిర్ వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులకు వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. ట్రాలీ ఆటోల్లో విద్యార్థులు రావడం వల్ల ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ సైన్స్‌ఫెయిర్‌పై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివానాయక్, గోపి, పవన్, నరేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించాలి : బాలనరసింహ్మా






**ప్రజాపక్షం/అమరచింత/మక్తల్ :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు అందరూ సన్నదం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ పిలుపునిచ్చా రు. శనివారం అమరచింత మండల కేంద్రంలో సిపిఐ పార్టీ మండల కార్యాలయాన్ని బాల నరసింహతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇష్టానుసారింగా నిర్ణయాలు తీసుకుంటూ కార్మిక రంగానికి, రైతులకు నష్టధాయం కలిగించే నూతన చట్టాలను తెచ్చి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని బాల నరసింహ ఆందోళన చెందారు. జాతీయ ఉపాధి పథకాన్ని పేరు మార్చి ఆ పథకం నిర్వీర్యం చేసేలా కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని బాల నరసింహ గుర్తు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని ఆయన కోరారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలు ఎప్పటికప్పుడు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యాలయం ముందు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి విజయరాములు, కళావతమ్మ, లక్ష్మీనారాయణ, అబ్రహం, రవీందర్, రాబర్ట్, శ్రీహరి, నరసింహ శెట్టి, భాస్కర్, కుతుబ్, రమేష్, గోపాలకృష్ణ, అంజి, సుజాత, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల సాధనకు పోరాటాలే మార్గం
### బిసి హక్కులసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిల సమస్యలు పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో ప్రస్తావనకే రాకపోవడం అత్యంత బాధాకరమని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో విమర్శించారు. డిసెంబర్ 1 నుండి 19 వరకు జరిగిన పార్లమెంట్ సమావేశాలలో బిసి రిజర్వేషన్లపై ప్రతిపక్ష, అధికారపక్షాలేవి కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కోట్లాదిమంది ఎస్సి, ఎస్టి, బిసిపేద వర్గాలకు ఉపాధిని కలిగిస్తున్న నరేగా ను రద్దుచేసి ఎవరు కోరుకోని వీబీజీ రామ్ జీ తో సహా 8 బిల్లులను మంద బలంతో ఆమోదించిన పార్లమెంట్ బిసిల డిమాండ్స్ పై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న ఆ సమస్యల్ని పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర శాసనసభలో బిసిలకు విద్యా, ఉద్యోగ, రంగాలలో, స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్స్ ఆమోదించి కేంద్రానికి పంపిన బిల్లులు పెండింగ్ లో ఉంటే ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాష్ట్రంలోని కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు ప్రస్తావించకుండా చర్చకు పెట్టకుండా మౌనంగా ఉండటంలో ఆంతర్యం ఏమిటో అర్థమవుతుందన్నారు. బిసిలకు రిజర్వేషన్లకు తాము మద్దతు ఇస్తున్నట్లు ప్రకటిస్తూనే బిసిలకు తీరని ద్రోహం చేస్తున్నారని, చిత్తశుద్ధి లేని శివ పూజ లేల అన్నట్లుగా వీరి వైఖరి ఉందన్నారు. బిసి రిజర్వేషన్స్ ఇతర డిమాండ్స్ సాధనకై రాజకీయాలకతీతంగా చైతన్యంతో సంఘటితమై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అభివృద్ధికి నా వంతు కృషి : ఎమ్మెల్సీ వెంకట్

ప్రజాపక్షం / హుజురాబాద్ : తనకు రాజకీయ జన్మనిచ్చి నేడు శాసన మండలి సభ్యునిగా ఈ స్థాయిలో నిలబెట్టిన హుజురాబాద్ గడ్డం రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని ఎమ్మెల్సీ, టిపిసిసి ఉపాధ్యక్షులు బల్మూరి వెంకట్ అన్నారు. శనివారం హుజురాబాద్ నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ మద్దతుదారులైన నూతన సర్పంచులను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బల్మూరి వెంకట్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతొందని పేర్కొన్నారు. ఈ పంచాయతీ ఎ న్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నా యని, కాంగ్రెస్ అభ్యర్థులను ఎలాగైనా ఓడించాలని శతవిధాల ప్రయత్నించారని ఆయన విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా, ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో కాంగ్రెస్ వైపు నిలిచారని సుమారు 30కి పైగా స్థానాల్లో తమ అభ్యర్థులు ఘన విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముత్తారం ఎంపిడిఒ లలిత సస్పెన్షన్

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : ముత్తారం ఎంపిడిఓ, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన ఎం.తిరుపతి అవినీతి కారణంగా సర్వీస్ నుంచి తొలగించడం జరిగింది. ఎం తిరుపతి విచారణ సమయంలో అప్పటి కమాన్ పూర్ ఎంపిడిఒగా విధులు నిర్వహించిన జి.లలిత కు అవినీతి డబ్బులు వాటా పంపినట్లు మాజీ పంచాయతీ కార్యదర్శి ఎం. తిరుపతి వాంగ్మూలం, ఫోన్ పే స్క్రిన్ షాట్స్ సమర్పించారని కలెక్టర్ పేర్కొన్నారు. పిడి హౌసింగ్ జే. రాజేశ్వర్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి రిపోర్ట్ అందించాల్సిందిగా ఆదేశించడం జరిగిందని, ఎం.తిరుపతి వాంగ్మూలం సంబంధించి జి లలిత ఎంపీడీవో పై చేసిన ఆరోపణలకు ఆధారాలు లభించాయని, పీడీ హౌసింగ్ చేపట్టిన విచారణకు ఎంపీడీవో జి లలిత నుంచి సహకారం లభించ లేదని రిపోర్ట్ సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. పిడి హౌసింగ్ అందించిన రిపోర్ట్ అందుబాటులో ఉన్న సాక్షాల పరిశీలన మేరకు ముత్తారం ఎంపిడిఓ, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసి, సస్పెన్షన్ సమయంలో హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని కలెక్టర్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తులు సమర్పించాలి

జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : జనవరి 31లోగా జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి నుంచి పదవ తరగతివరకు చదువుకున్న దివ్యాంగ విద్యార్థులు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కొరకు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి పి వేణుగోపాల్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు ప్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్ కోసం దరఖాస్తు తో పాటు కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం ,ఆదాయ ధ్రువీకరణ, పత్రం ఆధార్ కార్డు, 2 పాస్ సైజు ఫోటోలు ( అంగ వైకల్యం కనిపించినట్లు) , వైద్య ధ్రువీకరణ పత్రం, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులు ఆన్ లైన్ లో http://telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొని, ఆ దరఖాస్తు ప్రింట్ తో పాఠశాల యొక్క ప్రభుత్వ గుర్తింపు పత్రం జత పరిచి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం రూమ్ నెంబర్ 114 నందు సమర్పించాలని, ఇతర వివరముల కోసం 9440852495 ఫోన్ నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బన్నె చెరువు ప్రాంతంలో కొండచిలువ సంచారం

ప్రజాపక్షం/ముత్తారం : మంథని పురపాలక సంఘం పరిధిలోని బన్నెచెరువు సమీపంలో భారీ కొండచిలువ సంచరించడంతో ఆ ప్రాంతంలోని రైతులు సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం సాయంత్రం వేళలో బన్నె చెరువు సమీపంలో బుద్ధార్తి శ్రీనివాస్ అనే మేకల కాపరి తన మేకలను మేపుతుండగా వింత అరుపులు, శబ్దాలు రావడంతో భయాందోళనకు గురై ఆ ప్రాంతం నుండి మేకలను తరలించుకెళ్లాడు. పశువుల కాపరి శబ్దాలు ఎక్కడ నుండి వస్తున్నాయని వెతకగా ఒక చెట్టుకు కొండచిలువ చుట్టుకొని ఉండడాన్ని గమనించి స్థానికులకు తెలియజేశాడు. దీంతో స్థానికులు అటవీ శాఖ అధికారులకు తెలుపగా అటవీశాఖ అధికారులు వచ్చేసరికి పాము అక్కడనుండి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. చెరువు సమీపంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. చెరువు సమీపం ప్రాంతాల ప్రజలు, ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు కోరారు. పాము సమీప ప్రాంతాల ప్రజలకు ఎవరికైనా కనపడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అటవీశాఖ అధికారులు తెలిపారు.

## సమీకృత వసతిగృహాన్ని సందర్శించిన గుంటి స్వరూప



ప్రజాపక్షం/చొప్పదండి:చొప్పదండి మండల కేంద్రంలోని సమీకృత వసతి గృహాన్ని జాతీయ బిసి మహిలా సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూప శ్యామ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి బాగోగులను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల వసతి గృహాల మెస్ చార్జీలను పెంచి పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే అన్ని వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతవిద్యలు చదివి ప్రయోజకులు కావాలని కోరారు.

## యూరియా బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన

ప్రజాపక్షం/గొల్లపల్లి : రైతులకు ఎరువుల పంపిణీని పంపిణీ మరింత పారదర్శకంగా ,సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ,ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ పై జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి కరుణ మాట్లాడుతూ ఎరువుల సరఫరాలో రైతులకు ఇబ్బందులు తొలగించడం ఈ యాప్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు .యూరియా కోసం రైతులు ఇంట్లో కూర్చొని తమ మొబైల్ ఫోన్ ల ద్వారా ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ డౌన్ లోడ్ చేసుకొని లాగిన్ అయి తాము సాగు చేసిన పంట వివరాలను నమోదు చేసి యూరియా సంచులను బుక్ చేసుకోవచ్చని తెలిపారు .ఈ యాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు ,సంబంధిత డీలర్ల వివరాలు స్పష్టంగా కనిపిస్తాయి .రైతులు సమీపంలోని డీలర్ ను ఎంచుకొని యూరియా పొందవచ్చని వివరించారు .రైతుల భూమి విస్తీర్ణాన్ని బట్టి విడుదలవారీగా యూరియా పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఒక ఎకరం భూమి ఉన్న రైతులకు ఒకే విడతలో యూరియా ఒక ఎకరం నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులకు రెండు విడుతలలో యూరియా పంపిణీ చేస్తామని వెల్లడించారు .

# ఎరువుల షాపులో సోదాలు

పెద్దపల్లి పట్టణం ఫర్టిలైజర్ షాపులు తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయడం సులభతరం అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద గల ఎరువుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం మాట్లాడుతూ యూరియా లభ్యతపై రైతులకు ఎటువంటి అనుమానాలు, అపోహలు అవసరం లేదని, ప్రతి రైతుకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. యూరియా ప్రతి రైతుకు చేరాలని ఉద్దేశంతో జిల్లాలో యూరియా ట్రాకింగ్ యాప్ సిద్ధం చేశామని, గత నెల రోజుల నుండి యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జిల్లాలో పర్యవేక్షించామని కలెక్టర్ తెలిపారు. మనం అనుసరించిన విధానాన్ని పరిశీలించిన ప్రభుత్వం మరింత మెరుగ్గా యూరియా బుకింగ్ యాప్ ప్రవేశ పెట్టిందని అన్నారు. ఓలా, ఉబర్ వంటి యాప్‌లలో టాక్సీ ఎలా బుక్ చేస్తామో, అదేవిధంగా సులభంగా ఇంటి నుంచే యూరియా బుక్ చేసుకోవచ్చని, రైతులు తమ ఇంటి వద్ద నుంచి యూరియా బుక్ చేసుకుని ఎరువుల షాప్ కు స్వయంగా వచ్చి లేదా ఇతరులతో తమ బుక్ చేసుకున్న బస్తాల వివరాలు, ఓటిపి చెప్తే షాప్ యజమానులు యూరియా సరఫరా చేస్తారని, ఈ యాప్ ఉపయోగించడం వల్ల రైతుల సమయం వృధా కాదని, లైన్లలో నిలబడకుండా సరైన సమయంలో వచ్చి యూరియా తీసుకువెళ్లచ్చని అన్నారు. యాప్ విధానం ద్వారా రైతులు అవసరానికి మించి యూరియా తీసుకొని వెళ్లి స్టాక్ పెట్టుకోవడం నియంత్రించవచ్చని, చిన్న సన్న కారు రైతులకు ఎటువంటి యూరియా కొరత రాకుండా ఉంటుందని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ భూమి వివరాలు తమకు ఎంత యూరియా అవసరమంటుందో ఇంకా ఎన్ని కావాలో అనే అంశాలు ఈ యాప్‌లో నమోదవుతాయని కలెక్టర్ తెలియజేశారు. రైతులు ఈ యాప్ ను ఉపయోగించడం సులభంగా ఉంటుందని ప్రతి ఒక్కరు యాప్ ఉపయోగించుకొని యూరియా కొనుగోలు చేయాలని ఆప్ ఉపయోగించడంలో ఏదైనా సమస్యలు ఏర్పడితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏ. ఓ.లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని మతాలకూ సమాన గౌరవం

సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవించడంతోపాటు అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఎస్సి ఎస్టి, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ ఫంక్షన్ హాల్లో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని క్రైస్తవ సోదరీ సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ శాంతి, ప్రేమ, కరుణ, సౌభ్రాతృత్వాలకు ప్రతీక క్రిస్మస్ పండుగ అని పేర్కొన్నారు. అన్ని మతాలకు ప్రాధాన్యతను ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఐక్యతను కాపాడుతున్నద ని అదే సమయంలో అందరి సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని చెప్పా రు. క్రైస్తవ మైనారిటీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తున్నద ని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత, ఆర్‌డిఓ మధుసూదన్, మంత్రి సతీమణి కాంతాకుమారి,ఏఎంసి చైర్ పర్సన్ చిలుముల లావణ్య,తహశీల్దార్ శ్రీనివాస్, ధర్మపురి దేవస్థానం అధ్యక్షులు జక్కు రవీందర్,క్రైస్తవ సంఘాల నాయకులు, ఫాస్టర్లు పాల్గొన్నారు.

## 'సుడా' ఆఫీసు భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ప్రజాపక్షం/కరీంనగర్:నూతనంగా నిర్మిస్తున్న శాతవాహన అర్బన్ డెవలాప్ మెంట్ (సుడా) కార్యాలయ భవన నిర్మాణం లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్‌లో శనివారం వన్ టౌన్ చౌరస్తా సమీపంలో శాతవాహన అర్బన్ డెవలాప్ మెంట్ భవన నిర్మాణం పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పిల్లర్, పూనాది నిర్మాణం పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫూల్ దేశాయ్ మాట్లాడుతూ, సుడా కార్యాలయ భవనాన్ని ఇచ్చిన డిజైన్ ప్రకారం నిర్మాణం చేయాలన్నారు.ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, సుడా డిఇ రాజేంద్రప్రసాద్, ఎఇ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు మార్కెటింగ్ మెళకువలు నేర్చుకోవాలి

సిద్దిపేట కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/ సిద్దిపేట : మహిళలు వ్యవసాయఉత్పత్తులు మార్కెటింగ్ మెలకువలు నేర్చుకొని ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ రంగంలో స్వయం సహాయక మహిళ సంఘాలను ప్రోత్సహించటం, అడ్వాన్స్ టెక్నాలజీ పరిశీలన కోసం నాబార్డు వారి ఆర్థిక సహాయంతో సోసైటిఫర్ కమ్యూనిటీ ఆర్గనైజింగ్ అండ్ పిపుల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా సమాఖ్య మండాలల మహిళ సమాఖ్య అధ్యక్షులు 25 మందిని మహారాష్ట్ర నాసిక్‌లో సయ్యాద్రి ఫామ్స్ లను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు మూడు రోజుల టూర్‌తో పర్యటించనున్న బృందం వాహనాన్ని శనివారం జిల్లా కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ మహిళ సమాఖ్య సభ్యులకు ఇదోక సువర్ణ అవకాశం అని నాసిక్‌లో గల సయ్యాద్రి ఫార్మర్స్ ప్రోడ్యూసింగ్ ఆర్గనైజేషన్ రైత ఉత్పత్తి దారుల సమైక్యద్వార వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చేసి ఆర్థికంగా ఏలా విజయం సాధించాలో ఈ క్షేత్ర స్థాయి పర్యటన ద్వారా ప్రతి విషయాన్ని క్లుప్తంగా నేర్చుకోవాలని తెలిపారు. ఆర్థికంగా ఎదగటం కోసం ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్‌డిఓ జైదేవ్ఆర్య, ఎల్డిఎం హరిబాబు. ఆదనపు డిఆర్‌డిఓ సుదీర్‌బాబు.డిపిఎం వాసుదేవ్. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు రేణుక తదితరులు పాల్గొన్నారు.

**22న జరిగే ప్రజావాణి నిర్వహించటం లేదు: కలెక్టర్**

ఈనెల 22న సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కలికంగా నిర్వహించటం లేదని జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. జిల్లా ప్రజలు గమనించి ప్రజావాణి కార్యక్రమం కోసం సోమవారం కలెక్టరేట్‌కు ఎవ్వరు రావద్దన్నారు.ఆతర్వాత సోమవారం నుండి యదావిధిగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

## రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

రవాణా, బిసి సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రోడ్డు భద్రత సామాజిక బాధ్యత అని రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు 2026 పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, రవాణా, ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేష్ ఎం భగవత్, జాతీయ రహదారుల, ఆర్టీసీ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖా అధికారులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం శనివారం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాలోని రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లాలోని ఆయా విద్య సంస్థల్లో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ ఇతర పోటీలు చేపడుతామని పేర్కొన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చిస్తామని వివరించారు. నేషనల్ హై వే, ఆర్ అండ్ బి, పిఆర్, పోలీస్, రవాణా శాఖా అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి, బ్లాక్ స్పాట్లు గుర్తిస్తామని, వాటి పరిష్కారానికి ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఎస్‌పి చంద్రయ్య, జిల్లా రవాణా శాఖా అధికారి లక్ష్మణ్, జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, పిఆర్ ఇఇ సుదర్శన్ రెడ్డి, ఆర్‌అండ్ బి డిఇ శాంతయ్య, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, జిల్లా వైద్యాధికారి రజిత, విద్య శాఖా అధికారులు, ట్రాఫిక్ పోలీస్ లు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి పుత్రికకు హరీశ్‌రావు చేయూత

మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : నిరుపేద విద్యార్థి వైద్య విద్య పిజి విద్యకోసం మాజీ మంత్రి హరీష్‌రావు తన ఇంటిని మార్టీగేజ్ చేయించి రుణం మం జూరు చేయించి వైద్య విద్యార్థి భవిష్యత్తుకు చే యూత అందించి మానవతాఔదార్యాన్ని చాటిచెప్పారు. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన కొంక రామంచంద్రం టైలరింగ్ వృత్తి చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన పెద్ద కుమార్తె మమత విజయవాడలో సిద్దార్థ మెడికల్ కళాశాలల్లో ఉచితంగా ఎంబిబిఎస్ సీటు సాధించి చదువు పూర్తి చేసింది. పిజి ఎంట్రన్స్ రాయగా మహబూబ్‌నగరలో ఎస్వీఎస్ మెడికల్ కళాశాలల్లో అస్తమాలజీ విభాగంలో పిజి సీటు వచ్చింది. ప్రభుత్వ కన్వీనర్ కోటాలోనే సీటు వచ్చినప్పటికి మూడేళ్లపాటు ప్రతి సంవత్సరం7.50లక్షల చొప్పున ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుదన్నారు. 19 చివరితేది గడవు ఉంది అర్థిక స్థోమత లేదని రామచం ద్రం అంత డబ్బు చెల్లించలేక మనోవేదనకు గురయ్యారు. బ్యాంకులో ఎడ్యూకేషన్ లోన్ కోసం ప్ర యత్నించగా ఏవైనఆస్తులు మార్టిగేజ్ చేస్తే రుణం ఇస్తామని బ్యాంకు అధికారులు సమాధానం ఇచ్చారు.

**హరీష్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు**

**పిజి విద్యార్థిని మమత:**మా అమ్మనాన్నలు కష్టపడి టైలరింగ్ చేస్తూ ఎంబిబిఎస్ దాక చదివించారని.. ఆహర్నిశలు శ్రమించటంతో పిజీ ఎంట్రన్స్‌లో సీటు దక్కిందని వైద్య విద్యార్థిని మమత తెలిపారు. ఉచితంగా సీటు వచ్చిన ప్రతియేట ట్యూషన్ ఫీజు 7.50 లక్షలు మూడేండ్లకు 22. 50 లక్షలు కట్టాలని చెప్పటంతో సీటు ఆసాధ్యమని అనుకున్నట్లు తెలిపారు.హరీష్‌రావు సిద్దిపేట కుఎమ్మెల్యేగాఉండటంఅందరి అదృష్టం అన్నారు.

## బిసి వాదాన్ని గెలిపించిన పెద్దపల్లి ప్రజలు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సర్పంచ్ ఎన్నికలలో 63 శాతం బిసి సర్పంచులతో పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం బిసిల రాజకీయ స్ఫూర్తికి సాంకేతమని బిసి సామాజిక ఉద్యమకారుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరు శ్రీమన్నారాయణతో పాటు బిసి సామాజిక విశ్లేషకులు కవి రచయిత మంద భాస్కర్ యాదవ్ అన్నారు. శనివారం పెద్దపల్లి బిసి భవన్‌లో స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ ఎన్నికలు బిసిల రాజకీయ చైతన్యంతో పాటు సంఘటిత శక్తిని ప్రస్తుతించిందని, ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో ఆధిపత్య కులాల రాజకీయ శక్తులపై పోరాడి 165 గ్రామపంచాయతీ సర్పంచుల స్థానాలను బిసిలు గెలుపొందడం బిసి వాదం గ్రామస్థాయికి ఎంత లోతుగా వెళ్లిందో ఈ ఎన్నికలు నిరూపించాయని వారు పేర్కొన్నారు. జిల్లాలో133 జనరల్ స్థానాలలో 96బిసి సర్పంచులు గెలవడం ఆశామాషి వ్యవహారం కాదని, బిసి రిజర్వేషన్లు అయిన 69 సర్పంచ్లను కలుపుకొని జనరల్ స్థానాల్లో 96 బిసిల గెలుపు బాటతో 165 మంది సర్పంచులు పెద్దపల్లి జిల్లాలో గ్రామ స్వరాజ పాలన దిశలో గెలుపు బాటలో ప్రయాణించారని అన్నారు.భవిష్యత్తు రాజకీయాలలో సామాజిక ఆర్థిక రాజకీయ లలో బిసిలకు మార్గము సుగమయిందని, చట్టసభలలో ప్రవేశించేందుకు పంచాయతీరాజ్ ఎలక్షన్లు సామాజిక రాజకీయ మార్పుకు దోహదం చేశాయని తాడూరి శ్రీమన్నారాయణ ,మంద భాస్కర్ యాదవులు పేర్కొన్నారు.

## సహకార సంఘం ఇన్‌చార్జ్ అధికారిగా సురేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పిఏసిఎస్) ఇన్‌చార్జిగా పి. సురేందర్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ సహకార సంఘం సింగల్ విండో చైర్మన్, డైరెక్టర్లను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో సహకార సంఘం ఇన్‌చార్జిగా సురేందర్ రెడ్డిని ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. కాగా నూతనంగా బాధ్యతలు స్వీకరించి సురేందర్ రెడ్డికి కార్యనిర్వహణ అధికారి దాసరి ప్రసాద్‌గౌడ్‌తో పాటు సిబ్బంది ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.

## కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఉన్న పాలకవర్గాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో కెడిసిసిబి పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు.

## హైలెవల్ నిర్మాణానికి రూ.203 కోట్ల నిధులు మంజూరు

రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు వెల్లడి



ప్రజాపక్షం/ముత్తారం : మంథని నియోజకవర్గంలోని మంథనిఅరేంద మానేరుపై మీదుగా దామెరకుంట వరకు హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆర్ అండ్ బి శాఖ నుండి రూ.203 కోట్ల నిధులను మంజూరు చేసినట్లుగా రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు వ్యక్తిగత సహాయకులు చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో ప్రకటించారు. మంథని మండలములోని ఆరెంద మీదుగా దామెరకుంట వరకు 1.120 మీటర్ల పొడవు 13 మీటర్ల వెడల్పుతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, ఆరెంద, మల్లారం, వెంకటాపూర్ నుండి బ్రిడ్జి వరకు అటు సైడు దామెరకుంట రోడ్డు వరకు 9.530 మీటర్ల అప్రోచ్ రోడ్డుకు రూ.203 కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్ బి శాఖ ద్వారా మంజూరైనట్లుగా తెలిపారు.మంథని మండల ప్రజలు, ఇతర మండలాల ప్రజలు మానేరు బ్రిడ్జి దాటి ఇతర జిల్లాలకు, మహారాష్ట్రకు, కాళేశ్వరం దేవాలయానికి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ఇతర ప్రదేశాల ప్రజలకు సౌకర్యాలు ఉంటాయన్నారు. మంథని, పెద్దపల్లి జిల్లా వారికి కాళేశ్వరం వెళ్ళడానికి 25 కిలోమీటర్ల వరకు దూరం తగ్గుతుందని తెలిపారు. కాళేశ్వరం టూరిజం డెవలప్మెంట్ కూడా పెరుగుతుందని, మహారాష్ట్ర ఇతర ప్రదేశాలకు వెళ్లడానికి చాలా వీలు ఉంటుందని వెల్లడించారు.జయశంకర్ భూపాలపల్లి కాటారం వెళ్లడానికి వీలు ఉంటుందని, ఆరెంద, మల్లారం, వెంకటాపూర్, దామెరకుంట ఈ గ్రామాలలో ప్రజలకు రవాణా పరంగా వైద్య, విద్య పరంగా చాలా ఉపయోగపడుతుంది అన్నారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. మానేరు పై బ్రిడ్జి అరెంద మీదుగా దామెరకుంట నిర్మాణానికి రూ.203 కోట్ల నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల, ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## బుగ్గగూడ అటవీ శివారులో పెద్దపులి సంచారం

**ప్రజాపక్షం/కాసిపేట:**కాసిపేట మండలం బుగ్గగూడ అటవీ శివారు ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తోందని బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సిహెచ్ పూర్ణచందర్ తెలిపారు. శనివారం అటవీ శాఖ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి పులి పాదముద్రలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తరచుగా పులి సంచరిస్తున్నందున పశువుల కాపరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని ఆయన హెచ్చరించారు. చేనులలో పనులకు వెళ్లే వారు ఒంటరిగా వెళ్లకుండా గుంపులుగా ఉంటూ శబ్దాలు చేస్తూ వెళ్లాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీ శాఖ అధికారికంగా తెలిపే సమాచారాన్ని తప్ప ఇతరులు చెప్పే పులి సంచార వార్తలను నమ్మవద్దని సూచించారు. బుగ్గగూడ, లంబడి తండ (డి), కార్సెలఘుట్టం గ్రామాల్లో పులి సంచారంపై ఇప్పటికే చాటింపు వేయించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్, ధర్మారావుపేట ఎఫ్ఎస్ఓ యుగంధర్, ఎఫ్‌బిఓ కుమారస్వామి, వాచర్ పోచం పాల్గొని పులి పాదముద్రల ఆనవాళ్లను సేకరించారు

## ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :**ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం మరోసారి పరాకాష్టకు చేరింది. విధుల్లో ఉండి రోగులను పర్యవేక్షించాల్సిన నర్సులు వార్డుల్లో రోగులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోకుండా స్టాఫ్ రూమ్‌లో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేస్తూ ఫొటో సెషన్లలో మునిగిపోయిన ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు బయటకు రావడంతో జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేగుతోంది. ప్రతి నిమిషం రోగుల ప్రాణాలు కాపాడటం కోసం అప్రమత్తంగా ఉండాల్సిన సిబ్బంది ఆసుపత్రిలోనే పార్టీలు చేసుకోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకంతో వచ్చే పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన ఆరోగ్య విభాగంలోని వైఫల్యానికి అద్దం పడుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన నర్సులపై తక్షణమే విచారణ జరిపి వారిని సస్పెండ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ వాంకిడి / ఆసిఫాబాద్ :**శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి నితికా పంత్ హెచ్చరించారు. శనివారం వాంకిడి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రతను పరిశీలించారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ మహేందర్, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రాత్రిపూట పర్యవేక్షణ, పికెటింగ్, పెట్రోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సిఐ సత్యనారాయణ, ఎస్ఐ పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్, ఉప సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే కోవాలక్ష్మి




**ప్రజాపక్షం/ తిర్యాని :**గడలపల్లి గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన ఆత్రం శంకరమ్మ పాండు, ఉప సర్పంచ్ సోయం కట్టిలను ఎమ్మెల్యే కోవా లక్ష్మి శనివారం ఘనంగా సన్మానించారు. వారితో పాటు వార్డు సభ్యులు కనక సూరు, ఆత్రం మారుతీ, వేడ్మా శిరీష ధర్మారావులను కూడా ఆమె గౌరవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి కీలకమని పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు సమగ్రమైన సేవలు అందించాలని ఆమె సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి పని చేయడం ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడావి గుణవంత్ రావు, బిఆర్ఎస్ నాయకులు వేడ్మా జంగు, సిడాం బాలు, కాట్లే యస్వంత్ రావు, కాట్లే రాజు, కొట్నాక జంగు, కార్పెత తుకారం, కుడ్మేత జైవంత్ రావు పాల్గొన్నారు. అలాగే దశ్రు బాయి, కౌసల్య బాయి, పావని, రాం బాయి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్ ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**సోమవారం జిల్లాలో నిర్వహించబోయే విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ ఏర్పాట్లను పలువురు అధికారులు పరిశీలించారు.జిఎన్ఆర్ కాలనీ లో సోమవారం విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించారు.ఎక్సర్సైజ్ నిర్వహణ కు అన్ని తగిన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని అధికారులు తెలిపారు.జిఎన్ఆర్ కాలనీ తో పాటు పలు ప్రాంతాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ ఏర్పట్ల పరిశీలనలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు ప్రభాకర్,శివాజీ,సిపిఒ జీవరత్నం,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,తహసిల్దార్ రాజు,స్వాతి,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు ఎంపిడిఓల అభినందనలు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**జిల్లాలో ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ ను అన్ని మండలాల ఎంపిడిఒలు శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అభినందించారు.ఎంపిడిఒలు పుష్పగుచ్చాలను అందిస్తూ,శాలువలతో సన్మానించారు.అలాగే,బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌ను కూడా ఎంపిడిఒలు శాలువాతో సన్మానించారు.మూడు దశల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎక్కడా ఇబ్బందులు లేకుండా,ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని ఎంపిడిఒలు పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో అధికారులకు కలెక్టర్ ఇచ్చిన ప్రోత్సాహం గొప్పదని,కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని వారు అభిప్రాయపడ్డారు.అందరి సహకారంతో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందనిఎంపిడిఒలను కలెక్టర్ అభినందించారు.కార్యక్రమంలో ఎంపిడిఒలు లక్ష్మి కాంత్,గజానన్,నీరజ్ కుమార్,రాధ,అరుణ,రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 68వ అర్బన్ ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం

### పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల





**ప్రజాపక్షం/భీమ్‌గల్:**క్రీడలతో క్రమశిక్షణ, ఆరోగ్యం అలవడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం 68వ అర్బన్ స్థాయి క్రీడా పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థుల క్రీడా వందనాన్ని స్వీకరించి మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి క్రీడా పోటీలలో పాల్గొనటంతో వారిలో క్రమశిక్షణ, ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని పాల్గొన్న ప్రతి జట్టు సమిష్టి కృషితో విజయం సాధించేలా ప్రయత్నం చేయాలన్నారు. మార్చి ఫస్ట్‌లో గెలుపొందిన జట్టుకు మెమోంటోను అందజేశారు. క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణ మాట్లాడుతూ పోటీలలో మొత్తం 11 జట్లు పాల్గొంటున్నాయని, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షబ్బీర్, మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్, ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఎంఈఓ స్వామి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సాగర్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు, సర్వసమాజ్ కమిటీ అధ్యక్షులు రవి, కృషి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**గౌర్రె శ్రీ చందనను సన్మానించిన వేముల:** ఇస్రోలో ఉద్యోగం సాధించిన మండలంలోని జాగిర్యాల్‌కు చెందిన గౌర్రె శ్రీచందనను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శాలువతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. అతి చిన్న వయస్సులో ఇస్రో లాంటి సంస్థలు జూనియర్ సైంటిస్ట్‌గా ఉద్యోగం సాధించడం నేటి యువతకు శ్రీ చందన ఆదర్శమన్నారు. చిన్న పల్లెటూరు నుండి తన విద్యాభ్యాసన ప్రారంభించి బిటెక్ పూర్తి చేయటంతోనే నేరుగా ఉద్యోగం సంపాదించిందంటే కేవలం తన పట్టుదలే కారణమన్నారు. బిటెక్ చదువు తుండగానే గేట్ ఎగ్జామ్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 302 ర్యాంకు సాధించిందన్నారు. ప్రతిఒక్కరూ పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీకాంత్, రాజు, రాజమల్లు, రాజేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పై ప్రజల్లో విశ్వాసం.. భారీగా చేరికలు

డిసిప్రెసిడెంట్ ఆత్రం సుగుణక్క



**ప్రజాపక్షం/వాంకిడి/ఆసిఫాబాద్:** కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెరిగినందుకే గ్రామస్థాయి నాయకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కనార్ ఘాం గ్రామ సర్పంచ్ కొట్నాక భీంరావ్ పలువురు వార్డు సభ్యులు శుక్రవారం రాత్రి ఆమె సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరై వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సర్పంచ్ కొట్నాక భీంరావ్ ఉపసర్పంచ్ జీవన్ వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గ్రామీణ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై నమ్మకంతోనే ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, సీనియర్ నాయకులు గంగారం మెంగజీ, ఉప సర్పంచ్ విజయ్, గ్రామ పటేల్ శ్యాంసుందర్, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వరి నారుపై చలి ఎఫెక్ట్

వేసంగి వరి వంగడాలపై రైతులు దృష్టి సారించాలి

తక్కువ సమయంలో వచ్చే వరి వంగడాలు రైతులకు మేలు

చలి నుంచి కాపాడుకుంటే దిగుబడికి ఢోకాలేదు



**ప్రజాపక్షం/ఎడపల్లి:**వాతావరణంలో నెలకొన్న అనిశ్చిత మార్పులు, వర్షాభావ పరిస్థితులు, సాగునీటి సమస్య, చీడపీడల దాడులు, కూలీల కొరత ఇవన్నీ వరి సాగుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక, ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతన్నలు విలవిలలాడుతున్నారు. దీనికి తోడు ఈ యేడు రబీలో వేసుకున్న వరినారుకు చలి ప్రభావం ఎక్కువ ఉండటం వల్ల నారు ఎదగలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువ స్థాయికి పడిపోవడంతో చలికి వరినారు పెరగకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. ఎడపల్లి మండలంలో సుమారు 12వేల నుంచి 13వేల ఎకరాలలో వరి సాగవుతుందని ఎఓ సిద్ధిరామేశ్వర్ తెలిపారు. చలి పెరిగిన దృష్ట్యా నారుమడి స్థాయిలో సమస్యలను పరిష్కరించకోకపోతే వరి సాగుకు ఇబ్బందులు ఎదురవ్వడం ఖాయమన్నారు. వరినారుమడులు కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వేసంగిలో నవంబర్ 15కు ముందు వరినారులు పోసుకోరాదని, ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తగ్గినప్పుడు వరి నారు ఎదగడం తగ్గిపోయి పంటకాలం పెరిగిపోతుంది. ఇలాంటి సమయాల్లో రైతులు ఆలోచించి స్వల్ప కాలిక వంగడాలైన బతుకమ్మ, ఆర్ఎన్నార్ రకాలను సాగుకు ఎంచుకోవాలన్నారు. చలి ఎక్కువవడంతో వరినారు సరిగా ఎదగక ఎర్రబడి ఎండిపోతుంది. దీనికి నారుమళ్లపై సాయంత్రం ఆరు తరువాత పాలిథిన్ కవర్లు గాని యూరియా సంచులను గాని కప్పి మరుసటి రోజు ఉదయం తొలగించాలని తెలిపారు. రాత్రి పూట మంచు కురియడంతో వరినారుపై పడ్డ నీటిని మరుసటి రోజు కర్రతో తొలగిస్తే చలి ప్రభావం చాలా తక్కువగా ఉంటుంది. నారు మడుల్లో రాత్రి పూట నీటిని నిండుగా పెట్టి ఉదయం పూట నీటిని తొలగించి కొత్త నీటిని పెట్టడం వల్ల చలి దాటికి నారును రక్షించబడిన వారవుతారన్నారు. నారు మడి తయారు చేసే సమయంలో మడిలో పశువుల పేడ, మేకల ఎరువులతో పాటు మరికొన్ని ఎరువులను దుక్కిలో వేసుకోవడంతో చీడపీడలతో రక్షించుకోవడంతో పాటు చలిబారి నుంచి కాపాడుకోవచ్చన్నారు.

## వైమానిక దళ పరేడ్‌ను వీక్షించిన 'గీతం' విద్యార్థులు



**ప్రజాపక్షం/ పటాన్‌చెరు:** భారత వైమానిక ధళ అదికారుల ప్రతిష్టాత్మక గ్రాడ్యుయేషన్ వేడకను వీక్షించే అరుదైన అవకాశం హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు కలిగింది. భారత వాయుసేన గీతం మద్య ఉన్న అవగాహన ఓప్పందం మేరకు దుండిగల్ ఎయిర్ ఫోర్స్ ఆకాడమీ గీతం విద్యార్థులు సందర్శించారు. ఈ పర్యటనను ప్రోషెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ సమన్వయం చేశారు. గీతం హైదరాబాదు నుంచి 35 మంది విద్యార్థులు ఐదుగురు అద్యాపకులతో కూడిన ప్రతినిధి బృందం అధికారిక గ్రాడ్యుయేషన్ పరేడ్ కు హాజరయ్యారు. ఆ తరువాత నిర్వహించిన అద్భుతమైన ఎయిర్ పోను ఆస్వాదించారు. భారత వైమానిక ధళం యొక్క క్రమశిక్షణ ఖచ్చితత్వం , వృత్తి నైపుణ్యం ఆదునాతన సాంకేతిక సామర్థ్యాల గురించి విద్యార్థులు స్ఫూర్తిదాయకమైన ప్రత్యేక అనుభవాన్ని పొందారు.

దీనిని విద్యార్థులకు జీవితకాల అనుభవంగా ప్రొఫెసర్ పర్వేకర్ అభివర్ణించారు. యువ మనస్సులను తీర్చిదిద్దడంలో ఇటువంటి సంస్థాగత సహకారాల విలువను ఇది పునర్ధుటించిందని ఆమె అభిప్రాయపడ్డారు. అనుభవపూర్వక అభ్యాస అవకాశాలను అందించడంలో ప్రముఖ జాతీయ రక్షణ సంస్థలతో దాని అనుబంధాన్ని బలోపేతం చేయడంలో గీతం యొక్క నిబద్ధతకు ఈస సందర్శన నిదర్శకంగా నిలుస్తుంది.

## క్లెయిమ్ చేయని డబ్బు ఖాతాదారులకే: కలెక్టర్



**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిదిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులను నిజమైన ఖాతాదారులకు అందించడమే లక్ష్యంగా మీ డబ్బు మీ హక్కు అనే ప్రత్యేక జాతీయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. కార్యక్రమాన్ని శనివారము సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ,అదనపు కలెక్టర్ మాదురి ,బ్యాంక్ అధికారులతో కలసి ప్రారంభించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేయని డిపాజిట్లు దీర్ఘకాలంగా చెల్లింపులు లేని నగదు వంటి ఆర్థిక ఆస్తులను చివరి ఖాతాదారుల వరకు పూర్తిగా చెల్లించాల్సిన బాద్యత సంబందిత సంస్థలదేనని స్పష్టం చేశారు. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బు వారికి చెందాల్సిందేననా జిల్లాలోని 17 బ్యాంకుల్లో మొత్తం 2,36,123 ఖాతాలకు సంబందించిన రూ. 51.07 కోట్ల విలువైన క్లెయిమ్ చేయని ఆస్తులు ఉన్నాయని అక్టోబర్ మాసం నుంచి ఇప్పటి వరకు సుమారు రూ. 2 కోట్లను ఖాతాదారులకు చెల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 2025 అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. క్లెయిమ్ చేయని పొదుపు డిపాజిట్లు, షేర్లు, డెవిడెండ్లు, మ్యూచునల్ ఫండ్లు,భీమా పాలసీలు తదితర ఆర్థిక ఆస్తులపై ప్రజలకు అవగాహన కల్పించి వాటిని సులభంగా క్లెయిమ్ చేసుకునే అవకాశాన్ని కల్పించడమే ఈకార్యక్రమం ప్రధాన లక్ష్యమని సంగారెడ్డి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ్‌రావు, తెలిపారు. బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేయని డిపాజిట్లు వివరాలను ఆర్‌బిఐ నిర్వహిస్తున్న ఉద్గమ్ వెబ్‌సైట్ https// udggamrbi.org.in // ద్వార తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఐ ఏజిఎంఎంజెడ్, రెహమాన్, ఎండి సిపిబి సిఈవో ఎం శ్రీనివాస్ యుబిఐ ఏజిఎం బి శ్రీనివాస్ వివిద బ్యాంకుల సిబ్బంది వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో వేలంపాట వాయిదా

**ప్రజాపక్షం/పాపన్నపేట:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవాని దేవస్థానం నందు సంవత్సర కాలం పాటు కొబ్బరికాయలు, పూజ సామాగ్రి, ఎగ్జిబిషన్ ఒడి బియ్యంకు బహిరంగ వేలం పాటలు సరైన పాట రానందుకు రద్దు చేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఇఒ చంద్రశేఖర్ లు వెల్లడించారు. శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో వివిధ క్రయ విక్రయాల సీల్, బహిరంగ వేలం పాట నిర్వహించారు. గతంలో వేలం పాటలద్వారా వచ్చిన సొత్తు కు సరైన పాట రానందుకు వేలం పాటలు నిలిపి వేయనునట్లు వారు వెల్లడించారు. కాగా గత రెండు పర్యాయాలు వేలం పాటలు నిర్వహించిన గుత్తేదారు లు వేలం పాటలు పాడేందుకు ముందుకు రాక పోవడంతో వేలం పాటలు వాయిదా వేస్తున్నారు. ఇటీవల సుమారు 80 రోజుల పాటు వరదలు రావడంతో ఆలయ మూసివేశారు.. దీంతో ప్రస్తుతం ఉన్న గుత్తేదారులందరూ నష్టాలలోకి వెళ్లిపోయారు. అంతేకాకుండా భక్తులకు సరైన సౌకర్యాలు లేకపోవడంలో భక్తుల సంఖ్య తగ్గినట్లు గుత్తేదారులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న గుత్తేదారుల డిసెంబర్ 31 నాటికి వారి కాల పరిమితి ముగుస్తుంది.. ఇప్పటికే కొత్త కాంట్రాక్టర్ల ప్రక్రియ పూర్తి కావాల్సినప్పటికీ వాయిదాల మీద వాయిదాలు పడుతున్నాయి.

# రోడ్డు ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు

### బ్లాక్ స్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్:**రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బంధీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు డిసిపిబస్వారెడ్డి, ఇతర అధికారులతో కలిసి నగర శివారులో తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాక్లూర్ మండలం మానిక్‌భండార్ చౌరస్తా సమీపంలోని సుఖ్‌జిత్ స్టార్చ్ మిల్ వద్ద బోధన్ రోడ్డులోని ఎన్ఎన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ ఎదురుగా గల ప్రధాన రహదారులను సందర్శించారు. పై ప్రదేశాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగేందుకు గల కారణాలపై పోలీస్, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, రవాణా తదితర శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ముఖ్యంగా బోధన రోడ్డు, ఎన్ఎస్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ వద్ద గడిచిన 3 సంవత్సరాల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదాలలో 19 మంది ప్రాణాలు కోల్పోవటం జరిగిందని ఈ సందర్భంగా ప్రమాదాల తీవ్రతపై కలెక్టర్ ఒకింత ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాద ఘటనలో అత్యధిక మరణాలు చోటు చేసుకున్న వాటిలో జిల్లాలోని ఈ ప్రాంతం 20వ స్థానంలో ఉందన్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రోడ్డు ప్రమాదాల నివారణ కోసం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రదేశాలలో రోడ్లకిరువైపులా ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు జరిపించాలని ఆర్అండ్‌బి, పోలీస్ అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలన్నారు. మానిక్‌భండార్ సమీపంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా గల అన్ని రహదారులపై బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రదేశాలలో ప్రమాదాలను నియంత్రించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మూలమలుపులు, కల్వర్టులు, ఎత్తు పల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగ్గా లేకపోవటం వంటి వాటిని సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారమున్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్టీసీ బస్ డ్రైవర్లు సహా, ఇతర ప్రైవేట్ వాహనాల ఆపరేటర్లకు రోడ్డు భద్రతా ప్రమాణాలను విధిగా పాటించేలా ట్రాఫిక్ నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. బ్లాక్ స్పాట్లను పరిశీలించిన అధికారుల బృందంలో నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ, ఎంవిఐ శ్రీనివాస్, ఆర్అండ్‌బి అధికారి ప్రవీన్, ఈదార్ మేనేజర్ హర్ష ఉన్నారు.

# రీల్

# 25న ‘వృషభ’



మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తున్న మూవీ ‘వృషభ’. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తోంది. ఈ నెల 25 ‘వృషభ’ సినిమా థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ చిత్రాన్ని కన్నెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిలింస్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మిస్తున్నారు. విమల్ లహోటి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ‘వృషభ’ సినిమాను దర్శకుడు నందకిషోర్ మలయాళం, తెలుగులో రూపొందించారు. తాజాగా ‘వృషభ’ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ‘వృషభ’ సినిమా ట్రైలర్ ఎలా ఉందో చూస్తే బిజినెస్ మ్యాన్ ఆఫ్ ది సెంచరీగా పేరు తెచ్చుకుని వ్యాపార రంగంలో ఖ్యాతి సంపాదిస్తాడు ఆదిదేవ వర్మ (మోహన్ లాల్). ఈ లెజెండరీ బిజినెస్ మ్యాన్ కు శత్రువులు ఎక్కువే. కెరీర్‌లో తిరుగులేని ఆదిదేవ వర్మ మానసికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటాడు. అతనికి తన గత జన్మ జ్ఞాపకాలు గుర్తుకువస్తుంటాయి. ఆ జ్ఞాపకాల్లో రాజా విజయేంద్ర వృషభ (మోహన్ లాల్) అసమాన యోధుడిగా తన సామ్రాజ్యాన్ని, ప్రజల్ని కాపాడుకుంటూ ఉంటాడు. ఆదిదేవ వర్మ కొడుకు (సమర్జీత్ లంకేష్) సైకియాట్రిస్టులతో సంప్రదింపులు చేస్తూ, శత్రు దాడుల నుంచి తండ్రిని కాపాడుకుంటూ ఉంటాడు. ఆదిదేవ వర్మను వెంటాడుతున్నవి పునర్జన్మ జ్ఞాపకాలేనా, ఆ జ్ఞాపకాల్లోని రాజా విజయేంద్ర వృషభ గొప్పతనం ఏంటి, ఈ గతాన్ని, ఈ వర్తమానాన్ని కలుపుతూ కథ ఎలాంటి మలుపులతో సాగింది అనేది ట్రైలర్‌లో ఆసక్తి కలిగించింది.




# ‘ఈషా’ వార్నింగ్ వీడియో విడుదల

హార్రర్ సినిమా ఈషా విడుదలకు సిద్ధం అవుతోంది. బన్నీవాస్, వంశీ నందిపాటి కలిసి ‘ఈషా’ ఓహారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్నిడిసెంబరు 25న చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. అఖిల్‌రాజ్‌తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బా పటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేవీఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది తెలిసిందే.. ముఖ్యంగా ఈ చిత్రంలో ఉండే సడన్ ట్విస్ట్‌లను, హారర్ సీన్స్‌ను హార్ట్‌వీక్‌గా ఉన్న వాళ్లు చూడకూడదని మేకర్స్ నుంచి వార్నింగ్ కూడా వచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ చిత్ర నిర్మాతలు ‘ఈషా’ వార్నింగ్ పేరిట శనివారం మరో వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోను గమనిస్తే.. ఇప్పటి వరకు వచ్చిన హారర్ థ్రిల్లర్ జానర్లో వార్నింగ్ పేరిట ఇలాంటి వీడియోను విడుదల చేయడం ఇదే తొలిసారి. ఇదొక ఆసక్తికరమైన పాయింట్‌తో అల్లుకున్న భయపెట్టే కథ అనిపిస్తుంది. మీరు ఊహించని చీకటి ప్రపంచం మరొకటి ఉంది అని ట్రైలర్‌లో భయపెట్టిన ఈ చిత్ర దర్శకుడు ఈ వార్నింగ్ వీడియోలో మనుషుల్లాగే కొన్నిస్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. తరువాత అవి క్రమంగా ఆత్మలకు నిలయాలుగా మారుతాయి అంటూ ఈ తాజా వీడియోలో వార్నింగ్ ఇస్తున్నాడు. దెయ్యాలు, ఆత్మలు ఇలాగే ఉంటాయెమో అంటూ సిరి చెప్పే డైలాగ్.. అందరిని ఒక్కసారిగా ఆత్మల గురించి అందరి మదిలో మెదిలేటట్టు చేస్తుంది. ఆత్మలు లేవని బలంగా నమ్మే స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎక్స్ పోజ్ చేయడానికి బయలుదేరిన వీరికి, బబ్లూ పృథ్వీరాజ్ రూపంలో ఒక సవాలు ఎదురవుతుంది. ‘ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..’ అంటూ ఆయన విసిరే ఛాలెంజ్‌తో వీరు ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడతారు. సైన్స్‌కు, అతీంద్రియ శక్తులకు మధ్య జరిగే క్లాష్ దీన్ని ఆసక్తికరంగా మలిచారు. ట్రైలర్‌లోని విజువల్స్ చాలా వరకు బ్లూ అండ్ డార్క్ థీమ్‌లో సాగాయి. ముఖ్యంగా ఆ పాడుబడిన బంగ్లా, అక్కడ నేల మీద వేసి ఉన్న యంత్రాలు, క్షుద్ర పూజల సెటప్ సినిమాలోని మూడ్‌ని ఎలివేట్ చేశాయి. కెమెరామెన్ సంతోష్ లైటింగ్ వాడిన విధానం, దానికి ఆర్‌ఆర్ ధృవన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తోడై కొన్ని చోట్ల ఉలిక్కిపడేలా చేశాయి.



# ‘సన్ ఆఫ్’ టీజర్ రిలీజ్

సాయి సింహాద్రి సైన్మా పతాకంపై నిర్మాత సాయి సింహాద్రి హీరోగా నటిస్తూ నిర్మించిన చిత్రం సన్ ఆఫ్. బత్తల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సీనియర్ నటుడు వినోద్ కుమార్ కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సతీష్ మాట్లాడుతూ.. వినోద్ కుమార్ నటించిన ‘మామ గారు’ చిత్రం లాగా ఈ సినిమా కూడా ఉండిపోతుంది. నేను చెప్పిన ప్రతి సన్నివేశానికి ఆయన ఒప్పుకుని ఎంతో సపోర్ట్ చేసి నటించారు. మా హీరో సాయి సింహాద్రి కూడా నన్ను నమ్మి అమెరికా నుంచి వచ్చి ఈ సినిమా చేశారు. కొడుకు తండ్రి మీద ఎందుకు కేసు వేశాడు అనేది చాలా స్ట్రాంగ్‌గా చూపించాం అన్నారు హీరో సాయి సింహాద్రి మాట్లాడుతూ... ‘ఎప్పటి నుంచో ఇలాంటి కథను తెర మీద చూపించాలి అని వుంది. ఈ కథ రియల్ లైఫ్‌లో నాకూ, మా నాన్నకు కనెక్ట్ అవుతుంది. నటుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ.. సన్ ఆఫ్ మూవీ ఒక రెగ్యులర్ ఫార్మాట్ సినిమా కాదు.. ఇది స్క్రీన్ ప్లే బేస్డ్ మూవీ. రెగ్యులర్ లైఫ్‌లో ఓ తండ్రి, కొడుకుల మధ్య సాగే స్టోరీ ఇది. ఇందులో హీరోగా నటించిన సాయి సింహాద్రి ఎక్కడో పర్లాకిమిడిలో చదివి... అమెరికాకు వెళ్ళి అక్కడి నుంచి వచ్చి ఈ సినిమా తీశారు. ఇది గ్రేట్ అచివ్ మెంట్. దర్శకుడు సతీష్ 45 నిమిషాలు స్టోరీ నెరేషన్ చేశారు.

# మోదీ బయోపిక్ ‘మా వందే’ ప్రారంభం



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బయోపిక్‌ను ‘మా వందే‘ టైటిల్‌తో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్ వీర్ రెడ్డి.ఎం. ఈ చిత్రంలో నరేంద్ర మోదీ పాత్రలో మలయాళ స్టార్ హీరో ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్థ ఘటనల ఆధారంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు క్రాంతికుమార్. సీహెచ్. ‘మా వందే’ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా శనివారం ప్రారంభమైంది. రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలుపెడుతున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాలన్నీ ఎంతో సహజంగా ‘మా వందే’ సినిమాలో చూపించబోతున్నారు ‘మా వందే’ చిత్రాన్ని పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లీష్‌లోనూ రిలీజ్ చేయనున్నారు. ఎన్నో పోరాటాల కన్న తల్లి సంకల్పం గొప్పదనే సందేశం ‘మా వందే’ చిత్రంలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది.



# ‘బొమ్మ హిట్’ షూటింగ్ షురూ

చైల్డ్ ఆర్టిస్టుగా పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన అభినవ్ మణికంఠ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ‘బొమ్మ హిట్’. ఈ చిత్రాన్ని అంజనీపుత్ర ఫిలింస్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెంబర్ 1గా గుర్రాల సంధ్యారాణి నిర్మిస్తున్నారు. బొమ్మ హిట్ చిత్రంతో రాజేష్ గడ్డం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పూజా యడం హీరోయిన్‌గా నటిస్తోంది. కాగా ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో అభినవ్ మణికంఠ మాట్లాడుతూ.. ఇది హీరోగా నాకు రెండో సినిమా. ఫస్ట్ ఫిలిం వర్క్స్ జరుగుతున్నాయి. నేను నటించిన ర్యాంబో ఇన్ లవ్ వెబ్ సిరీస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ‘బొమ్మ హిట్’ సినిమా మంచి ఎంటర్‌టైన్ మెంట్‌తో సిచ్యువేషనల్ కామెడీతో వినోదాన్ని ఇస్తుంది. ఈ చిత్రంలో ఫన్‌తో పాటు మంచి ఎమోషన్ కూడా ఉందన్నారు. డైరెక్టర్ రాజేష్ గడ్డం మాట్లాడుతూ.. బొమ్మ హిట్ మూవీతో నేను దర్శకుడిగా టాలీవుడ్‌లోకి వస్తుండటం సంతోషంగా ఉంది అన్నారు.నిర్మాత గుర్రాల సంధ్యారాణి మాట్లాడుతూ.. మా అంజనీపుత్ర ఫిలింస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్ 1గా బొమ్మ హిట్ సినిమాను నిర్మిస్తున్నామని తెలిపారు. నటుడు మురళీధర్ గౌడ్, హీరోయిన్ పూజా యడం, నటుడు హైపర్ ఆది, నటుడు జబర్దస్త్ అవినాశ్ మాట్లాడారు.


# ‘గుర్రం పాపిరెడ్డి’ సక్సెస్ మీట్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన సినిమా ‘గుర్రం పాపిరెడ్డి’. ఈ చిత్రాన్ని డా.సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించారు. దర్శకుడు మురళీ మనోహర్ రూపొందించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా సక్సెస్‌మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత వేణు సద్ది మాట్లాడుతూ.. గుర్రం పాపిరెడ్డి సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు అని చెప్పారు. ప్రొడ్యూసర్ అమర్ బురా మాట్లాడుతూ.. నేను ఈ సినిమా చేయడానికి సపోర్ట్‌గా నిలిచిన వారు వేణు, సంధ్య, జయకాంత్. వారు లేకుంటే ‘గుర్రం పాపిరెడ్డి’ సినిమా మీ ముందుకు వచ్చేది కాదని అన్నారు. ప్రొడ్యూసర్ జయకాంత్ (బాబీ), మ్యూజిక్ డైరెక్టర్ కృష్ణ సౌరభ్, యాక్టర్ వంశీధర్ కోసిగి, రాజ్ కుమార్ కసిరెడ్డి, జీవన్ కుమార్, డైరెక్టర్ మురళీ మనోహర్, హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, హీరో నరేష్ అగస్త్య పాల్గొన్నారు.



# ఇండియన్ యాక్టర్స్ అని పిలవాలి

## షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నాజర్



ఐమ్యాక్స్ థియేటర్లలో జరుగుతున్న హైదరాబాద్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నటుడు నాజర్ సందడి చేశారు. ఫెస్టివల్ రెండోరోజు ఐమ్యాక్స్‌కు వచ్చిన నాజర్ పలు సినిమాలు కూడా చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమిళ నటులు, తెలుగు నటులు విదేశాలకు వెళ్లినప్పుడు మీరు బాలీవుడ్ నటులా? అని అడుగుతున్నారు. ఇది సరైంది కాదని అన్నారు. ఇండియాన్ సినిమాలో నటిస్తున్న మనల్ని ఇండియన్ యాక్టర్స్‌గా నిలవాలని అన్నారు. అలా పిలిస్తేనే మనకూ గౌరవం అని ఆయన పేర్కొన్నారు. హాలీవుడ్ వచ్చేవి అన్ని మంచి సినిమాలు కావన్నారు. అద్భుతమైన షార్ట్ ఫిలింస్ వచ్చాయన్నారు. కమర్షియల్ సినిమాల కంటే షార్ట్ ఫిలిమ్స్ చాలా బాగున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు ఉమా మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రమాదంలో పర్యావరణం’ పుస్తకావిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణపై జన్నారం ఎఫ్‌డిఒ ఎం.రామ్మోహన్ రచించిన ‘ప్రమాదంలో పర్యావరణం’ పుస్తకాన్ని అటవీ దళాల ముఖ్య సంరక్షిణాధికారిణి (పిసిసిఎఫ్) చి.సువర్ణ శనివారం ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న బుక్ ఫెయిర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. పర్యావరణానికి సంబంధించిన అనేక అంశాలపై వ్యాసాలు ఉన్న ఈ పుస్తకాన్ని రైతు నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు సంకలనంగా ముద్రించారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. అటవీ సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణపై ఇలాంటి పుస్తకాలు ప్రజల్లో అవగాహన పెంచుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ సలహాదారు పి.మల్లికార్జునరావు, పుస్తక రచయిత ఎం.రామ్మోహన్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.




# కాలానికి అనుగుణంగా మారుతున్న ఆర్‌పిఎఫ్

ప్రజాపక్షం/హైదరాబాద్: భారతీయరైల్వే ఆస్తులు, ప్రయాణికులు, ప్రయాణికుల ప్రాంతాల భద్రతకు కాపలాగా నిలిచే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) కాలానికి అనుగుణంగా తన రూపురేఖలను మార్చుకుంటూ ఆధునిక భద్రతా బలగంగా ఎదిగింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సాయుధ దళంగా ఉన్న ఆర్‌పిఎఫ్, 1957లో అమల్లోకి వచ్చిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ చట్టం కింద ఏర్పాటు అయింది. 1953లో ప్రత్యేక భద్రతా సంస్థ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో, ఆస్తుల రక్షణకే పరిమితమైన విభాగంగా మొదలైన ఆర్‌పిఎఫ్, కాలక్రమేణా సమగ్ర రైల్వే భద్రతా బలగంగా రూపాంతరం చెందింది. 2003లో ఆర్‌పిఎఫ్ చట్టం, రైల్వే చట్టాలకు చేసిన సవరణలతో, ఉగ్రవాదం, అతివాదం, సంఘటిత నేరాలు వంటి రైల్వే భద్రతకు ముప్పుగా మారే అంశాలను ఎదుర్కొనే బాధ్యత కూడా ఆర్‌పిఎఫ్ పరిధిలోకి వచ్చింది. ఈ క్రమంలో ప్రభుత్వ రైల్వే పోలీస్ (జిఆర్‌పి), రాష్ట్ర పోలీస్ బలగాలతో సమన్వయంతో పని చేస్తూ దేశవ్యాప్తంగా రైల్వే భద్రతను మరింత పటిష్టం చేస్తోంది. 2025 నాటికి ఆర్‌పిఎఫ్ ఆధునిక సాంకేతికత ఆధారిత, సమగ్ర సమానత్వాన్ని ప్రతిబింబించే సంస్థగా ఎదిగింది. ప్రస్తుతం 74 వేల మందికి పైగా సిబ్బందితో పనిచేస్తున్న ఆర్‌పిఎఫ్ అందులో సుమారు 9శాతం మహిళలు ఉండటం విశేషం. ఇది కేంద్ర పారామిలటరీ బలగాల్లోనే అత్యధిక మహిళా ప్రాతినిధ్యంగా నిలిచింది. 2025లో సోనాలి మిశ్రా ఆర్‌పిఎఫ్ తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా నియమితులవడం చరిత్రాత్మక ఘట్టం. డిజిటల్ మార్పుల దిశగా ఆర్‌పిఎఫ్ అడుగులు వేస్తూ, ఎఐ ఆధారిత నిఘా వ్యవస్థలు, సైబర్ సెల్స్, ఆర్‌పిఎఫ్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఆర్‌ఎస్‌ఎంఎస్ ), ఈఆఫీస్ వంటి ఆధునిక వ్యవస్థలను అమలు చేస్తోంది. వీటి ద్వారా పారదర్శకత, పనితీరు మరింత మెరుగుపడుతోంది. ప్రయాణికుల సంక్షేమం, మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ‘ఆపరేషన్ నన్హే ఫరిష్తే’, ‘ఆపరేషన్ నార్కోస్’, ‘ఆపరేషన్ మాతృశక్తి’, ‘మెరి సాహేలీ’ వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోంది. ప్రజాసేవ, జాతీయ భద్రతే లక్ష్యంగా ఆర్‌పిఎఫ్ ప్రత్యేక విభాగాలు అయిన కొరస్ ద్వారా సామర్థ్యాలను పెంపొందిస్తోంది. అధునాతన శిక్షణ, సిబ్బంది సంక్షేమ పథకాలతో పాటు విపత్తు నిర్వహణ, సహాయక చర్యలు, రక్షణ ఆపరేషన్లు, సామాజిక అవగాహన కార్యక్రమాల్లోనూ ఆర్‌పిఎఫ్ కీలక పాత్ర పోషిస్తోంది. ‘సేవా హీ సంకల్ప్’ (సేవే సంకల్పం) అనే నినాదాన్ని ఆచరణలో పెడుతూ, నేడు ఆర్‌పిఎఫ్ నిజాయితీ, ధైర్యం, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. రోజూ కోట్లాది మంది ప్రయాణించే భారతదేశ విస్తారమైన రైల్వే నెట్‌వర్క్‌లో ప్రయాణికుల భద్రత, గౌరవాన్ని కాపాడడంలో ఆర్‌పిఎఫ్ కీలక భూమిక పోషిస్తోంది.

# దేశ పాలనను చొరబాటుదారులు నిర్ణయించొద్దు

### అందుకే ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం : కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశ పాలన వ్యవస్థను చొరబాటుదారులు నిర్ణయించకుండా ఉండేందుకే ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం చేపట్టిందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని బిజెపి నగర పార్టీ కార్యాలయంలో శనివారం ‘సర్’ కార్యక్రమంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, బిజెపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్‌రావు, ఉపాధ్యక్షులు బద్దం మహిపాల్‌రెడ్డి, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, సిటీ సెంట్రల్ పార్టీ అధ్యక్షుడు దీపక్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, అజయ్ కుమార్, పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికలపై వ్యూహాలు, కార్యకర్తల పాత్రపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల వ్యవస్థకు ఓటరు పునాది అని కిషన్ రెడ్డి అన్నారు. ఆ పునాది స్వచ్ఛంగా ఉండేలా చూసేది ఓటరు జాబితా, ఆ జాబితాను స్వచ్ఛంగా ఉంచడం ఎన్నికల సంఘం బాధ్యత అన్నారు. ఈ క్రమంలోనే కాలానుగుణంగా ఓటర్ల జాబితా సవరణలు జరుగుతుంటాయని చెప్పారు. భారత ఎన్నికల చరిత్రలో అనేకసార్లు ప్రత్యేక సవరణలు జరిగాయన్నారు.






# కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన సభలో పల్లా వెంకట రెడ్డి ప్రసంగిస్తూ భారత స్వాతంత్ర్య, భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం సందర్భంగా జరిగిన పోరాటాల్లో భారత కమ్యూనిస్టు పార్టీకి గణనీయమైన చరిత్ర ఉన్నదని, కమ్యూనిస్టు పార్టీ లేకపోతే తమకు ఎదురు ఉండదనే ఉద్దేశంతోనే మోదీ ప్రభుత్వం పోరాట, ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు చెందిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను బిజెపి గొప్పగా చెప్పుకుంటుందని, వల్లభాయ్ వల్లనే హైదరాబాద్ విలీనమైందని చరిత్రను వక్రీకరిస్తోందని విమర్శించారు. ఎటువంటి పోరాటంతో వల్లభాయ పటేల్ హైదరాబాద్‌ను విలీనం చేశారని?, నిజాం బేషరతుగా హైదారాబాద్‌ను విలీనం చేయలేదని, ఆయనకు రాజ్‌ప్రముఖ్ ఇస్తామని కేంద్రం ఒప్పందం చేసుకున్నదని పల్లా వెంకట రెడ్డి వివరించారు. మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని, అప్పటికే పది లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులు ప్రజలకు పంపిణీ చేశారని, దీంతో హైదరాబాద్ కమ్యూనిస్టుల వశమౌతుందనే భయంతోనే హైదరాబాద్‌లో విలీనానికి ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో బిజెపి పాత్రనే లేదని, భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధిస్తే, కమ్యూనిస్టు నాయకులు నాటి కాంగ్రెస్ సంస్థలో (అప్పటికి రాజకీయ పార్టీ కాదు) చేరి ఉద్య మించారని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ సంస్థను రాజకీయ పార్టీగా ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. భారత కమ్యూనిస్టు నాయకులు సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పిలుపునిచ్చారని, ఆ తర్వాతే కాంగ్రెస్ నాయకులు సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదాన్ని ఎంచుకున్నారన్నారు. భారతదేశ పోరాట చరిత్రను బిజెపి, కాంగ్రెస్ వక్రీకరిస్తోందని మండిపడ్డారు. భారత స్వాతంత్ర్య పోరాటం నుంచి ఆ తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, విద్య, ఉద్యోగ, ఉపాధి, గృహ సమస్యలపై విరోచిత పోరాటం చేసిందని, ఫలితంగా అనేక చట్టాలను, హక్కులను సాధించిందని, అందుకే కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ వంద సంవత్సరాలుగా ప్రజల పక్షాన నిలబడుతున్నదన్నారు. దామాషా పద్ధతిన ఎన్నికలను నిర్వహించాలని, అలా చేస్తే కమ్యూనిస్టులకు రావాల్సిన ప్రాతినిధ్యం దక్కుతుందన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా నాటి ప్రధాని జవరహర్‌లాల్‌నెహ్రూ బ్యాంకులను జాతీయకరణ చేశారని, ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేశారని, కానీ మోదీ ప్రభుత్వం లాభాల్లో ఉన్న ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తోందని, కార్పొరేట్ల రుణాలను మాఫీ చేస్తున్న కేంద్రం, వ్యవసాయ కార్మికుల రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదని నిలదీశారు. జనవరి 18వ తేదీన ఖమ్మంలో జరుగబోయే సిపిఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### బిజెపి, ఎంఐఎంకు పోరాట చరిత్ర లేదు : ఈ.టి.నర్సింహ



సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహ మాట్లాడుతూ... భారతదేశ, హైదరాబాద్ సంస్థాన చరిత్రలో పేదలు, కార్మికులు, రైతుల తరపున పోరాటం చేసిన చరిత్ర బిజెపి, ఎంఐఎంకు లేదని విమర్శించారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన సాయుధ పోరాట చరిత్రను కూడా బిజెపి వక్రీకరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోది అబద్దాలను ప్రచారం చేస్తే, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి దేశం మొత్తం తిరిగి విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో మోదీని 60 లక్షల మంది తిరస్కరించారన్నారు. హైదరాబాద్‌లో కమ్యూనిస్టు పార్టీకి వార్డు మెంబర్లు, కార్పొరేటర్లు లేకపోయినప్పటికీ పేదలకు భూమి పంపిణీ చేపట్టిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో సిపిఐ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందన్నారు. మతోన్మాద బిజెపి, ఎంఐఎం గుట్టు రట్టయితే ప్రజలే ఆ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం, ప్రజలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కమ్యూనిస్టు నాయకులు పోరాటం చేశారని ఈ.టి.నర్సింహ తెలిపారు. సభకు సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు ఎస్.చాయాదేవి, ఎ.రవీంద్ర చారి, సిపిఐ సీనియర్ నాయకులు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.ప్రేమ్ పావని, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి నేదునూరి జ్యోతి, నాయకురాలు ఆరుట్ల సుశీల, సిపిఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఇ.ఉమామహేశ్, సిపిఐ హైదరాబాద్ సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.నరసింహ, జి.చంద్రమోహన్ గౌడ్, ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, సిపిఐ నాయకులు పడాల నళిని తదితరులు పాల్గొన్నారు. కాగా సభ అనంతరం మహిళా నాయకులను పల్లా వెంకట రెడ్డి, ఈ.టి.నర్సింహ తదితరులు సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

### భారీ ప్రదర్శన

సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి నారాయణగూడలోని మార్వేల్ ఫంక్షన్ హాల్ వరకు సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎర్ర దుస్తులను ధరించి, ఎర్ర జెండాలను చేతబూని సిపిఐ శ్రేణులు కదం తొక్కారు. తలపై గొడుకు, కోలాటాలతో చిన్న పిల్లలు చేసిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com